## వడ్డే శోభనాద్రీశ్వరరావు



1) విద్యార్థి దశ నుండి ఆచార్య రంగా పట్ల ఆకర్షితుడై వ్యవసాయ రంగం – సమస్యల పట్ల ఆసక్తి – అధ్యయనం.

2) 1978 నుండి 1983 వరకు ఆంధ్రప్రదేశ్ శాసనసభలో చెఱకు, ప్రత్తి, వరి, పొగాకు మున్నగు వ్యవసాయ పంటల ధరల సమస్యలుపైన, ఇరిగేషన్ పథకాలపైన చర్చలలో పాల్గొనడం.

3) ఆంధ్రప్రదేశ్ కిసాన్ సమ్మేళనం అధ్యక్షునిగా నాటి ప్రధాని చౌదరి చరణ్‌సింగ్ గారిని చిలకలూరిపేటలో రాష్ట్ర మహా సభలకు, బహిరంగ సభ మరియు ఏలూరులో ధాన్యోత్పత్తిదారుల మహా సభలకు ఆహ్వానించడం.

4) విజయవాడలో పులిచింతల ప్రాజెక్టు కొరకు నాటి వివిధ రాజకీయ పక్షాల నాయకులను ఆహ్వానించి సదస్సు నిర్వహించడం.

5) టంగుటూరి అంజయ్య గారు ముఖ్యమంత్రిగా ఉండగా చెఱకు రైతులకు కొనుగోలు పన్ను ముదరా ఇప్పించుట కొరకు రాష్ట్ర చెఱకు రైతుల సంఘంతో కలసి కృషి చేయడం.

6) 8వ లోక్‌సభలో వ్యవసాయ పంటలకు గిట్టుబాటు ధరలు, భీమా సౌకర్యం, ఇరిగేషన్ సౌకర్యాలను విస్తరింపచేయవలసిన ఆవశ్యకత మున్నగు అనేక అంశములపై పలు పర్యాయములు ప్రసంగించడం

7) 10వ లోక్‌సభలో అనేక వ్యవసాయ సమస్యలపైన, డంకెల్ ముసాయిదా వలన భారత వ్యవసాయ రంగానికి ఎదురుకానున్న ఇబ్బందులు నష్టాల గురించి సుదీర్ఘంగా చర్చించడమేగాక ప్రఖ్యాత శాస్త్రవేత్త డా॥ శ్రీమతి సుమన సహాయ్ గారిచే హైదరాబాద్, విజయవాడ, ఏలూరు, జంగారెడ్డిగూడెంలలో ప్రసంగింపచేయడం.

8) పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధి నిధులకు ప్రజలు, స్థానిక సంస్థలు, ప్రజాప్రతినిధులు, జిల్లా పాల సహకార సమితి తోడ్పాటుతో 80 పాలసేకరణ కేంద్రములకు పక్కా భవనముల నిర్మాణము, లిఫ్ట్ ఇరిగేషన్ పథకములతో సహా పలు గ్రామాలకు రహదారులు, త్రాగునీరు, విద్యుత్ మున్నగు సేవలు అందించడం.

9) పంజాబ్ లోని "అప్నీ మండి" వ్యవస్థ గురించి నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడునకు చెప్పి "రైతు బజార్‌ల" ఏర్పాటుకు దోహదపడటం.

10) వ్యవసాయ మంత్రిగా ఎ) పొలంబడి బి) టి.వి.లో రైతు మిత్ర కార్యక్రమాన్ని ప్రారంభించి విస్తరణకు దోహదం చేయడం, సి) మొత్తం 23 జిల్లాలకు బెంగుళూరు లోని కేంద్రసంస్థ నుండి ఆయా ప్రాంతములలో భూమి స్వభావం ఏ పంటలకు అనుకూలం, ఎంత లోతులో ఏ మేరకు భూగర్భ జలాలు లభ్యమో తెలియపరచ్చు ఊకజూఖజుఊ్ప ఐం।ఉ ఖజుఆఐ ను సమకూర్చడం డి) నీరు–మీరు కార్యక్రమంలో రైతుల భాగస్వామ్యమును కల్పించి చెరువుల లోతు కార్యక్రమానికి దోహదపడటం ఇ) చలక, దుబ్బ, నేలలో వర్షాధారంగా బి.టి. పత్తి సాగును చేపట్టవద్దని రైతులకు తెలంగాణా ప్రాంతంలో విస్తృతంగా ప్రచారం చేయించడం ఎఫ్) రాజేంద్రనగర్ ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో "చౌదరి చరణ్‌సింగ్ అగ్రికల్చర్ టెక్నాలజీ ఇన్‌ఫర్‌మేషన్ సెంటర్"ను ఏర్పాటు చేయడం.

11) అనేక వ్యవసాయ అనుబంధ రంగాల సమస్యలతోబాటు పలు అంశముల గురించి ఈనాడు మున్నగు దినపత్రికలలో దాదాపు 90 వ్యాసములను పంపడం, వాటిని "దేశం కోసం రైతు, రైతు కోసం ఎవరు?" పుస్తక రూపంలో ప్రచురించడం.

12) రైతుల ప్రయోజనాలకు భంగం కలిగే సందర్భములలో తన అభిప్రాయములను నిర్మొహమాటంగా తెలియచేయడం.

# రైతాంగ సమస్యల పరిష్కారం కోసం
# రైతాంగ సమరభేరి అవశ్యకత



వడ్డే శోభనాద్రీశ్వరరావు

# రైతాంగ సమస్యల పరిష్కారం కోసం
# రైతాంగ సమర భేరి అవశ్యకత

వడ్డే శోభనాద్రీశ్వరరావు

## విషయసూచిక

1. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రైతాంగ సమర భేరి ........................ 05
2. కొనసాగుతున్న రైతుల ఆత్మహత్యలు ........................................ 09
3. సన్న, చిన్నకారు రైతుల కోసం వ్యవసాయ విధానం ............................ 11
అనుసరించ వలసిన వ్యూహాలు
4. కౌలు రైతుల కష్టాలు ఎప్పటికి తీరేను? .......................................... 16
5. రైతు గోడు పట్టని ప్రభుత్వాలు ................................................ 19
6. మోడి ప్రభుత్వానికి రైతు సంక్షేమము పట్టదా? ................................... 22
7. అనంతపురం నుండి అమరావతికి ఎక్స్‌ప్రెస్ హైవే అవసరమా? ....................... 27
8. అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డు పేరుతో రైతులకు ద్రోహం చేయటం తగునా? ... 31
9. మచిలీపట్నం పోర్టు - పారిశ్రామిక నడవా పేరుతో భూదందా తగదు .......... 34
10. ఇరు రాష్ట్రాలు సమన్వయంతో కరువును పారద్రోలాలి .......................... 37
11. బడుగులపై జి.ఎస్.టి. పిడుగులు ............................................. 41
12. ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం (ఆర్.సి.ఇ.పి) వలన ఎవరికి లాభం? . 44
13. నవ్యాంధ్రకు ప్రత్యేక హోదా తిరస్కరణ న్యాయమా? ............................ 49
14. ప్రజా సమస్యల పరిష్కారం - వికేంద్రీకరణతో కూడిన పరిపాలన ఈనాటి .... 53
తక్షణ అవసరం

## వడ్డే రైతు ప్రస్థానం

1970లో శ్రీమతి ఇందిరాగాంధీ నియంతృత్వ పోకడలను, కమ్యూనిస్టుల పిడి వాదాన్ని వ్యతిరేకించుతూ, దేశ సమగ్ర పురోగతికి సరైన మార్గమేదన్న అన్వేషణతో మొదలైన శ్రీ వడ్డే శోభనాద్రీశ్వరరావు గారి రాజకీయ ప్రస్థానం గత అర్థ శతాబ్దిగా నిరంతరం కొనసాగుతోంది.

ఈ అర్థ శతాబ్దిగా ఆయన శాసన సభ్యునిగా పార్లమెంటు సభ్యునిగా, వ్యవసాయ మంత్రిగా అనేక పదవులు అలంకరించినా, ఆయన అన్వేషణ మరింతటి తీవ్రతరమవుతోందే తప్ప, నేటి సమాజాన్ని వేధిస్తున్న మౌలిక సమస్యలకు పరిష్కారం దొరకడం లేదు. రాజకీయరంగంలోకి ప్రవేశించిన కొద్దీ కాలానికే తన శక్తి సామర్థ్యాలన్నీ రైతుల సంక్షేమం కోసం వినియోగించాలని నిర్ణయించుకోవడం జరిగింది.

దేశంలో 65 శాతం మంది ఆధారపడిన వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలు అన్నీ ఇన్నీ కావు. వ్యవసాయమంటే పొలాలలో పంటలు పండించడం మాత్రమే కాదు. ఈ పొలాల వెనుక ఉన్న రైతుల జీవితాల్లో వెలుగులు నింపడం. అదెలా సాధ్యమవుతుంది? వ్యవసాయరంగాన్ని వేధించే అనేకానేక క్లిష్ట సమస్యల నుండి తామెలా ప్రయోజనం పొందాలా అని రాజకీయవాదుల నుండి, వ్యాపారులు, బహుళ జాతి కంపెనీల వరకు అందరూ ఆరాటపడే వారే తప్ప, ఈ సమస్యలను ఎలా పరిష్కరించాలన్న తాపత్రయం ఎవ్వరిలోనూ కానరాదు. ఈ కారణం చేతనే వ్యవసాయ రంగం గురించి కృషి చేసే వారందరూ, తమకు నేటి సమాజంలో సహాయ సహకారాలందించే వారెవరూ లేకపోవడం చూసి నిరంతరం నిర్వేదానికి లోనవుతూ ఉంటారు. తమది ఒంటరి పోరాటమా అన్న నిరాశా, నిస్పృహలకు లోనవుతుంటారు.

వడ్డే రైతు ప్రస్థానంలో ఆయన నిరంతరం ఎదుర్కొనే సమస్య ఇదే! ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, తోటి సమాజంలోను, వ్యవసాయరంగంలోను అనేక మార్పులు వచ్చినా, శాస్త్ర సాంకేతిక రంగాల్లో పెను విప్లవం వచ్చినా, సామాన్య రైతులు జీవన స్థితిలో మార్పు ఎందుకు ఉండడం లేదు? రైతులు పేదరికం నుండి ఎందుకు విముక్తులు కావడం లేదు? అసలెప్పటికి రైతులు తోటి సమాజంలో తలెత్తుకుని నిలవడం సాధ్యమవుతుంది?

రైతుల ఆలోచనా ధోరణి సమూలంగా మారాలి. ఎంతగా నష్టం వచ్చినా, కష్టాలెన్ని ఎదురైనా మీకు పరిచయమున్న వ్యవసాయ పద్ధతులకు కట్టుబడి ఉండాలని, ఆత్మహత్యలు చేసుకొన్నా సరే వ్యవసాయాన్ని వదలవద్దని, వ్యవసాయాన్ని మరింతటి లాభదాయకంగా మార్చుకోవడమెలా అని అన్వేషించ వద్దని ఎవరు శాపం పెట్టారు? రైతులు తమపై తాము విధించుకొన్న శాపం ఇది. ఏ వృత్తిని చేపట్టినా, వ్యవసాయమైనా, వ్యాపారమైనా తమకు ఖచ్చితమైన ప్రయోజనం కలిగించేలా ఉండాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. ఎప్పటికప్పుడు తమ పద్ధతులు మార్చుకొంటుంటారు. లాభదాయక పద్ధతులను అనుసరిస్తారు. కాని వ్యవసాయం ఒక అలవాటుగా, ఒక దినచర్యగా పరిణమించిన తరువాత, కుటుంబ జీవనంలో లాభనష్టాలు చూసుకొని భార్యాభర్తలలాగా, రైతులు ప్రకృతితో అనుసంధానం కావడం తమ ప్రవృత్తిగా పరిగణిస్తూ ప్రతిదానికీ సర్దుకుపోవడం ప్రారంభిస్తారు. ఈ స్థితి మారాలి. వ్యవసాయం ఖచ్చితంగా లాభదాయకం కావాలి. వ్యవసాయంపై ఆధారపడిన వారి జీవన ప్రమాణాలు మెరుగుపడాలి. ఇదే వడ్డే రైతు ప్రస్థానం.

– చల్లగుళ్ళనరసింహారావు

❊ ❊ ❊



# రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రైతాంగ సమర భేరి

వ్యవసాయ ధరల కమీషన్ (సి.ఎ.సి.పి) పంట ఉత్పత్తి వ్యయం లెక్కకట్టు పద్దతి చాలా లోపభూయిష్టముగా, రైతాంగానికి నష్టం చేకూర్చేలా ఉందని స్వామినాథన్ కమీషన్ మరియు రమేష్‌చంద్ కమిటీలు స్పష్టంగా పేర్కొన్నాయి. పంటలపైన పెట్టిన పెట్టుబడులేకాక రైతులు తమ కుటుంబ సభ్యుల విధ్య, వైద్య మరియు సామాజిక అవుసరముల కొరకు విధిగా కొంత మొత్తాన్ని ఖర్చుచేయవలసి ఉంటుంది. దేశ ప్రజానీకానికి అవసరమైన ఆహారోత్పత్తులను అందించుటయేకాక పారిశ్రామిక రంగానికి కావాల్సిన పత్తి చెరకు, నూనె గింజలు, ఆహారోత్పత్తులు వంటి వాటినన్నింటిని అందిస్తూ ఉన్న రైతాంగ ప్రయోజనాలను విస్మరించుతూ, కోట్లాదిమంది రైతులను వ్యవసాయ రంగం నుండి బయటకు నెట్టి పరిశ్రమలు, మౌలిక రంగాలలో కూలీలుగా పనిచేయక తప్పని పరిస్థితులను ప్రభుత్వాలే కల్పిస్తున్నాయి. సమాజంలో యితర వర్గాలకు చెందిన ప్రజలు ఉద్యోగులు, కార్మికులు సంఘటిత శక్తితో ఎప్పటికప్పుడు తమ ప్రయోజనాలను మెరుగుపర్చుకోగల్గుతున్నారు కానీ రైతాంగం పరిస్థితి మాత్రం కొవ్వొత్తి చందంగా మారిపోయింది. 1970 నుండి చూస్తే వరి, గోదుమ మున్నగు పంటల మద్ధతు ధరలు యిప్పటికి కేవలం 20 రెట్లకు పెరగగా, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలు 115 రెట్లకు, యూనివర్శిటీలలో, కాలేజీలలో లెక్చరర్లు/ప్రొఫెసర్ల జీతభత్యాలు 160 రెట్లకు, ప్రభుత్వ పాఠశాలల లోని టీచర్లకు జీతభత్యాలు 250 రెట్లకు పైగా పెరిగాయి. ఈ నేపధ్యంలోనే దేశానికి వెన్నెముఖ అయిన రైతు కుటుంబం సమాజంలో తోటివారివలే గౌరవప్రదంగా జీవించగలగాలంటే ఉత్పత్తి వ్యయానికి అదనంగా 50% ధరను కలిపి ఇవ్వాలని స్వామినాథన్ కమీషన్ సిఫార్సు చేసింది.

వాతావరణంలో సంభవిస్తూ ఉన్న మార్పుల ఫలితంగా తరచుగా సంభవిస్తున్న కరువులు, తుఫానులు, అకాల, అధిక వర్షాల వంటి ప్రకృతి వైపరీత్యాల వలన రైతాంగం తీవ్రంగా నష్టపోతూ వుంది. అందువలన స్వామినాథన్ కమీషన్ "వ్యవసాయ రిస్క్

ఫండ్"ను ఏర్పరచి నష్టపోయిన రైతులను ఆదుకోవలెనని సిఫార్సు చేశారు. మార్కెట్‌లో కొన్ని సందర్భాలలో సంభవిస్తున్న తీవ్రమైన ఒడిదుడుకుల వలన నష్టపోతూ వున్న రైతాంగ ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్రప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు మరియు ఆర్థిక సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో "మార్కెట్ ధరల స్థిరీకరణ నిధి"ని ఏర్పారచాలని సూచించారు. లోగడ అమలు చేయబడిన పంటల భీమా పథకాలలో సన్నకారు చిన్నరైతులకు ఉంటూ వచ్చిన 50% ప్రీమియం సబ్సిడీని "ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన" పంటల భీమా పథకంలో ఉపసంహరించారు. ఈ పథకం ప్రైవేట్ ఇన్సూరెన్సు కంపెనీలకు కాసులను కురిపిస్తుంది కానీ, రైతులకు పెద్దగా మేలు చేకూర్చటం లేదు. ఉదా॥ 2016-17 ఖరీఫ్, రబీ సీజన్‌లలో రైతుల నుండి రూ.4,000 కోట్లు ప్రీమియంతోపాటు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు రూ.18,345 కోట్లు ప్రీమియం సబ్సిడీగా ఇన్సూరెన్స్ కంపెనీలకు అందించగా రైతులకు నష్టపరిహారంగా ముట్టినది మాత్రం కేవలం రూ.5,846 కోట్లు. నిబంధనలకు విరుద్ధంగా నష్టం జరిగిపోయిన చాలా నెలల తరువాత గానీ పరిహారం రైతులకు చేరడం లేదు. వాతావరణ భీమా పథకం క్రింద వర్షపాతం నమోదు ప్రక్రియలో చాలా లోటుపాట్లు కనిపించు తున్నాయి. ఫలితంగా ఈ స్కీం కూడా రైతులకు సరిగా ఉపయోగ పడటం లేదు.

మన దేశంలో అనావృష్టి, అతివృష్టి, తుఫానుల వలన ఏటా వేల కోట్ల రూపాయల విలువైన పంటలు దెబ్బతింటున్నాయి. ఇట్టి సందర్భాలలో ఎకరాకు కనీసం రూ.10,000/-ల ఇన్‌పుట్ సబ్సిడీని అందించాలని భూపేంద్రసింగ్ హుడా కమిటీ చేసిన సిఫార్సు అమలుకు నోచుకోలేదు. కేంద్రం పంపించే ఇన్‌పుట్ సబ్సిడీ మొత్తాన్ని బాధిత రైతులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అందచేయటం లేదు. ఫలితంగా తదుపరి పంట వేసుకోవడానికి రైతులు చాలా ఇబ్బందిపడుతున్నారు. మార్కెట్‌లో దళారీల మాయోపాయం వలన తీవ్రముగా నష్టపోతూ ఉన్నందున, బ్యాంకులకు సకాలములో ఋణాలను చెల్లించలేక పోవుచున్నందున రైతు ఋణమాఫీని అమలు చేయాలని జాతీయ స్థాయిలో 160 రైతు సంఘాల వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండు చేస్తూ ఉన్నారు. బడా పారిశ్రామిక వేత్తలకు, వ్యాపార వేత్తలకు లక్షలాది కోట్ల రూపాయల బకాయిలను మాఫీచేస్తున్న ప్రభుత్వ రంగ బ్యాంకు యాజమాన్యాలు రైతుల విషయము వచ్చేటప్పటికి మొండిచేయి చూపిస్తున్నాయి. లోగడ జనతా ప్రభుత్వంలో ఉప ప్రధానిగా దేవీలాల్ హయాములోను, డా॥ మన్‌మోహన్‌సింగ్ ప్రధానిగా యు.పి.ఎ. ప్రభుత్వ హయాములో కొంతమేరకు రైతు ఋణాలు మాఫీ అయ్యాయి. మోడీగారి ప్రభుత్వ హయాములో గత రెండేళ్ళలో బ్యాంకులు, బడా పారిశ్రామిక వేత్తలు మరియు వాణిజ్య సంస్థల బకాయిలను రూ.1,16,000 కోట్ల రూపాయల మేరకు మాఫీ చేసాయి. వరుసగా



ప్రకృతి వైపరీత్యాల వలన తీవ్రముగా నష్టపోయిన రైతుల విషయంలో మాత్రం బ్యాంకులు ఆర్థిక క్రమశిక్షణ గురించి వల్లెవేస్తున్నాయి. దేశ ఆహార భద్రత కొరకు మరియు రైతాంగ జీవన భద్రత కొరకు తప్పనిసరిగా దేశవ్యాప్తముగా పంటలను కోల్పోయిన రైతులకు ఋణమాఫీని

అమలు చేయాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వం రైతు ఋణ మాఫీ ప్రకటించినా యిప్పటికి 2 వాయిదాల మొత్తాలనే

జమచేయటం వలన రైతులకు ఉపశమనం కలుగలేదు. బ్యాంకులలో వడ్డీభారం నానాటికి పెరిగిపోతూవుంది. కావున ప్రభుత్వం ప్రకటించిన ఋణమాఫీని వెంటనే సంపూర్ణముగా అమలు చెయ్యాలి.

సన్నకారు, చిన్న రైతులలో 47.4% మంది ప్రైవేట్ ఋణాలపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారాయని జాతీయ శాంపిల్ సర్వే తేల్చి చెప్పింది. వ్యవసాయ ఋణాలలో సగం పైనే వ్యవసాయ ఆధార పరిశ్రమలకు, వ్యాపార సంస్థలకు వెళుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 16లక్షల మంది కౌలు రైతులు ఉండగా కేవలం 8లక్షల మందికి గుర్తింపు కార్డులు జారీచేయబడగా రూ.3,870కోట్లు ఋణం వారికి అందించాలని ప్రభుత్వం బ్యాంకులకు లక్ష్యాన్ని నిర్దేశించినా వాస్తవంగా వారికి అందినది రూ.400 కోట్లు లోపు మాత్రమే. కేరళలో రైతుల ఋణాల రిలీఫ్ కమీషన్ చట్టం 2006 అనుసరించి అన్ని రాష్ట్రాలలోనూ చట్టాలను చేసి వాటిని అమలు చేసేదానికి పటిష్టమైన విధివిధానాలను వ్యవస్థలను ఏర్పాటు చేసి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు లేక మార్కెట్‌లో ధరలు బాగా పడిపోయినపుడు చేపట్టవలసిన చర్యల గురించి ఈ కమీషన్ సూచించుతుంది. దేశవ్యాప్తంగా కోట్లాదిమంది సన్నకారు, చిన్నరైతులు ప్రైవేట్ వర్గాల నుంచి తీసుకున్న దాంట్లో చెల్లించవలసి ఉన్న అప్పు రూ.71,923 కోట్లు ప్రైవేట్ పంట ఋణాలను ప్రభుత్వ బ్యాంకుల లోనికి ట్రాన్స్‌ఫర్ చేసినపుడే ఈ రైతులకు వడ్డీ భారం గణనీయంగా తగ్గుతుంది. ఋణమాఫీ మొత్తంలో కేంద్రం 50% భరించాలి.

ఇప్పటికే పీకల లోతు మునిగి ఉన్న భారత్ వ్యవసాయ రంగం ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం వలన నిండా మునిగిపోయే ప్రమాదం ఉంది. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా దేశాలతోపాటు యూరోపియన్ యూనియన్ మరియు అమెరికాల నుండి సబ్సిడీతో కూడిన, చవకగా దిగుమతి అయ్యే పాల ఉత్పత్తులు మరియు పశుమాంసం వలన కోట్లాదిమంది రైతులకు, భూమిలేని పేదలకు కొంత మేరకు ఆసరా కల్పిస్తూ ఉన్న పశుపోషణ మరియు పాడిపరిశ్రమలపైన తీవ్రంగా దెబ్బతీస్తుంది. అలాగే ఇండోనేషియా, మలేషియా దేశాల నుండి ఇప్పటికే దిగుమతి అవుతూ ఉన్న పామాయిల్ వలన మన దేశంలోపల ఆయిల్‌ఫామ్ సాగుపైన ప్రతికూల

ప్రభావం పడుతూనే ఉంది. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వలన ఈ దిగుమతుల పరిమాణం మరింతగా పెరిగి ఆయిల్‌ఫామ్ సాగుతోపాటు కొబ్బరితోటలు, వేరుశెనగ, ఆముదాలు, ప్రొద్దుతిరుగుడు, సోయాబీన్ పంటల వంటి నూనె గింజల పంటలు సాగుకూడా దెబ్బతినే ప్రమాదం స్పష్టంగా కనిపించుతూ ఉంది. బహుళజాతి సంస్థల విత్తనాల ధరలు మరింత పెరిగి రైతులపైన పెనుభారం పడుతుంది.

పలు దశాబ్దముల పాటు మన దేశంలోని అన్ని రైతు సంఘాల సంఘటిత పోరాటాల ఫలితంగా "పారదర్శకతతో కూడిన భూసేకరణ, న్యాయమైన నష్టపరిహారం, పునరావాస, పునఃస్థాపిత చట్టము - 2013"ను పార్లమెంట్ ఆమోదించింది. ఈ చట్టములో కీలకమైన 70% ప్రజలు, గ్రామ పంచాయతీల ఆమోదం, సామాజిక ప్రభావ అంచనా, బహుళ పంటలు పండే భూములను పరిశ్రమలు, సెజ్ మున్నగు అవసరాలకు తీసుకోరాదన్న నిబంధనలను మినహాయిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యిటీవల విధానసభ, మండలిలలో మన రాష్ట్రానికి వర్తించేలా 2013 భూసేకరణ చట్టంను ఆమోదించి రాష్ట్రపతి ఆమోదం కొరకు పంపి ఉన్నది. అనేక చోట్ల అవసరంలేని మరియు వాస్తవ అవసరానికి మించి పేద రైతులు మరియు దశాబ్దముల తరబడి పేద ప్రజానీకం సాగుచేస్తూ వున్న ఎసైన్డు భూములను, రైతుల భూములను బలవంతంగా సేకరించుతూ ఉంది. ఉదా॥ మచిలీపట్నం పోర్టు - పోర్టు ఆధారిత పరిశ్రమలు కొరకు 33,000 ఎకరాలను, అమరావతి-అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే కొరకు 28,000 ఎకరాలను, అమరావతి ఔటర్ రింగురోడ్డు కొరకు 8000 ఎకరాలను, కృష్ణపట్నం వద్ద కోస్తా ఉపాది జోన్ కొరకు 26,000 ఎకరాలు, విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం ఉండగా కేవలం 40 కి.మీ దూరంలో ఉన్న భోగాపురం వద్ద మరొక అంతర్జాతీయ విమానాశ్రయము కొరకు 5000 ఎకరాలు, రూ. 1,05,000/- కోట్ల వ్యయ అంచనాతో తలపెట్టిన గోదావరి-పెన్నా లింకు కాలువ మరియు రిజర్వాయర్ల కొరకు లక్ష ఎకరములు పైగా భూమిని సేకరించవలసి ఉంటుంది. ఇప్పటికీ ఎ.పి.ఐ.ఐ.సి. వద్ద వేలాది ఎకరాల భూములు ఖాళీగా ఉండగా, ప్రతి జిల్లాలో తిరిగి ప్రాజెక్టులు, అభివృద్ధి పథకాల పేరుతో వేలాది ఎకరాల భూములను సేకరించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. అత్యంత పాశవికంగా అధికార యంత్రాంగాన్ని, పోలీసు యంత్రాంగాన్ని ఉపయోగిస్తూ ప్రాజెక్టు నిర్వాసితులకు నష్టపరిహారం అందించకుండానే ప్రాజెక్టుల నిర్మాణాలను కొనసాగించాలనుకుంటూ ఉండటం దుర్మార్గం. ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తిఅయిన తరువాత నిర్వాసితుల గోడు పట్టించుకోని నిర్వాహకాలు ఎన్నో ఉన్నాయి. అందువల్ల 2013 కేంద్ర భూసేకరణ చట్టంను అనుసరించి మాత్రమే అవసరమైన మేరకు మాత్రమే భూసేకరణ చేపట్టవచ్చు.



# కొనసాగుతున్న రైతుల ఆత్మహత్యలు

గత దశాబ్దంన్నర కాలంలో దేశవ్యాప్తంగా దాదాపు 2,75,000మంది రైతులు ఆత్మహత్యలు చేసుకొన్నారు. వీరిలో అత్యదికులు గిరిజనులు, షెడ్యూల్ కులాలు, వెనుకబడిన తరగతులకు చెందినవారు, సన్నకారు, చిన్నరైతులు, కౌలురైతులు ఆత్మహత్యలకు, అధిక వడ్డీలతో కూడిన ప్రైవేటు ఋణాలు, కరువు, తుఫాన్లు అధిక వర్షాలు, నాసిరకం విత్తనాలు, పంటల బీమా లేకపోవడం, అతి తక్కువ స్థాయిలో ఇన్‌పుట్ సబ్సిడీ, మార్కెట్లో దరల తీవ్రమైన ఒడుదుడుకులు కారణాలని పరిశీలనలో తేలింది. 2004లో యు.పి.ఎ. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రైతుల ఆత్మహత్యలకు కారణాలను నివారోణోపాయాలను, వ్యవసాయరంగాన్ని సంక్షోభం నుండి గట్టెక్కించటానికి అనుసరించవలసిన వ్యూహాన్ని తీసుకోవలసిన నిర్ధిష్ట కార్యాచరణను సూచించవలసినదిగా ప్రపంచ ప్రసిద్ధ వ్యవసాయ, ఆర్ధికవేత్త డాక్టర్ ఎం.ఎస్. స్వామిగారి నేతృత్వంలో జాతీయ రైతు కమీషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ కమీషన్ దేశవ్యాప్తంగా పర్యటించి అన్ని వర్గాల వారితో సమాలోచనలు జరిపి చక్కని రిపోర్టును 2006లో కేంద్రప్రభుత్వానికి అందచేసింది. యు.పి.ఎ. భ్రుత్వం ఆ రిపోర్టును పార్లమెంటులో చర్చించలేదు. కమీషన్ రిపోర్టులో అత్యంత కీలకమైన సిఫార్సులను ఆమోదించకుండా మినహాయించి కొన్నింటిని మాత్రమే ఆమోదించి "జాతీయ రైతు విధానంను" ప్రకటించింది. పంటల ఉత్పత్తి వ్యయాన్ని లెక్కించే విధానంలో వ్యవసాయ ధరల నిర్ణాయక సంఘం అనుసరిస్తున్న పద్దతిలో లోపాలున్నాయని, పరిగణనలో తీసుకోవాల్సిన 12 అంశాలలో ఎక్కువ అంశాలు రైతాంగ ప్రయోజనాలకు భంగం కలిగించేవిగా వున్నాయని వాటిని పునఃసమీక్షించవలసిన అవసరం ఉందని, ఈ సంఘానికి స్వయంప్రతిపత్తిని ఇవ్వాలని సూచించింది. రైతులు తీసుకునే పంట ఋణాలలో 65%ను వ్యవసాయంలో ఖర్చుల నిమిత్తం వాడుతూవుండగా మిగిలిన 35% రైతు కుటుంబం యొక్క పోషణ కొరకు, విద్యా, వైద్య ఖర్చుల నిమిత్తం, సామాజిక అవసరాల కొరకు ఖర్చు అగుతున్నదని గమనించి రైతు కుటుంబం గౌరవప్రదంగా జీవించాలంటే పంట ఉత్పత్తి వ్యయానికి 50% కలిపి ధరగా

నిర్ణయించాలని సిఫార్సు చేసింది. 2014 కొరకు అధికారంలో వున్న యు.పి.ఎ. ప్రభుత్వం కీలకమైన ఈ సిపార్సులను అమలుచేయలేదు. దరిమిలా అధికారంలోకి వచ్చిన మోడీగారి ప్రభుత్వం కూడా ఈ సిఫార్సులను అమలు చేయటం లేదు. పైపెచ్చు స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయవలసిన ఆవశ్యకత గురించి సుప్రీంకోర్టులో దాఖలు అయిన కేసు విచారణ సందర్భముగా "వ్యవసాయ ధరల నిర్ణాయక సంఘం (సి.ఎ.సి.పి) ఆదాయమును సమకూర్చే సంస్థ కాదని, అయిన ఖర్చుకు పైన అదనముగా కొంత మొత్తమును యివ్వాలన్న విధానం లేదని, ఉత్పత్తి వ్యయానికి 50% కలిపి ధరను ఇస్తే మార్కెట్లు తల్లక్రిందులైపోతాయని, అందువలన స్వామినాథన్ కమీషన్ ఆమోదించడం సాధ్యపడదని అఫిడవిట్‌లో పేర్కొన్నది. 2014 సార్వత్రిక ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ, తెలుగుదేశం పార్టీ రెండు కూడా ఉత్పత్తి వ్యయానికి 50% కలిపి రైతులకు ధర యిస్తామని ఎన్నికల ప్రణాళికలో హామీ యివ్వటమేకా, బహిరంగ సభలలో పదేపదే హామీ ఇచ్చి ఉన్నారు. యిప్పుడు ఈ రెండు ప్రభుత్వముల దోరణి గతంలో యు.పి.ఎ. ప్రభుత్వం అనుసరించిన రైతు వ్యతిరేక దోరణిలోనే కొనసాగుతూ వుంది.

❊ ❊ ❊



# సన్న, చిన్నకారు రైతుల కోసం వ్యవసాయ విధానం అనుసరించ వలసిన వ్యూహాలు

మనదేశంలో మొత్తం వ్యవసాయ కమతాలలో 85శాతం సన్నకారు, చిన్న కమతాలే. మొత్తం సాగు విస్తీర్ణం దాదాపు సగం విస్తీర్ణములో వ్యవసాయాన్ని సన్నకారు, చిన్న రైతులు మరియు కౌలు రైతులు సాగుచేస్తూ ఉన్నారు. మన దేశంలోని 9 కోట్ల 77 లక్షల కమతాలలో ఒక హెక్టారుకన్నా తక్కువ భూమి కలిగినవారు 5 కోట్ల 67 లక్షలు (58%), 1 నుండి 2 హెక్టార్ల భూమి కలిగిన రైతులు 1 కోటి 32 లక్షలు (13.5), 2 నుండి 4 హెక్టార్ల భూమి కలిగినవారు 1 కోటి 78 లక్షలు (18%), 4 నుండి 10 హెక్టార్ల భూమి కలిగిన మధ్య తరగతి రైతులు 79 లక్షల 20 వేలు (8%), 10 హెక్టార్ల పైన భూమి కలిగిన పెద్ద రైతులు 19 లక్షల మంది (2%), దేశంలోని 14.2 కోట్ల హెక్టార్ల సాగు భూమిలో సన్నకారు రైతుల క్రింద 13.2%, చిన్న రైతుల క్రింద 15.6%, దిగువ మధ్య తరగతి రైతు క్రింద 22.3%, ఎగువ మధ్య తరగతి రైతుల క్రింద 28.7, పెద్ద రైతుల క్రింద 20% సాగుభూమి ఉంది. పలుకారణముల వలన కోట్లాదిమంది కౌలు రైతులు వివిధ పంటలను సాగుచేస్తూ ఉన్నారు. తెలంగాణా రాష్ట్రంలో 10 లక్షల మంది. నవ్యాంధ్రప్రదేశ్‌లో 16.25 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారని అంచనా.

1948లోనే పారిశ్రామిక విధానాన్ని తెచ్చిన కేంద్రప్రభుత్వం స్వాతంత్ర్యానంతరం 53 సం.ల తరువాత మొదటిసారి 2000 సంవత్సరములో "జాతీయ వ్యవసాయ విధానాన్ని" రూపొందించింది. వ్యవసాయ రంగం, రైతులు ఎదుర్కొంటూ వున్న కొన్ని సవాళ్ళను ప్రస్తావించిన జాతీయ వ్యవసాయ విధానంలో ఆ సవాళ్ళను అధిగమించటానికి వివిధ ప్రాంతాలలోని భౌగోళిక పరిస్థితులు, లభ్యమయ్యే భూమి, నీరు, మానవవనరులు, పశు, వృక్ష సంబంధ వనరులను వినియోగిస్తూ వ్యవసాయ రంగ అభివృద్ధికి, సన్నకారు, చిన్న రైతులతో సహా యావన్మంది రైతులకు వ్యవసాయ కార్మికులకు జీవన ప్రమాణాలు

మెరుగవ్వటానికి అవసరమైన నిర్ధిష్టమైన విధానపర నిర్ణయాలను పొందుపరచి వుండలేదు. ఫలితంగా 1991 నుండి 2011 మధ్యకాలంలో దాదాపు 150 లక్షల మంది రైతులు వ్యవసాయాన్ని విడనాడి, వేరే వ్యాపకాల లోనికి వెళ్ళిపోయారని జాతీయ జనగణన సర్వే తెలియచేసింది. అంతేకాక దాదాపు 3 లక్షల మంది రైతులు ఆత్మహత్యలకు ఒడిగట్టారని చెప్పబడింది. వీరిలో అత్యధిక శాతం సన్నకారు, చిన్న, కౌలు రైతులు.

మనదేశంలో వ్యవసాయం ఒక జీవన విధానం. దేశీయ స్థూల ఉత్పత్తి (జి.డి.పి)లో వ్యవసాయం, అనుబంధ రంగాల వాటా 51శాతం నుండి ప్రస్తుతం 14 శాతానికి తగ్గిపోయినా ఈనాటికి అత్యధిక శాతం ప్రజలకు ఉపాదిని మరియు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించుతూ వున్న రంగం వ్యవసాయ రంగమే. ఈ నేపధ్యంలో సన్నకారు, చిన్న రైతుల ఆర్ధిక ప్రగతికి ఆవశ్యకమైన విధానాలను రూపొందించి అమలు చెయ్యవలసిన అవసరం ఎంతైనా వుంది.

**1. ఎ.** సన్నకారు, చిన్న రైతులు, కౌలు రైతులందరికి సకాలంలో పంట ఋణాలను, పెట్టుబడి ఋణాలను విధిగా అందచెయ్యాలి. ప్రాధాన్యతా వ్యవసాయం-అనుబంధ రంగాలకు బ్యాంకులు తాము అందచేయు ఋణ వితరణలో 18 శాతం అందచెయ్యాలనే నిబంధన ఉన్నప్పటికి, ఈనాడు అది 10.5 శాతంనకు మించడం లేదు. వ్యవసాయ ఋణాలలో "రిస్క్" ఉంటుందన్న భావనతో బ్యాంకులు వ్యవసాయదారులందరికి ఋణ పరపతిని అందచేయుటలో నిర్లక్ష్యం చూపుతున్నాయి. అంతేగాక చక్కెర ఫ్యాక్టరీలు, స్పిన్నింగు మిల్లులు, నూనె మిల్లులు మున్నగు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు అందచేయు ఋణపరపతిని "పరోక్ష వ్యవసాయ ఋణం" (ఇన్ డైరెక్ట్ అగ్రికల్చరల్ లెండింగ్)గా పరిగణించటం వలన, వ్యవసాయము అనుబంద రంగాలకు లభించవలసిన వ్యవసాయ ఋణం గణనీయంగా తగ్గిపోయినది. ఏటా వ్యవసాయ ఋణాల మొత్తం పరిమితి పెరుగుతూ వున్నా అందులో వాస్తవంగా రైతులకు ముఖ్యంగా సన్నకారు, చిన్న రైతులకు, కౌలు రైతులకు అందుతూ వున్న ఋణం చాలా తక్కువ స్థాయిలో ఉంటుంది. ఉదాహరణకు మార్చి 2013లో రిజర్వుబ్యాంకు సమాచారం ప్రకారం మనదేశంలోని వాణిజ్య బ్యాంకులు రూ.5.81లక్షల కోట్లు వ్యవసాయ రంగానికి అందచేయబడిందని తెలిపినా, అందులో రూ.2.48 లక్షల కోట్లు గ్రామీణ వ్యవసాయ ఋణంగా అందచేయబడగా (అనగా మొత్తం బ్యాంకుల ఋణ పరపతిలో యిది 4.5 శాతం మాత్రమే అవుతుంది). మిగిలిన 6% ఋణాన్ని బ్యాంకులు పట్టణ మరియు నగరములలోని రైతులకు అందజేసాయి.



**1. బి.** సకాలంలో వ్యవసాయ ఋణాలను తిరిగి చెల్లించిన వారికి 7% వడ్డీ రాయితీని పొందే సౌలభ్యాన్ని కొనసాగించాలి.

**1. సి.** సన్నకారు, చిన్న రైతులు, కౌలు రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుండి తీసుకున్న ఋణములను జాతీయ, సహకార బ్యాంకులకు మళ్ళించి బ్యాంకు ఋణాలుగా తక్కువ వడ్డీ భారంతో సాగుచేసుకునే వెసులుబాటు కల్పించాలి.

**1. డి.** నవ్యాంధ్రప్రదేశ్ లోని 16.25 లక్షలమంది కౌలు రైతులలో 5లక్షలమంది ఋణార్హత కార్డులు పొందినా ఋణం లభించింది 95వేల మందికి మాత్రమే. మొత్తంగా కౌలు రైతులకు అందినది 215 కోట్లు మాత్రమే.

**1. ఇ.** "ఫార్మ్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్"లు బహుళ సంఖ్యలో ఏర్పాటు చెయ్యబడి, అవి నిలబడేంతవరకు కనీసం 5 సం.లపాటు ప్రభుత్వము కౌంటర్ గ్యారంటీ యిచ్చేలా విధానం ఉండాలి.

**1. ఎఫ్.** జాతీయ బ్యాంకుల కన్నా పల్లెసీమల లోని సహకార బ్యాంకులు గ్రామీణ ప్రజలతో సన్నిహిత సంబంధములు కలిగి ఉంటాయి కావున సహకార బ్యాంకుల వ్యవస్థను పటిష్టపరచి సన్నకారు, చిన్నరైతులతో సహా యావన్మంది రైతులకు వ్యవసాయమునకు, అనుబంద వ్యాపకాలైన పశుపోషణ, డైరీ, పౌల్ట్రీ, మత్స్య రంగాలకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక ఋణపరపతి అందించబడాలి.

**2.ఎ.** కరువు, తుఫాన్లు, అకాల భారీ వర్షములు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు సన్నకారు, చిన్న రైతులు కౌలు రైతులతో సహా ఇన్‌పుట్ సబ్సిడీని పంటల భీమా పథకం వర్తించని రైతులందరికి అందించేలా విధాన రూపకల్పన జరగాలి.

**2.బి.** బ్రిటీష్ కాలంలోని "కరువు మాన్యువల్"ను సవరించి జరిగిన పంట నష్టమును సరిగా అంచనావేసి అందుకు అనుగుణమైన స్థాయిలో ఇన్‌పుట్ సబ్సిడీని కనీసం "భూపేంద్ర హుడా" కమిటీ సిఫార్సునకు తగ్గకుండా అందించాలి.

**2.సి.** ప్రకృతి వైపరీత్యముల పర్యవసానముగా వాయిదాపడిన ఋణ మొత్తములపై బ్యాంకులు వడ్డీ వసూలు చెయ్యరాదని బ్యాంకులకు స్పష్టమైన ఆదేశములు యివ్వాలి.

**2.డి.** వరుసగా రెండు సంవత్సరములు ప్రకృతి వైపరీత్యాలు సంభవించి నష్టాలపాలైనప్పుడు రైతులందరికి మరీ ముఖ్యంగా సన్నకారు, చిన్న రైతులు, కౌలు రైతులకు ఋణమాఫీని వర్తింప చెయ్యాలి.

**3.ఎ.** డాక్టర్ ఎమ్.ఎస్. స్వామినాథన్ నేతృత్వంలోని "జాతీయ రైతు కమీషన్" సూచించిన విధంగా పంట సాగు వ్యయమునకు 50%ను అదనముగా కలిపి, గిట్టుబాటు ధరను ప్రకటించి, సాగుతోపాటు కుటుంబ సభ్యుల విధ్య, వైద్య, సామాజిక అవుసరాలను తీర్చుకుంటూ ఆత్మ గౌరవంతో జీవించగలిగే విధానమును తప్పనిసరిగా అమలు చెయ్యాలి.

**3. బి.** ఔషదములతో సహా పారిశ్రామిక ఉత్పత్తులకు 12% నుండి దాదాపు 200% వరకు మార్జిన్ ఉంచుకుని ఉత్పత్తిదారుడే వస్తువు ధరను నిర్ణయించుకొనే అవకాశం ఉండగా, అనేక కష్టనష్టాలను భరించుతూ, రాత్రనక, పగలనక, ఎండనక, వాననక ఆరుగాలం శ్రమిస్తూ రైతు పండించిన పంటకు మాత్రం కనీసం ఉత్పత్తి వ్యయమునకు తగినట్లుగా కనీస మద్దతు ధరను కూడా యివ్వని ప్రస్తుత వ్యవసాయ ధరల నిర్ణాయక కమిటీ (సి.ఎ.సి.పి) లెక్కింపు విధానంలో సంపూర్ణముగా మార్పు రావలసి వుంది. ఏ పార్టీ అధికారంలో వున్నా రైతు సంక్షేమం పట్టని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచనా విధానం లోనే మార్పు రావలసిన అవసరం ఎంతో వుంది.

**4. ఎ.** మనదేశం ప్రపంచ వాణిజ్య సంస్థలో చేరిన దరిమిలా పరిమాణాత్మక ఆంక్షలను తొలగించిన కారణంగా పలు వ్యవసాయ-అనుబంధ రంగాల ఉత్పత్తులు ఓపెన్ జనరల్ మార్గంలో దిగుమతి అవుతూ మన రైతాంగ ఉత్పత్తులను నష్టపరుస్తూ వున్న అంశమును గుర్తించి అవుసరమైన మేరకు దిగుమతి సుంకములను పెంచుతూ దేశీయ రైతులు, మరీ ముఖ్యంగా సన్నకారు, చిన్న రైతుల ప్రయోజనాలను పరిరక్షించాలి.

**4. బి.** వ్యసాయ అనుబంధ రంగాలు, ఉద్యానవన పంటల ధరలు దేశీయ మార్కెట్‌లో బాగా తగ్గినపుడు రైతులను ఆదుకొనటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరించి "మార్కెట్ స్థిరీకరణ నిధి"ని ఏర్పరచి మార్కెట్ ఇంటర్ వెన్షన్ స్కీమ్ (ఎమ్.ఐ.ఎస్) ద్వారా రైతులను ఆదుకోవాలి.

**5.** 10 హెక్టార్లలోపు రైతులను "రీసోర్స్ పూర్ ఫార్మర్స్"గా భారత ప్రభుత్వం డబ్ల్యు.టి.ఓ. సంస్థకు తెలియపర్చి ఉన్నది. ఈ రైతులకు పంటల భీమా, మద్దతు ధరలు, ఇన్‌పుట్ సబ్సిడీ, మార్కెట్ ఇంటర్ వెన్షన్ స్కీమ్, వ్యవసాయ యాంత్రీకరణ, భూసార పెంపు, విత్తనముల సరఫరా మున్నగు పథకాల ద్వారా ఎంత మేరకైనా మద్దతును అందించే వెసులుబాటును "గ్రీన్ బాక్స్" అనుమతిస్తుంది. కావున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవుసరమైన మేరకు ఎట్టి సంకోచము లేకుండా రైతులకు మద్దతును అందించాలి.

**6.** మనదేశం నుండి విదేశాలకు ఎగుమతి చెయ్యటానికి సన్నబియ్యం, బాసుమతి బియ్యం, పంచదార, పసుపు, మిర్చి, సుగంద ద్రవ్యాలు, ఉద్యాన ఉత్పత్తుల నాణ్యతా ప్రమాణములను, క్రిమిసంహారక మందుల అవశేషాలను అనుమతించబడే స్థాయిలోపలనే ఉండే విధముగా రైతులకు, మరీ ముఖ్యంగా సన్నకారు, చిన్న రైతులకు అవగాహనను కల్పించడమేకాక అందుకు అవుసరమైన లేబరేటరీలను ఏర్పరచి, సర్టిఫికెట్ యిచ్చే వ్యవస్థలను ఏర్పరచాలి. ఎగుమతి అనుకూల పంటలను పండించేందుకు "అగ్రి జోన్లను" పెద్ద సంఖ్యలో ఏర్పరచి రైతులను భాగస్వాములుగా చెయ్యాలి.

**7.** అవసరానికి మించిన స్థాయిలో రసాయనిక ఎరువులను, పురుగు మందులను విచక్షణారహితంగా వాడటం వలన భూసారం తగ్గటం, మానవుల ఆరోగ్యమునకు,



పర్యావరణమునకు భంగం, ఉత్పత్తి వ్యయం పెరగటం వంటి అనర్ధకములు సంభవించుతూ వున్నందున పర్యావరణ హితముగా సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, అందుకు అవసరమైన గోవు, వర్మి కంపోస్టు, బయో పెర్టిలైజర్స్‌ను రైతులకు అందుబాటులోనికి తీసుకొని రావాలి.

**8.** ఇటీవల ప్రకటించిన "ప్రధానమంత్రి పసల్ భీమా యోజన పథకాన్ని" పకడ్బందీగా అమలు చేసి సన్నకారు, చిన్న రైతులకు, కౌలు రైతులకు తక్కువ ప్రీమియం రేట్లతో పంటల భీమా ప్రయోజనం అందేలా చర్యలు తీసుకొనబడాలి. వాణిజ్య, ఉద్యానవన పంటలకు కూడా ఎక్చ్యురియల్ ప్రీమియం కాకుండా 2 లేక 3 శాతం మిగలకుండా ప్రీమియంను లెక్కించి, అందులో సన్నకారు, చిన్నరైతులు, కౌలు రైతులకు 50% ప్రీమియం సబ్సిడీ ఉండేలా చూడాలి.

వ్యవసాయ రంగం నుండి హెచ్చుమంది ప్రజలను యితర రంగాల లోనికి తరలించాలనే అంతర్గత ఆలోచనతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయం గిట్టుబాటుకాని పరిస్థితిని కల్పిస్తున్నాయి. ప్రణాళిక సంఘం స్థానంలో నూతనముగా ఏర్పడిన "నీతి ఆయోగ్" వైస్ చైర్మన్ అరవింద్ పనగారియా "వ్యవసాయం ఆదాయం చేకూర్చు వ్యాపకం కాదని, వ్యవసాయమునకు ప్రాధాన్యతను యివ్వనవసరంలేదని, పరిశ్రమలు-సేవల రంగముల ద్వారా మాత్రమే భారత్ సౌభాగ్యవంతమవుతుందని" తమ మనసు లోని భావనలను స్పష్టంగా బహిరంగపర్చి యున్నారు. నూటికి 60%కు పైగా ఉన్న రైతులు, శ్రామికులు చేతివృత్తిదారులకు మెరుగైన ఆదాయముతో వారి కొనుగోలు శక్తి పెరిగినప్పుడు మాత్రమే పరిశ్రమలలో తయారగు వస్తువులకు డిమాండ్ ఉంటుందన్న ప్రాథమిక సూత్రాన్ని కావాలని విస్మరించుతూ, యిప్పటి వరకు అమలు చేసిన విధానాల వలననే గ్రామీణ భారతం ఎన్నో ఒడుదుడుకులను ఎదుర్కోవలసి వస్తూ ఉన్నదన్న యదార్ధమును గుర్తించి యిప్పుడైనా వ్యవసాయము అనుబంధ వ్యాపకాలకు ప్రథమ ప్రాధాన్యతను యిచ్చి తీరాలి. కేవలం మాటలతో కాకుండా చేతలలో ఈ రంగాలకు బడ్జెట్‌లలో 10 నుండి 15%ను కేటాయించాలి. మనదేశ ప్రజలందరి ఆహార అవసరాలను తీర్చుటమేకాక, పరిశ్రమలకు ఇన్‌పుట్స్‌ను అందించడమేకాక, అత్యంత విలువైన విదేశీమారక ద్రవ్యమును సముపార్జించగల వ్యవసాయము, ఉద్యానవనాలు, పశుపోషణ-డైరీ, పౌల్ట్రీ, మత్స్య రంగాల పురోభివృద్ధికి అవసరమైన విధంగా నూతన విధానాలను, వ్యూహాలను రూపొందించి చిత్తశుద్ధితో అమలు చెయ్యాలి. సామాజిక-అభివృద్ధి పథకాలకు "పారదర్శకతతో కూడిన న్యాయమైన నష్టపరిహారము, పునరావాస చట్టం-2013" లోని నియమములను అనుసరించి మాత్రమే భూసేకరణను చేపట్టాలి బహుళ పంటల వ్యవసాయ భూములను తీసుకొనరాదు.

* * *

# కౌలు రైతుల కష్టాలు ఎప్పటికి తీరేను?

మన భారతదేశంలో వివిద రాష్ట్రాలలో పురాతన కాలం నుండి వ్యవసాయ భూముల యాజమాన్య స్థితిగతులలో చోటుచేసుకున్న చారిత్రక పరిణామాలను శోధాహరణముగా, సులభశైలిలో ఈనాటి తరం వారికి తెలియ చెప్పేందుకు చేసిన కృషి అభినందనీయం. భూమాతను నమ్ముకొని, ఎండనక, వాననక, రాత్రనక, పగలనక ఎన్నో కష్టనష్టములను ఓర్చుకుంటూ పంటలను పండిస్తూ దేశ ప్రజానీకానికి అవుసరమైన ఆహార పదార్ధములను అందించడంతోపాటు పరిశ్రమలు నడవడానికి అవసరమయ్యే ప్రత్తి, చెఱకు, కొబ్బరి, వరి, గోదుమ, పప్పు ధాన్యములు, మున్నగు అనేకానేక పంటలను పండిస్తూ వున్న రైతులు, కౌలు రైతులు, రైతు కూలీలు మున్నగు వర్గాల ప్రజానీకంనకు భూమితో సంబంధాలు, హక్కులు ఏవిధమైన మార్పులకు గురయ్యాయో, రచయిత లాబాన్ బాబు విశదీకరించిన తీరు చాలా బాగుంది. “కౌలు రైతు” రచనతోపాటు ఈనాటికి తెల్లవారితే రెక్కాడితేగాని డొక్కాడని, నిరక్షరాస్యులైన బడుగు జీవులకు చక్కగా అర్ధం అయ్యేలా కౌలు రైతు నాటకమును కూడా రచయిత చాలా చక్కగా, అర్ధవంతముగా తీర్చిదిద్దారు.

దేశంలో ఈనాడు వున్న 9 కోట్ల రైతు కమతాలలో దాదాపు 10 శాతంను కౌలు రైతులే నిర్వహిస్తూ ఉన్నారని పలు నివేదికలు తెలియపరుస్తూ ఉన్నాయి. కానీ వాస్తవంగా పలు కారణాల వలన యింతకన్నా చాలా అధికస్థాయి లోనే, కౌలు రైతు కమతాలు వున్నాయని తెలుస్తూ వుంది. ఉదాహరణకు బీహార్‌లో జాతీయ నమూనా సర్వే ప్రకారం కౌలు భూమి విస్తీర్ణం 4 శాతంగా పేర్కొనబడినప్పటికీ అది వాస్తవంగా 34 శాతం వరకు ఉన్నదని తెలుస్తూ వుంది. తాజా లెక్కల ప్రకారం తెలంగాణాలో 10 లక్షలకు పైగా, నవ్యాంధ్ర ప్రదేశ్‌లో సుమారు 15 లక్షల మంది కౌలు రైతులు వున్నారని అంచనా.

మన దేశంలో కౌలు రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు స్వాతంత్ర్యానంతరం వివిధ రాష్ట్రాలలో వేరువేరుగా కౌలు చట్లాలు చేయబడ్డాయి. కేరళ, జమ్ము & కాశ్మీర్ రాష్ట్రములలో వ్యవసాయ భూములను కౌలుకు యివ్వటంపై నిషేదం వుంది. వితంతువు, మైనర్లు, సైనిక కుటుంబములకు చెందిన వారి భూములకు కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఒరిస్సా మరియు తెలంగాణాలలో కౌలు చట్టము నుండి కొన్ని మినహాయింపులు ఉన్నాయి. దీర్ఘకాలం కౌలుగాని, నిర్దిష్ట గడువు లోపల భూమి కొనుగోలు వంటి వెసులుబాట్లు కౌలు రైతులకు పశ్చిమబెంగాల్, పంజాబ్,



హర్యాన, గుజరాత్, మహారాష్ట్ర బీహార్, మున్నగు రాష్రాలలో వున్నాయి. రాజస్థాన్, తమిళనాడు, ఆంధ్ర ప్రాంతాలలో కౌలుపైన కొద్దిమేర మాత్రమే ఆంక్షలు ఉన్నాయి.

కౌలు చట్టం వలన కొంతమేరకు కౌలు రైతులకు ప్రయోజనం ఉన్నప్పటికి, అధికారికంగా తమ భూములను కౌలుకు యిచ్చినట్లు అంగీకరించితే తమ భూ యజమాన్య హక్కులకు భంగం వాటిల్లుతుందనే భయము, అనుమానములు భూ యజమానులలో ఉండుట వలన కౌలు రైతులకు నష్టం కూడా చేకూరుతున్నది. మన ఆంధ్రప్రదేశ్‌లో వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తే వ్యవసాయ కౌళ్ళలో అత్యధిక భాగం కౌళ్ళు అనధికారికంగా, మూజువాణీగా కొనసాగుతూ వున్నాయి. పర్యవసానంగా బ్యాంకుల నుండి పంట ఋణాలు లభించక అధిక వడ్డీలతో కూడిన ప్రైవేటు ఋణాలపై ఆధారపడాల్సి వస్తుంది. అంతేకాక విత్తనములు, ఎరువులు, వ్యవసాయ ఉపకరణములు/యంత్ర సామాగ్రి, ఇన్‌పుట్ సబ్సిడి, పంటల భీమా మున్నగు ప్రయోజనాలను కౌలు రైతులు పొందలేకపోతూ వున్నారు. ఫలితంగా చీడపీడలు, ప్రకృతి వైపరీత్యములు సంభవించినప్పుడు పంటలు దెబ్బతిని తీసుకొన్న ఋణాలు ఉరితాడులుగా మారి, వేలాదిమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతూ వున్న వాస్తవం స్పష్టంగా కన్పించుతూనే వుంది.

యిట్టి పరిస్థితులలో ఇటీవల కేంధ్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన “నీతి ఆయోగ్” సంస్థ సారధ్యంలో వ్యవసాయ ధరల నిర్ణాయక సంఘం మాజీ చైర్మన్ టి.హక్ నేతృత్వంలో ఒక కమిటీని నియమించటం జరిగింది. భూయజమానుల యజమాన్య హక్కులకు భంగం లేకుండా కౌలు రైతులు, షేర్‌క్రాపర్స్‌లకు గుర్తింపు కార్డులను ఇవ్వటంతోపాటు వారికి ఋణపరపతితో సహా ప్రభుత్వము నుండి వివిధ సందర్భములలో లభించు సహకారం, పంటల భీమాతో సహా అందేలా ఒక నమూనా చట్టమును రూపొందించడం జరుగుతూ వుంది. ఈ నమూనా చట్టమును ఆధారముగా చేసుకొని రాష్ట్ర ప్రభుత్వములు తమ రాష్ట్ర పరిస్థితులను పరిగణనలో వుంచుకొని స్వల్ప మార్పులతో చట్టములను తయారు చేసుకొని కౌలు రైతులకు రక్షణతోపాటు సకల ప్రయోజనములను సిద్ధింప చేయవలసిన ఆవశ్యకత ఎంతో వుంది. చట్టమును రూపొందించిన దానిని అమలు చేయటంలో చాలా ప్రభుత్వాలు తగినంత శ్రద్ధను కనపర్చటం లేదు. ఉదాహరణకు కౌలు రైతుల పోరాటాల ఫలితంగా 2011లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమోదించిన “భూఅధీకృత రైతుల చట్టం” ప్రకారం కౌలు రైతులకు ఋణ అర్హత గుర్తింపు కార్డులు యివ్వాలని, గుర్తింపు కార్డు పొందిన కౌలు రైతులకు బ్యాంకులు ఋణాలు, యితర ప్రభుత్వ మద్దతు/సహకారం అందుతాయని చట్టంలో స్పష్టంగా పేర్కొనబడి వున్నా అమలులో చాలా నిర్లక్ష్యం కన్పించుతూ వుంది. కొద్దివేల గుర్తింపు కార్డులు యివ్వబడినా బ్యాంకుల నుండి ఋణం అందినది మాత్రం చాలా కొద్ది శాతం మందికి మాత్రమే.

బ్రిటీష్ కాలం నుండి భూముల కొనుగోళ్ళు - అమ్మకంల వ్యవహారాలు “రిజిస్ట్రేషన్ చట్టం 1908” ప్రకారం జరుగుతూ భూ యాజమాన్యమునకు సంబంధించిన సమాచారం లభించుతుంది. అడంగల్‌లో మార్పులు చేయకపోవటం వలన రైతులు పడుతున్న యిబ్బందులను గమనించుతూనే వున్నాము.

అందువలన రెవిన్యూ మరియు రిజిస్ట్రేషన్ రికార్డుల ప్రకారం చూసి భూయాజమాన్య సమాచారమును కంప్యూటరీకరించవలసిన అవుసరం ఉంది. యిందుకొరకు "రిజిస్ట్రేషన్ సవరణ బిల్లు 2013" పార్లమెంటులో ప్రవేశపెట్టబడి, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పరిశీలనకు 8 మే 2015న పంపబడింది. యిందుకొరకు 2008లోనే జాతీయ భూమి రికార్డుల ఆధునీకరణ పథకం ప్రారంభించ బడింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక సర్వే పరికరములు, ఉపగ్రహ చాయా చిత్రములు మరియు జి.పి.ఎస్.ల తోడ్పాటుతో ఈ ప్రక్రియ ముందుకు నడుస్తూ వుంది. గుజరాత్, హర్యానా, కర్ణాటక మరియు త్రిపుర రాష్ట్రాలలో రికార్డుల ఆధునీకరణ చాలా వరకు పూర్తి అయ్యింది. ఆంధ్రప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్‌లతో సహా పలు రాష్ట్రాలలో ఈ కార్యక్రమం నడుస్తూ వుంది. భూ రికార్డులను కంప్యూటరీకరించి కౌలు రైతులకు గుర్తింపు కార్డులను, ఋణ అర్హత కార్డులను యిచ్చినప్పుడు బ్యాంకులు ఋణ పరపతిని యితరత్రా అందించవలసిన సహకారం అందించే వీలుకలుగుతుంది. యిటీవల కేంధ్రప్రభుత్వం వంట గ్యాస్ సబ్సిడీని నేరుగా వినియోగదారులకు అందిస్తూ వున్న తరహాలో రానున్న కాలంలో ఎరువుల సబ్సిడీతోపాటు యితర సబ్సిడీలు/మద్దతులను నేరుగా పంటలను పండిస్తూ వున్న సాగుదార్లకు నేరుగా బ్యాంకు ఖాతాలలోకి అందచేయాలనే ప్రయత్నం సఫలం కావాలంటే పక్కాగా భూయజమానుల వివరములతోపాటు సాగుచేస్తూ వున్న కౌలుదారులు/షేర్ క్రాపర్స్ సాగువివరములను కూడా ఖచ్చితంగా కంప్యూటరీకరణ చేయటం ద్వారా వ్యవసాయ రంగంలో ఈనాడు కొన్ని లోపాలను అధిగమించేందుకు వీలుకలుగుతుంది.

పెరుగుతూ వున్న భూతాపము, వాతావరణంలో పెనుమార్పులు మనదేశంలో వ్యవసాయ రంగాన్ని ప్రభావితం చేస్తాయని, కొన్ని పంటల దిగుబడి తగ్గుతాయని, రైతులకు కష్టాలు పెరుగుతాయని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తూ వున్న నేపథ్యంలో ప్రభుత్వం వ్యవసాయదారులు, కౌలు రైతులు, రైతు కూలీల పట్ల ఇప్పటివరకు అనుసరిస్తూ వచ్చిన విచక్షణాపూర్వక వైఖరిని విడనాడాలి. రాబోయే కౌలు రైతుల "మోడల్ యాక్టు" లోని ప్రతిపాదనలను చూ.చ. తప్పకుండా కేంధ్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయవల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది. ఈ సందర్భముగా "కౌలు రైతు" పుస్తకమును రూపొందించిన తాళ్ళూరి లాభాన్‌బాబు గారితో పాటు వ్యవసాయ రంగం పట్ల ఎంతో ఆసక్తితో, లాభనష్టాకు వెరవకుండా రైతు నేస్తం, పశునేస్తం, ప్రకృతి నేస్తం మ్యాగజైన్లను ప్రచురించడంతోపాటు ప్రత్యేకంగా సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించుటకు కృషిచేస్తూ వున్న రైతు పక్షపాతి, రైతు మిత్రుడు సాయిలిఖిత ప్రింటర్స్ యజమాని వై. వెంకటేశ్వర రావు గారిని ఈ పుస్తక ప్రచురణ బాధ్యతను తీసుకున్నందుకు హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. నాబార్డ్ చైర్మన్‌గా వ్యవసాయము, గ్రామీణాభివృద్ధికై విశేషంగా కృషి చేసిన రైతుబిడ్డ డాక్టర్ పి. కోటయ్య గార్కి అంకితం యివ్వటం కూడా అభినందనీయం.

❊ ❊ ❊



# రైతు గోడు పట్టని ప్రభుత్వాలు

వ్యవసాయ సంక్షోభం ఎంత తీవ్రంగా ఉందో ఇటీవలి సర్వేలు మరోసారి దేశ ప్రజల కళ్ళకు కట్టాయి. తెలంగాణలో 89%, నవ్యాంధ్రలో 93% రైతులు రుణగ్రస్తులై ఉన్నారు. సగం మంది రైతులకు కూడా సంస్థాగత రుణాలు అందకపోవడం ఈ అప్పులకు ఒక ముఖ్య కారణం. సన్న, చిన్నకారు, కౌలు రైతులు అధిక వడ్డీలకు ప్రైవేటు రుణాలపై ఆధారపడుతున్నారన్నది నగ్నసత్యం.

**బ్యాంకులను జాతీయం చేసినా....**

అవసరానికి అనుగుణంగా సకాలంలో రుణ పరపతి అందినప్పుడే రైతులు వ్యవసాయ పనులను సకాలంలో పూర్తిచేసి సత్ఫలితాలు పొందగలగుతారు. కానీ, 1970వ దశకంలో బ్యాంకులను జాతీయ ంచేసి ఇప్పటికీ చిన్న, సన్నకారు, కౌలు రైతులకు ఇప్పటికీ బ్యాంకులు పంటరుణాలను, భూమి మెరుగుదలకు దీర్ఘకాలిక రుణాలను తగినంతగా అందించడం లేదు. మెట్రో నగరాల్లో, పట్టణాల్లో వ్యవసాయాధార, ప్రోసెసింగ్ పరిశ్రమలకు అందించే రుణాలనూ వ్యవసాయ రుణాల లెక్కలో చేర్చి లక్ష్యాలు సాధించామని బ్యాంకులు ప్రకటించుకోవడం గమనిస్తూనే ఉన్నాం. రైతుమిత్ర గ్రూపులు, జాయింట్ లయబిలిటీ గ్రూపులు ఏర్పాటు చేసినా కౌలు రైతులకు గుర్తింపు కార్డులిచ్చినా ప్రభుత్వం ఆశించినదాంట్లో కనీసం 5వ వంతు కూడా బ్యాంకులు సహకరించడం లేదు. ఇందువల్లే రైతులు అధిక వడ్డీలకు అప్పులు చేస్తున్నారు. ఆత్మహత్యల పాలవుతున్నారు. ఇది అత్యంత దురదృష్టకరం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికి అనేకసార్లు రుణమాఫీ కార్యక్రమం చేపట్టినా రైతుల ఆత్మహత్యల పరంపర కొనసాగుతూనే ఉంది.

**అతలాకుతలం చేస్తున్నది సర్కారు విధానాలే...**

వ్యవసాయరంగాన్ని సంక్షోభంలోకి నెడుతూ రైతుల జీవితాలను అతలాకుతలం చేస్తున్నది ప్రభుత్వ విధానాలే. వీటిని మార్చుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయకపోవడం బాధాకరం. రైతులు అష్టకష్టాలు పడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వటానికి నిరాకరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రసాయనిక ఎరువులు,

పురుగు మందుల ధరలను ఇష్టానుసారం పెంచుకోవడానికి కంపెనీలకు స్వేచ్ఛనిచ్చారు. ఫలితంగా ఫాస్పేట్, పొటాష్ ధరలు 3 నుంచి 4 రెట్లు పెరిగాయి. దిగుబడులు మాత్రం పెరగటం లేదు. ఫలితంగా వ్యవసాయం గిట్టుబాటు కాని వ్యాపకంగా మారింది.

**అనుసరణీయమైనది ప్రకృతి వ్యవసాయం**

ఈ పరిస్థితుల్లో వ్యవసాయ ఖర్చులు తగ్గించుకుంటూ, అధికోత్పత్తిని సాధించగలిగే వ్యవసాయం రైతులకు లాభసాటిగా ఉంటుంది. ప్రధానంగా భూసారాన్ని పెంపొందించుకోవలసిన ఆవశ్యకత ఎంతో ఉంది. రసాయనిక ఎరువుల వాడకాన్ని బాగా తగ్గించి, పచ్చిరొట్ట ఎరువులు, చెరకు ఆకు, వరి గడ్డితోపాటు పత్తి, జొన్న, మొక్కజొన్న మొదలగు పంటల వ్యర్థాలను భూమిలో కలిపి దున్నటం ద్వారా భూమిలో సేంద్రియ కర్బనాన్ని పెంపొందించాలి. అప్పుడే భూముల్లో హ్యూమస్ (జీవనద్రవ్యం) పెరిగి అధిక దిగుబడులు లభిస్తాయి.

సుభాష్ పాలేకర్ బోధిస్తున్న పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయ విధానం ఎంతైనా అనుసరణీయం. ఒక్క దేశీ ఆవుతోనే దాదాపు 20 ఎకరాలకు ఎరువు అందించగలిగే వీలుంది. ఆవు మూత్రం, ఆవు పేడతో ఘన,ద్రవ జీవామృతాలు తయారుచేసుకొని వినియోగించుకోవచ్చు. పాలేకర్ చెప్పే అగ్నిఅస్త్రం, నీమాస్త్రం తదితర కషాయాలను ఉపయోగించి చీడపీడలను నివారించుకోవచ్చు.

**వ్యవసాయ సంక్షోభం పరిష్కారానికి ప్రభుత్వం తీసుకోవాల్సిన విధానపరమైన చర్యలివి.**

- డా॥ ఎమ్మెస్ స్వామినాథన్ సారథ్యంలోని జాతీయ కమిషన్ చేసిన సిఫారసులను ఆమోదించినప్పుడే దేశవ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.
- వ్యవసాయ ధరల కమిషన్‌ను పునర్వ్యవస్థీకరించి 'టరమ్స్ ఆఫ్ రిఫరెన్స్'ను పునః సమీక్షించాలి. పంట ఉత్పత్తి వ్యయంపై 50 శాతాన్ని కలిపి మద్దతు ధర ప్రకటించాలి. అప్పుడే రైతు కుటుంబం సమాజంలోని ఇతర వర్గాల స్థాయిలో గౌరవప్రదంగా జీవించగలుగుతుంది.
- రైతు భరించగలిగిన స్థాయిలో ప్రీమియం నిర్ణయించి పంటల బీమా పథకాన్ని అమలు చేయాలి.
- వ్యవసాయోత్పత్తుల మార్కెట్ ధరల్లో ఒడిదుడుకులు తట్టుకునేందుకు ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలి.
- వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు, దిగమతుల వల్ల మన రైతుల ప్రయోజనాలకు భంగం కలగించకుండా ఉండేందుకు 'ఇండియన్ ట్రేడ్ ఆర్గనైజేషన్'ను ఏర్పాటు చేయాలి.



- ప్రకృతి వైపరీత్యాల బారిన పడిన రైతులను ఆదుకొనేందుకు 'వ్యవసాయ విపత్తు నిధి'ని ఏర్పాటు చేయాలి.
- రైతులకు, వ్యవసాయ కార్మికులకు, కౌలు రైతులకు ఉచిత జీవిత బీమా సదుపాయం కల్పించాలి.
- గ్రామీణులు, రైతులకు చైనాలోని 'టౌన్ విలేజ్ ఎంటర్‌ప్రైజెస్' మాదిరిగా నైపుణ్యాన్ని మెరుగుపరిచే శిక్షణ ఇవ్వాలి.
- వ్యవసాయ రంగం అభివృద్ధికి కొలమానం పంట ఎన్ని టన్నులు పండింది అని కాకుండా రైతు సంతోషంగా ఆనందంగా ఉన్నాడా లేదన్నది ప్రామాణికం కావాలని స్వామినాథన్ కమిటీ కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించి 8 ఏళ్ళ గడచింది. పార్లమెంటులో ఈ నివేదికపై చర్చించడం కానీ, ఆమోదించడం కానీ చెయ్యలేదు. 60 కోట్ల మంది రైతాంగం, గ్రామీణ ప్రజానీకం పట్ల కేంద్రం చూపుతున్న నిర్లక్ష్యానికిది నిలువుటద్దం పడుతోంది.
- కోట్లాదిమంది రైతులు, గ్రామీణ చేతివృత్తుల వారి ఆదాయం, కొనుగోలు శక్తి గణనీయంగా పెరిగితేనే పారిశ్రామిక, సేవారంగాలు కూడా అభివృద్ధి చెందుతాయని తెలిసీ, చర్యలు చేపట్టకపోవడం రైతుల దౌర్భాగ్యం.

❊ ❊ ❊

# మోడి ప్రభుత్వానికి రైతు సంక్షేమము పట్టదా?

ఇటీవల కేంద్ర ప్రభుత్వము ఖరీఫ్ పంటలకు కనీస మద్ధతు ధరలను ప్రకటించింది. దాన్యానికి క్వింటాలుకు 50 రూపాయిలు, జొన్నలకు 40 రూపాయిలు, సజ్జలకు 25 రూపాయిలు, మొక్కజొన్నలకు 15 రూపాయిలు, రాగులకు 100 రూపాయిలు, వేరుశనగకు 30 రూపాయిలు, సోయాబీన్స్‌కు 40 రూపాయిలు, నువ్వులకు 100 రూపాయిలు, ప్రత్తికి 50 రూపాయలు, నిరుటి మద్ధతు ధరల పైన పెంచుతూ ఉత్తర్వులను ఇచ్చింది. క్రిందటి బడ్జెటు సమయమునకు క్రొత్త ప్రభుత్వము, తాను ఎన్నికల ప్రణాళికలలో వాగ్ధానము చేసిన మేరకు వ్యవసాయ ధరల నిర్ణాయక సంఘము పని తీరును, వ్యవసాయ ఉత్పతి ఖర్చులు మున్నగు అంశములను లోతుగా అధ్యయనము చేయిటకు సమయము చాలనందువలన వ్యవసాయ పంటలకు సరియైన ధరలను నిర్ణయించలేకపోయిందని రైతులు భావించారు. మోడీ ప్రభుత్వము అధికారము చేపట్టి ఒక సంవత్సరకాలము నిండినా ఇప్పటికి స్వామినాథన్ కమీషన్ సిపార్సుల పైన తాను అధ్యయనము చేయుట కానీ, పార్లమెంటులో ఈ సిపార్సుల పైన చర్చకు ప్రవేశపెట్టి దేశములోని అత్యున్నతమైన చట్టసభలో వివిధ రాజకీయ పక్షాల అభిప్రాయాలను తీసుకుందామనే నిర్ణయానికి రాకపోవడము వ్యవసాయ రంగం పట్ల, నూటికి అరవై శాతముగా ఉన్న రైతుల పట్ల. కౌలు రైతుల పట్ల నిర్లక్ష్యానికి తార్కాణముగా నిలుస్తుంది. ఇటీవల సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో స్వామినాథన్ సిపార్సులను అమలుచేయటము సాధ్యపడదని తెలియజేయటము చాలా బాధాకరము, సిగ్గుచేటు.

లోగడ కొన్ని పర్యాయములు బి.జె.పి. కేంద్రములోను, కొన్ని రాష్ట్రాలలోను ప్రభుత్వాలను నిర్వహించింది. గత దశాబ్దకాలముగా ప్రధాన ప్రతిపక్షపాత్రను పోషించింది. మన దేశములో వ్యవసాయరంగము తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటూ ఉందని, యువతరం వ్యవసాయము చేపట్టడానికి సుముఖముగా లేరని, వేరే రంగములో అవకాశము లభిస్తే వ్యవసాయము విడనాడి వేరే వ్యాపకాన్ని సగం పైగా రైతులు చేపట్టాలని భావిస్తున్నారని తాజా జాతీయ శాంపిల్ సర్వే నివేధికలు స్పష్టముగా



తెలియపర్చుతూ ఉన్న విషయము పాలకులకు తెలుసు. గత దశాబ్ద కాలములో 16 లక్షల మంది రైతులు వ్యవసాయ రంగం నుండి నిష్క్రమించారు. 1997 నుండి నేటి వరకు దాదాపు 3 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకొని ఉన్నారు. ఈ నేపధ్యములోనే యు.పి.ఎ ప్రభుత్వము ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త యమ్.యస్. స్వామినాథన్ గారి నేతృత్వములో జాతీయ రైతు కమీషన్ ఏర్పాటు చేసింది. వ్యవసాయ రంగము ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారము కొరకు ఆ కమీషన్ ఎన్నో విలువైన సూచనలు చేసింది. కమీషన్‌ను నియమించిన యు.పి.ఎ. ప్రభుత్వము ఆ కమీషన్ రిపోర్టును పార్లమెంటులో చర్చించలేదు, సిపార్సులను అమలుచేయలేదు. 2014 ఎన్నికల సమయములో కేంద్రములో బి.జె.పి,. రాష్ట్రములో తెలుగుదేశం పార్టి స్వామినాథన్ కమిషన్ సిపార్సులను అమలు చేస్తామని, వ్యవసాయ పంటలు ఉత్పత్తి వ్యయమునకు 50 శాతము కలిపి కనీస మద్దతు ధరలు ప్రకటిస్తామని చెప్పియున్నారు. కాని ఈ వాగ్దానాన్ని విస్మరించి యు.పి.ఎ ప్రభుత్వ హయాములో కన్నా, తక్కువ పెంపును కొన్ని పంటలకు ప్రకటించడము శోచనియము. ఇందువలన ముఖ్యముగా దక్షిణాది రాష్ట్రములలో వరి పండించే రైతులకు తీవ్రమైన నష్టము చేకూరుతుంది.

స్వామినాథన్ పంటల ఉత్పత్తి వ్యయమునకు 50 శాతము కలిపి కనీస మద్దతు ధరలను నిర్ణయించాలనే సూచన సహేతుకమైనది. భారతదేశములో సగటున ఒక వ్యవసాయ కుటుంబమునకు సాలుసరి ఆదాయము రూ. 6,426/-లుగా అంచనా వేయబడినది. సగటున అత్యంత దిగువస్తాయి ప్రభుత్వ ఉద్యోగి వేతనము రూ15000/-ల పైనే ఉంది. మన దేశములో 65% మంది రైతులు సగటున ఒక హెక్టారు కన్నా తక్కువ భూమిని కలిగి ఉన్నారు. 90శాతము మంది రైతులు సగటున 2 హెక్టార్ల కన్నా తక్కువ భుమి ఉన్నవారే. దేశం మొత్తము మీద చూస్తే 48.6% రైతుల కుటుంబాలు అప్పుల భారము మోస్తు ఉన్నాయి. అప్పుల భారం శాతము అత్యధికము 83% ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నారు. సంఖ్యాపరముగా ఉత్తర ప్రదేశ్‌లో ఎక్కువ మంది ఉన్నారు. తరువాతి స్ధానము ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ది, సంస్ధాగత ఋణాలు అతి తక్కువ లభించినవి ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికముగా లభించినది, కేరళ, మహారాష్ట్ర రాష్ట్రములలో, గుజరాత్. కేరళ, తమిళనాడు రాష్ట్రలలో రైతులకు ఋణపరపతిని లభింపచేయడములో సహకార సంస్ధలు ప్రధాన పాత్రను పోషించాయి. ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తుల మీద ఆధారపడ వలసిన పరిస్ధితి ఎక్కువగా అంధ్రప్రదేశ్ రాష్ట్రములో ఉంది. 24% నుండి 36% వరకు రైతులు వడ్డీ చెల్లించవలసి వస్తూ ఉంది.

జాతీయస్ధాయిలో పరిశీలనలలో సగటున రైతులు తీసుకున్న ఋణపరపతిలో 65%ను వ్యవసాయ అనుబంధ రంగాలలో ఖర్చుల కొరకు, పెట్టుబడులకు ఖర్చు చేయగా 35%ను వివాహది శుభ కార్యక్రమములకు, విద్యా, వైద్య ఖర్చులకు గృహావసరాలకు వినియోగించబడినది అని గమనించడమైనది. వ్యవసాయ రంగము

పైన ఆధారపడి జీవిస్తూ ఉన్న ప్రజలు, వ్యవసాయేతర రంగాలలో జీవన ఉపాధి పొందుతూ ఉన్న ప్రజలలో సగటు ఆధాయములు మధ్య వ్యత్యాసము రానురాను పెరిగిపోతూ ఉన్నది. 1996 నుండి 2004 మధ్య కాలములో వివిధ పంటలకు పలు రాష్ట్రాలలో కేంద్రప్రభుత్వము ప్రకటించిన కనీస మద్ధతు ధరలు ఆయా పంటల ఉత్పత్తి ఖర్చుల కన్నా 38% తక్కువగా ఉన్నాయని హైదరబాదులోని టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ షోషల్ సైన్సస్ (టి.ఐ.ఎస్.ఎస్) అధ్యయనములో తేలింది. సగటున ఏటా కేంద్రప్రభుత్వము నిర్ణయిస్తూ ఉన్న ధరల వలన భారత రైతాంగము రూ. 1,16,000/- కోట్ల మేరకు నష్టపోతూ ఉన్నట్లు కూడా తేలినది. ఈ ఫలితముగానే కొన్ని పర్యాయములు ఋణమాఫి పథకములు అమలు అయినా ఈనాటికీ, రైతుల ఆత్మహత్యల పరంపర కొనసాగుతూ ఉండటం జరుగుతూ ఉంది. సమాజంలో ఇతర వర్గాల లోని ప్రజల వలనే ఆహారభద్రతతోపాటు కనీస సామాజిక అవసరాలు చేకూరి, రైతుకుటుంబాలు కూడ ఆత్మాభిమానముతో, గౌరవప్రదంగా జీవించగలగాలి అంటే పంటల ఉత్పత్తి వ్యయానికి 50% అధనముగా కలిపి ఇవ్వాలని స్వామినాథన్ కమీటి సిపార్సు చేసినది.

అయితే మోడీ ప్రభుత్వము పేరుకి రైతు సంక్షేమము కొరకు పని చేస్తూ ఉన్నామని చెప్పుతూ ఉన్నా ఆచరణలో అందుకు భిన్నముగా నడుస్తూ ఉంది. పలు దశాబ్దములుగా ఉన్న ప్లానింగ్ కమీషన్ను లేక ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి 'నీతి అయోగ్' అను వ్యవస్థను ఏర్పాటు చేసినది. దీనికి ఉపాధ్యాక్షునిగా గుజరాత్కు చెందిన అరవింద్ పనగారియా అనే ఆర్థికవేత్తను నియమించింది. వ్యవసాయదారులకు సంపదను కానీ, మెరుగైన ఆధాయాన్ని కానీ, వ్యవసాయము చేకూర్చుదని ఇటీవల ఆయన సెలవిచ్చారు. అంతేకాక పరిశ్రమలు, రహదారులు, రైల్వేలు, గృహనిర్మాణముల క్రింద ఉన్న భూవిస్తీర్ణము 7% నుండి 8%కు పెరిగిన పర్యావసానముగా దేశ ప్రజల తలసరి ఆధాయము గణనీయముగా పెరిగినదని కూడ శెలవిచ్చారు. ప్రధానమంత్రి అధ్యక్షతన ఉండే వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉండే అత్యంత ఉన్నతస్థాయి విధానపర నిర్ణయాలు రూపొందించగల నీతిఅయోగ్ వ్యవస్థకు ఉపాధ్యాక్షుడిగా ఉన్న వ్యక్తి నుండి ఇటువంటి ప్రకటనలు వస్తూ ఉంటే వ్యవసాయరంగ సంక్షోభము పరిష్కారము అయ్యే పరిస్థితి కనిపించడము లేదు. మోడీ గారి దృష్టిలో అరవింద్ పనగారియా ఆలోచనలో ఎక్కువ శాతము మంది రైతులు వ్యవసాయరంగము నుండి నిష్క్రమించాలి అని, వ్యవసాయ భూములను పెద్ద ఎత్తున పరిశ్రమలకు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ఉపయోగించబడటము ద్వారానే, దేశప్రగతి సాధ్యపడుతుందని ఆలోచిస్తూ ఉన్నట్లుగా కనిపిస్తూ ఉంది.

నూటికి 3% నుండి 6% ప్రజలు మాత్రమే వ్యవసాయ రంగములో కొనసాగుతూ ఉన్న జపాన్, యూరోపియన్ యూనియన్, అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాలలో ఏటా లక్షల కోట్ల డాలర్ల సబ్సిడీలను ఆ రైతాంగానికి అందజేస్తూ ఉంటే ఇక్కడ



మనదేశంలో బ్యాంకుల జాతీయకరణ జరిగి, 45 సం.లు గడిచినా ఇప్పటికి నూటికి 36% మంది రైతాంగము తమకు కావలసిన పంట ఋణాలను ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తుల నుండి హెచ్చు వడ్డీలకు తీసుకొనవలసిన దౌర్భాగ్య పరిస్థితులతో, కరువు తుఫానులు, ప్రకృతి వైపరీత్యాలు వంటివి సంభవించినప్పుడు ప్రభుత్వము నుండి తగు సహాయము అందకపోవటము, సరళమైన ప్రీమియంతో రైతును ఆదుకోగల వ్యవసాయ పంటల భీమా పధకాలు లేకపోవటము, ఆరుగాలము కష్టించి పండించిన పంటలను,మార్కెట్ శక్తులు, దళారుల నియంత్రణ వలన అటు వినియోగదారునికి, ఇటు రైతులకు మేలు చేకూరకపోవడము వంటి పరిస్థితులలో మనదేశములో పరిసరాలకు వెలుగుని ప్రసాదిస్తూ తాను కరిగిపోయే క్రొవ్వొత్తి చందముగా భారత రైతాంగము వివిధ పంటలు పండిస్తూ మిగులు ఉత్పత్తిని సాధిస్తూ, ఎగుమతులకు చేయూతనిస్తూ ఉంటే ఆ రైతాంగము యొక్క త్యాగాన్ని పరిగణనలోనికి తీసుకొనకుండ ఇటువంటి నిర్లక్ష్య దోరణిని ప్రదర్శించటము సిగ్గుచేటు.

అంతేకాక మనదేశములో ఆహార, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల నిలువకు సరిపడా గోదాముల సామర్ధ్యము ప్రస్తుతము లేదు, లక్షలాది టన్నుల బియ్యము, గోధుమలు, ఆరు బయట టార్పాలిన్ల క్రింద నిలువ చేయబడుతూ ఉన్నాయి. ఏటా వందల కోట్ల రూపాయలు విలువైన ఆహార ధాన్యాలు పాడైపోతూ ఉన్నాయని నివేదికలు చెబుతున్నాయి. ఈ పరిస్థితులలో దేశవ్యాప్తముగా 230 లక్షల టన్నుల నిల్వ సామర్ధ్యము కల్పించుటకు అగ్రికల్చర్ మార్కెటింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ పధకము ద్వారా నాలుగు వేల కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మింపచేయాలని యు.పి.ఏ. ప్రభుత్వము నాబార్డునకు 25-4-2014 న ఆదేశాలు జారి చేసింది. మోడీ ప్రభుత్వము అధికారములోనికి వచ్చి 1 సం.ర కాలము అయినా ఇప్పటికి ఈ పథకాన్ని అమలు చేయడానికి ఉపక్రమించక పోవడము వ్యవసాయ రంగము పట్ల నిర్లక్ష్యమునకు మరి ఒక ఉదాహరణ. అంతేకాక రైతుల నుండి ధాన్యము, గోదుమలు సేకరణను 25%కు తగ్గించడము వలన, ప్రైవేటు వ్యాపారులు, మిల్లర్ల దోపిడి పెరగడానికి ఊతము ఇచ్చినట్లు అయినది. ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియాకు చేకూరుతూ ఉన్న నష్టములు, అందులో కొనసాగుతూ ఉన్న దుబారా, అధిక రవాణా వ్యయము మున్నగు వాటిని అరికట్టి సామర్ధ్యతను పెంచి రైతాంగమునకు అండగా నిలబడటానికి బదులు రైతులను ప్రైవేటు మార్కెట్ శక్తుల బారిన వదిలివేయడము సరికాదు.

ఇప్పటికే వ్యవసాయ రంగమునకు అందజేయవలసి ఉన్న ఋణపరపతి మొత్తములో గణనీయమైన భాగము వ్యవసాయ ఆధార పరిశ్రమలకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు వెళుతూ ఉండగా ఇప్పుడు మోడీ ప్రభుత్వము నేరుగా వ్యవసాయ రంగానికి వెళ్ళవలసిన ఋణపరపతికి పరోక్షముగా వ్యవసాయానికి అనే పేరుతో పారిశ్రామిక రంగానికి ఇస్తూ ఉన్న ఋణపరపతికి మధ్యన ఉన్న విభజన రేఖను తొలగించిన పర్యవసానముగా రాబోవుకాలములో పంట ఋణాలకు,

వ్యవసాయములో పెట్టుబడులకు మరింత తక్కువగా లభించే పరిస్థితి ఏర్పడుతూ ఉంది. ఫలితముగా మరింత ఎక్కువగా ప్రైవేటు వడ్డీ వ్యాపారులపై ఆధారపడవలసి వస్తుంది.

బ్రిటీషు కాలము నుండి ప్రకృతి వైపరీత్యములు సంభవించినప్పుడు సన్నకారు, చిన్న రైతులకు మాత్రమే ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చే అశాస్త్రీయ విధానమే నేటికీ కొనసాగుతూ ఉంది. వ్యవసాయ ఉపకరణాల ఖర్చు చాలా అధికముగా పెరిగినందువలన వరి, ప్రత్తి, చెఱకు, మున్నగు పంటలకు ఎకరానికి రూ.10వేల రూపాయలు ఇన్‌పుట్ సబ్సిడీని అందచేయాలని లోగడ 'హుడా కమిటీ' సూచించినా, మోడీ గారి ప్రభుత్వము ఎకరాకు రూ.6వేల రూపాయల ఇన్‌పుట్ సబ్సిడీతో సరిపెట్టింది. కాకపోతే ఇన్‌పుట్ సబ్సిడీ పొందుటకు 50% పంట నష్టము చేకూరాలన్న నిబంధనను సడలించి 33శాతమునకు తగ్గించడము కొంతమేరకు ఉపయోగకరమే.

ఇవన్నీ చూస్తూ ఉంటే పొమ్మనలేక పొగపెట్టినట్లుగా, లోగడ యు.పి.ఎ. ప్రభుత్వము అనుసరించిన బాటలోనే నేటి యన్.డి.ఎ. ప్రభుత్వము నడుస్తూ ఉన్నట్లు స్పష్టముగా కనిపిస్తూ ఉంది. ఈ పరిణామాలు ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలోని వరి పండించే రైతుల జీవన భద్రతకే ప్రమాదము తెస్తుంది. ఎందుకంటే వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారము మన ఉభయ తెలుగు రాష్ట్రాలలో వరి ఉత్పత్తి వ్యయం ఎకరానికి రూ.38 వేలు కాగా, కేంద్రప్రభుత్వము ప్రకటించిన మద్ధతు ధర వలన, ఉత్పత్తి ఖర్చేరాని పరిస్థితి కనిపిస్తూ ఉంది. పలు ఇతర పంటల విషయములో కూడ ఇదే పరిస్థితి ఉంది. దేశ ప్రజానీకములో దాదాపు 60 శాతముగా వున్న రైతులు, వ్యవసాయ కూలీలు, ఇతర చేతి వృత్తులు చేసుకొనే గ్రామీణ ప్రజానీకము యొక్క ఆదాయాలు పెరిగి, వారియొక్క కొనుగోలు శక్తి పెరిగినప్పుడే, ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన 'మేక్ ఇన్ ఇండియా' పథకము జయప్రదం అవుతుంది. ఈ ప్రాథమిక సత్యాన్ని విస్మరించి వ్యవసాయ రంగాన్ని నిర్లక్షము చేస్తే వ్యవసాయ రంగము మరింత సంక్షోభమునకు దిగజారి, ఇతర దేశముల నుండి ఆహార పదార్థములను దిగుమతి చేసుకోవలసిన దుస్థితి ఏర్పడే ప్రమాదము ఉంది. కావున డాక్టరు యమ్. యస్. స్వామినాథన్ రైతు కమీషను చేసిన సిఫార్సులను అమలు చేయవలసిన భాద్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వములపై ఉంది. ఏటా రూ. 4 1/2 లక్షల కోట్లు కస్టమ్స్, ఎక్సైజ్ ఆదాయపు పన్నులలో రాయితీలను పారిశ్రామిక, వాణిజ్య రంగాలకు అందజేస్తూ వ్యవసాయ రంగానికి అత్తెరుగా నిధులను కేటాయిస్తూ ఉన్న దుష్ట సాంప్రాదాయాన్ని విడనాడి, వ్యవసాయము, ఇరిగేషన్ రంగాలకు ప్రథమ ప్రాధన్యత ఇస్తూ, నిధులను అందజేస్తేనే భారతదేశము సౌభాగ్యవంతము అవుతుంది.

* * *



# అనంతపురం నుండి అమరావతికి ఎక్స్‌ప్రెస్ హైవే అవసరమా?

అమరావతి రాజధాని నగరాన్ని ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యం తరువాత రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను యిస్తూ వున్న అంశం అనంతపురం నుండి అమరావతికి సూపర్‌పాస్ట్ ఎక్స్‌ప్రెస్ హైవేను 2019 లోపల పూర్తి చేయటం. ఎక్కడా ఒంపులు లేకుండా తిన్నగా 371 కి.మీ అనంతపురం - అమరావతి రహదారి + ఈ రోడ్డు నుండి కర్నూలు రోడ్డు 123 కి.మీ + ఈ రోడ్డు నుండి కడప రోడ్డు 104 కి.మీ మొత్తం 598 కి.మీ. ఎక్స్‌ప్రెస్ హైవేను 4/6 వరుసలుగా గంటకు 120 నుండి 130 కి.మీ వేగంతో ప్రయాణించగలిగేలా అభివృద్ధి చేయాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తూవుంది. పలుచోట్ల చెరువులు, గ్రామములు, పట్టణములు ఉన్నచోట్ల ఫ్లై ఓవర్‌లను నిర్మించుతూ, కొండలున్న చోట్ల సొరంగమార్గములను ఏర్పాటు చేసి అనంతపురం నుండి అమరావతికి 6 గంటల సమయంలో చేరాలని ముఖ్యమంత్రిగారి సంకల్పం. యిందుకొరకు సుమారు 26,800 ఎకరముల భూమి సేకరించవలసి ఉంటుందని అంచనా, 2013 భూసేకరణ చట్టం/ భూసమీకరణ విధానంలో 3 నెలల్లో తీసుకొని పనులు ప్రారంభింప చేయాలని ప్రభుత్వం భావిస్తూ ఉంది. రాష్ట్రప్రభుత్వం తన ఖర్చుతో భూమిని సమకూరిస్తే కేంద్రప్రభుత్వం రూ.27,600 కోట్లతో ఈ రహదారిని అభివృద్ధి చేయుటకు సూత్రప్రాయంగా అంగీకరించింది. ఈ ఎక్స్‌ప్రెస్ హైవే కొరకు 9224 హెక్టార్ల అటవీ భూమి కూడా అవసరమౌతుంది. యిందుకు సుదీర్ఘ ప్రక్రియ / పరిశీలన అనంతరం కేంద్రప్రభుత్వం అనుమతించవలసి ఉంటుంది. యింతవరకు కేంద్రప్రభుత్వ అటవీ మరియు పర్యావరణ శాఖకు రాష్ట్రప్రభుత్వం నుండి ప్రతిపాదన వెళ్ళలేదు.

అనంతపురం - అమరావతి రహదారిలో 10 కి.మీ. మేర, కర్నూలు నుండి వచ్చి కలిసే రహదారిలో 16 కి.మీ., కడప నుండి వచ్చి కలిసే రోడ్డులో 2 కి.మీ మేర అనగా మొత్తం 28 కి.మీ.ల నిడివైన సొరంగములను త్రవ్వవలసి ఉంటుంది. వెలుగొండ ప్రాజెక్టులో 9.5 మీటర్ల డయామీటర్ / 7 మీటర్ల డయామీటర్ టన్నెల్ పనులు 10 సం.ల కాలంలో సుమారు 10 కి.మీ.ల త్రవ్విన అనుభవం గుర్తించు కోవాలి. ఈ

రహదారిలో 4/6 లైన్ల రహదారి కొరకు చాలా ఎక్కువ వెడల్పైన సొరంగములు త్రవ్వవలసి ఉంటుంది. ఈ పని పూర్తగుటకు ఎన్ని సం.లు పడుతుందో ఊహించుకోవచ్చు. ఇవేకాక ఈ రహదారి నిర్మాణంలో 43 ప్రధాన వంతెనలను, 6 ఓవర్ బ్రిడ్జిలను 22 చోట్ల కూడళ్ళను నిర్మించవలసి ఉంటుంది. అయినా ఈ అసంబద్ధ ప్రతిపాదనను ఆఘమేఘాల మీద ముందుకు నడిపించాలని ముఖ్యమంత్రి గారు ప్రయత్నించడంలోని ఆంతర్యం నితిన్ గడ్కరి గారికి, చంద్రబాబునాయుడు గారికి మాత్రమే తెలుసు.

## ప్రత్యామ్నాయ ప్రతిపాదనను పరిశీలించవద్దా?

అనంతపురం నుండి - అమరావతి రాజధానికి ప్రయాణ కాలం తగ్గించాలనే భావనకు ఎవరూ వ్యతిరేకం కాదు. అదే సమయంలో ఏవిధంగా, ఏమేరకు రాష్ట్రప్రభుత్వం పైన తక్కువ వ్యయభారం పడుతుందో, రైతులకు నష్టం కలుగచేయనిరీతిలో చేపట్టవచ్చో ఆలోచించవలసిన అవసరం చాలావుంది. ఆ కోణంలో చూసినపుడు ఇప్పటికే అనంతపురం నుండి కర్నూలు వరకు 146 కి.మీ. జాతీయ రహదారి శ్రీ.క 44 ఉంది. గం.2-15 ని.లలో అనంతపురం నుండి కర్నూలుకు చేరుకోవచ్చు. కర్నూలు నుండి గుంటూరునకు 283 కి.మీ. దూరం వుంది. కర్నూలు నుండి నందికొట్కూరు, ఆత్మకూరు, డోర్నాల, తోకపల్లి, నరసరావుపేట నుండి గుంటూరునకు ఉన్న స్టేట్ హైవే (శ్రీ.క 50)ను జాతీయ రహదారిగా నాలుగు లైన్ల వెడల్పున అభివృద్ధి చేయుటకు కేంద్రప్రభుత్వం అంగీకరించి వుంది. యింతేకాక కడప జిల్లా కోడూరు నుండి బత్తినపల్లి, తాడిపత్రి - కొడిమిగుంట్ల - బనగానపల్లి - గిద్దలూరు - కంభం - తోకపల్లి - వినుకొండ - నరసరావుపేట నుండి గుంటూరు వద్ద శ్రీ.క 16ను కలుపు 516 కి.మీ.ల రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా అభివృద్ధి చేయుటకు కేంద్ర ఉపరితల రవాణాశాఖ అంగీకరించి ఉంది. అనంతపురం నుండి కోడూరు వరకు కూడా అభివృద్ధిపరిస్తే సరిపోతుంది. వీటిపైన రాష్ట్రప్రభుత్వమునకు ఎంతమాత్రం భారం పడదు. జాతీయ రహదారిగా నాలుగు వరుసలుగా అభివృద్ధి చేసిన దరిమిలా కర్నూలు నుండి గుంటూరు 5 గం.లలో చేరుకోవచ్చు. మొత్తం మీద అనంతపురం నుంచి గం.7-15ని.లలో గుంటూరునకు చేరుకునే వీలుంటుంది. ఈ మార్గములో అవసరమైన చోట నుండి అమరావతి రాజధాని లోనికి మార్గమును అభివృద్ధి చేసుకొనవచ్చును. గతంలో చంద్రబాబునాయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న 9సం.ల కాలంలో హైద్రాబాద్ తర్వాత అత్యంత ప్రాముఖ్యత కలిగి, కోస్తాకు గుండెకాయ వంటి విజయవాడ నగరానికి లోగడ నుంచి వున్న జాతీయ రహదారి శ్రీ.క. 9 ను నాలుగు లైన్ల రహదారిగా కేంద్రప్రభుత్వం చేత అభివృద్ధి చేయించాలనే తలంపే చేయలేదు. అనేక సంవత్సరాలపాటు సమయం అవసరం అయ్యే యిటువంటి భారీ ప్రాజెక్టు 2019 నాటికి పూర్తయ్యే అవకాశం ఎట్టి పరిస్థితులలోనూ వుండదు.



## 200 మీటర్ల వెడల్పు గల ఎక్స్‌ప్రెస్ హైవే ఎందుకు?

సాధారణంగా జాతీయ రహదారులు 60 మీటర్ల వెడల్పు (200')లో వుంటాయి. ఎక్స్‌ప్రెస్ హైవేలను కొన్నింటిని వందమీటర్ల వెడల్పుతో అభివృద్ధి చేశారు. ఉదాహరణకు అత్యంత రద్దీగా ఉండే ఢిల్లీ ప్రక్కన నోయిడా నుండి ఆగ్రా వరకు 165 కి.మీ.ల యమునా ఎక్స్‌ప్రెస్ హైవేను 2007-2012ల మధ్య జె.పి. అసోసియేట్స్ సంస్థ ఆరు లైన్లతో నిర్మించింది. దీనిని భవిష్యత్తులో ఎనిమిది లైన్లకు విస్తరించే అవకాశం వుంది. ఈ రహదారిపైన కార్లకు రూ.410/-, బస్సులు/ట్రక్కులకు రూ.1150/- టోల్ రుసుము వసూలు చేయబడుతూ వుంటుంది. అటువంటిది మన రాష్ట్ర ప్రభుత్వం అనంతపురం-అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవేకు 200 మీటర్ల (600' వెడల్పుతో) సేకరించే ప్రయత్నం చేయడం విడ్డూరం.

## అనంతపురం - గుంతకల్ - గుంటూరు రైల్వే లైను ఉండగా మరొక రైల్వే లైన్‌ను కేంద్రం అంగీకరిస్తుందా?

ఈ ఎక్స్‌ప్రెస్ హైవేకు సమాంతరముగా రైల్వే లైను కూడా వేయాలని ముఖ్యమంత్రిగారి అభిలాష. అయితే గుంతకల్లు నుండి గుంటూరునకు 443 కి.మీ.ల రైలు మార్గమును డబ్లింగ్ చేయుటకు రైల్వే మంత్రిత్వశాఖ ఆమోదించి ప్రస్తుత బడ్జెట్‌లో రూ.124 కోట్లు కేటాయించి వుంది. బెంగుళూరు నుండి గుంటూరు, హుబ్లి నుండి గుంటూరుకు గుంతకల్లు మీదుగా అనేక ఎక్స్‌ప్రెస్ రైళ్ళతో సహా పలు రైళ్ళు నడుస్తూ ఉన్నాయి. అలాగే గుత్తి నుండి ధర్మవరం రైల్వే లైన్‌ను కూడా డబ్లింగ్ చేయుటకు రైల్వే శాఖ చర్యలను చేపట్టింది. ఈ నేపథ్యంలో చంద్రబాబు నాయుడు గారి సమాంతర రైల్వే లైను కోర్కె ఎట్టి పరిస్థితుల్లోనూ సాఫల్యం అయ్యే అవకాశం లేదు. నడికుడి - బీబీనగర్ రైల్వే లైన్ నిర్మాణ ప్రతిపాదన రెండు దశాబ్దములపైగా కొనసాగుతూ ఇటీవల భూసేకరణ చేయు దశకు చేరుకున్న వాస్తవం మరువరాదు.

## ముఖ్యమంత్రిగారి గొంతెమ్మ కోర్కె కొరకు వేలాదిమంది రైతులు శాశ్వతంగా నష్టపోవాలా?

భారతదేశంలో అత్యంత పొడవైన ఒంపులు లేని ఎక్స్‌ప్రెస్ హైవేను నిర్మించాలనే ముఖ్యమంత్రిగారి గొంతెమ్మ కోర్కె వలన గుంటూరు జిల్లాలో 92 కి.మీ.ల రోడ్డు నిడివిలో 8 మండలాల లోని 31 గ్రామాలలో 4575 ఎకరముల భూమిని రైతులు శాశ్వతంగా కోల్పోవలసి వుంటుంది. ఈ రోడ్డునకు అక్కడక్కడా కొన్ని ప్రధాన రహదారులు కలిసే కూడళ్ళవద్ద ఒక్కొక్కచోట 250 ఎకరముల భూమిని సేకరించాలని నిర్ణయించడం అభ్యంతరకరం. 2013 భూసేకరణ చట్టం ప్రకారం గ్రామీణ ప్రాంతాలలో 4రెట్లు నష్ట పరిహారం ఇవ్వవలసిన దానిని మన రాష్ట్రంలో 2.5 రెట్లకు తగ్గించింది రాష్ట్ర

ప్రభుత్వం. యిప్పుడు కొత్తగా జిల్లా కలెక్టర్లతో చర్చలు - ఆమోదం సాకుతో దీనిని 0.5 రెట్లకు (50%) తగ్గించటం కంటే అన్యాయం మరొకటుండదు. కావున రైతుసోదరులు రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేయాలనుకున్నప్పుడు సామాజిక ప్రభావ అంచనా, రైతుల ఆమోదం, నాలుగురెట్ల నష్టపరిహారము ఉంటేనే తాము అంగీకరించుతామని స్పష్టంగా చెప్పవలసి ఉంటుంది. భూసమీకరణ విధానంలో తీసుకోవాలని ప్రభుత్వం భావించినప్పుడు తాము అందుకు సుతరామూ అంగీకరించబోమని స్పష్టంగా తెలియపర్చాలి.

**అమరావతి - అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే ప్రతిపాదనను రాష్ట్రప్రభుత్వం వెంటనే ఉపసంహరించాలి:**

ఈ భూమిని వీలైనంతవరకు 2013 భూసేకరణ చట్టమును అనుసరించి నష్టపరిహారం యివ్వకుండానే భూసమీకరణ విధానంలో భూమిని తీసుకోవాలని ప్రభుత్వం ఆలోచించుతూ ఉండటం ఎంతమాత్రం సమర్థనీయం కాదు, రైతులు తీవ్రంగా నష్టపోతారు. ప్రత్యామ్నాయములను గురించి ఆలోచన చేయకుండా ఏకపక్షంగా “లేడికి లేచిందే పరుగు” అన్నట్లుగా భారీమొత్తంలో ఫీజులు చెల్లించి, లైడార్ సర్వే చేయించి, డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టులను ప్రైవేట్ కన్సల్‌టెంట్‌లచేత తయారు చేయించడం ఎంతమాత్రం సరికాదు. కర్నూలు నుండి గుంటూరు రాష్ట్రరహదారి ఐ.క 50ను 4లైన్ల జాతీయ రహదారిగా, అనంతపురం - కోడూరు - గిద్దలూరు - వినుకొండ - నరసారావుపేట రాష్ట్ర రహదారిని కేంద్రప్రభుత్వం చేత జాతీయ రహదారిగా అభివృద్ధి చేయుటకు కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయించితే సరిపోతుంది. కావున అమరావతి - అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే ప్రతిపాదనను రాష్ట్రప్రభుత్వం వెంటనే ఉపసంహరించాలి.

❊ ❊ ❊



# అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డు పేరుతో రైతులకు ద్రోహం చేయటం తగునా?

అమరావతి ఔటర్ రింగురోడ్డును 197.5 కి.మీ. నిడివితో 150 మీటర్ల వెడల్పుతో ప్రస్తుతం 6 వరుసలుగా నిర్మించి, భవిష్యత్తులో 8 వరుసల రహదారిగా, అదనంగా రెండు సర్వీసు రోడ్డులను ఏర్పాటు చెయ్యాలని ప్రభుత్వం నిర్ణయించింది. వారధికి తూర్పు వైపున 4.5 కి.మీ. నిడివితో మరియు బ్యారేజీకు పడమర వైపున, 3.5 కి.మీ. నిడివితో కృష్ణా నది పైన రెండు బ్రిడ్జీలు రావలసి వుంటుంది. గుంటూరు జిల్లాలో అమరావతి, ధరణికోట, లింగాపురం, బలుసుపాడు, కంభంపాడు, జలాల్‌పురం, పాటిబండ్ల, పాములపాడు, వరగాని, సిరిపురం, మందపాడు, వెలవర్తిపాడు, విసెదల, డోకిప్రరు, పేరేచర్ల, కొర్నిపాడు, గొడవర్రు, నారాకోడూరు, వేజెండ్ల, సుద్దపల్లి, సేకూరు, గుడివాడ, తాకేవరం, నందివెలుగు, చింతలపూడి, ఈమని, మున్నంగి, వల్లభాపురం మీదుగా (గుంటూరు జిల్లాలో 32 గ్రామాలు) యీ రహదారి ఉంటుంది.

కృష్ణా జిల్లాలో తోట్లవల్లూరు, వల్లూరుపాలెం, చినపులిపాక, బొడ్డపాడు, దావులూరు, నెప్పల్లి, కోలవెన్ను, మానికొండ, మారేడుమాక, వేంపాడు, తరిగొప్పల, వెల్దిపాడు, వెల్‌నూతుల, పెదఅవుటపల్లి, ఆత్కూరు, పొట్టిపాడు, తేలప్రోలు, బల్లిపర్రు, బండారుగూడెం, సూరవరం, మర్లపల్లి, నర్సింగపాలెం, సగ్గూరు, ఆగిరిపల్లి, కోడూరు, నందిగామ, గుర్రాజుపాలెం, చొప్పరమెట్ల, నర్సింగపాలెం, ఆగిరిపల్లి, శోభనాపురం, కోడూరు, మైలవరం, గంగినేని, తిమ్మాపురం, చెన్నారావుపాలెం, జుజ్జూరు, పొన్నవరం, కంచికచర్ల, మోగులూరు, మున్నలూరు (కృష్ణా జిల్లాలో 42 గ్రామాలు) గ్రామాల ప్రక్కగా వెళ్ళే ఈ అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు కొరకు మొత్తం మీద 8వేల ఎకరముల భూమి అవసరమౌతుంది. ఈ ఔటర్ రింగు రోడ్డు కొరకు అవసరమైన భూమిని రాష్ట్రప్రభుత్వ ఖర్చుతో 6 నెలల లోపు సేకరించి కేంద్రప్రభుత్వానికి అప్పచెప్పితే రూ.20వేల కోట్ల వ్యయంతో సుమారు 3 సం.రాల వ్యవధిలో పూర్తిచేయగలమని కేంద్రం చెబుతూ వుంది.

## 150 మీటర్ల వెడల్పు ఔటర్ రింగురోడ్డు అవసరమా?

కృష్ణా జిల్లాకు, మచిలీపట్నం ఓడరేవుకు అత్యంత అవసరమైన విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి 60 మీటర్ల వెడల్పుతో దాదాపు దశాబ్దకాలం గడిచిన దరిమిలా, ఇటీవలే నిర్మాణం ప్రారంభించబడింది. అనేక జాతీయ రహదారులు 60 మీటర్ల వెడల్పుతో ఉంటూ ఉండగా అమరావతి ఔటర్ రింగు రోడ్డునకు 150 మీటర్లు అవసరమని భావించడం ఎంతమాత్రమూ సరికాదు. కేరళ రాష్ట్రములో జాతీయ రహదారులు 45 మీటర్ల వెడల్పుతో ఉంటూవుంటే కేరళ రాష్ట్ర ప్రభుత్వం 30 మీటర్ల వెడల్పుకే పరిమితం చేయమని కేంద్రాన్ని కోరుతూ వుంది. 4 లైన్ల జాతీయ రహదారికి 23.5 మీటర్లు, 6 లైన్ల జాతీయ రహదారికి 43.6 మీటర్ల వెడల్పు సరిపోతుందని ఇండియన్ రోడ్డు కాంగ్రెస్ భావించింది. గ్రామాలలో 500 అడుగుల వెడల్పు ఔటర్ రింగురోడ్డు కొరకు రెవిన్యూ అధికారులు సర్వేరాళ్ళు పాతటం చట్టవిరుద్ధమే కాక, అక్రమం కూడా. రైతుల అనుమతి లేనిదే, నోటిఫికేషన్ ప్రకటించకుండానే రైతుల భూములలో సర్వే రాళ్ళు పాతటం ప్రభుత్వం యొక్క అహంకారానికి నిదర్శనం.

## అమరావతి ఓటర్ రింగురోడ్డు సమీప కాలంలో అవసరమా?

అసలు అమరావతి ఔటర్ రింగురోడ్డు సమీప కాలంలో అవసరమా అని పరిశీలించవలసి వుంటుంది. గతంలో చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉండగా దేశంలోనే అత్యంత పొడవైన 158 కి.మీ.ల హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డు ప్రణాళికను ఆమోదించటం జరిగింది. ఇప్పటికి ఇంకా అందులో దాదాపు 20 కి.మీ.ల మేర పూర్తి కావలసి ఉంది. ఆశించిన ట్రాఫిక్‌లో యిప్పటికి 10% స్థాయికి కూడా చేరలేదు. దాదాపు 2 కోట్ల జనాభాతో దేశ రాజధాని ఢిల్లీ నగర ఔటర్ రింగు రోడ్డు (ఒ.ఫ్ర.ఫ్ర) 87 కి.మీ., 60 లక్షల జనాభాతో గుజరాత్ రాజధాని అహ్మదాబాద్ ఒ.ఫ్ర.ఫ్ర 132‘ అ. వెడల్పుతో 76 కి.మీ., కోటి జనాభాతో తమిళనాడు రాజధాని చెన్నై ఒ.ఫ్ర.ఫ్ర 62 కి.మీ., 1.3 కోట్ల జనాభాతో కర్నాటక రాజధాని బెంగుళూరు ఒ.ఫ్ర.ఫ్ర. 75 మీటర్ల వెడల్పుతో 62 కి.మీ., 35 లక్షల జనాభాతో మైసూరు నగరం ఒ.ఫ్ర.ఫ్ర 45 మీ.ల వెడల్పుతో 42 కి.మీ. ఉండగా ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత పొడవైన 197.5 కి.మీ.ల ఔటర్‌రింగ్ రోడ్డు నిర్మించాలని ముఖ్యమంత్రిగారు భావించటం ఎంతమాత్రమూ సరికాదు. విజయవాడ-చెన్నై ఎన్.హెచ్.16, హైదరాబాద్-విజయవాడ-మచిలీపట్నం ఎన్.హెచ్.65, విజయవాడ-

జగదల్‌పూర్ N.H. నెం. 221, విజయవాడ-విశాఖపట్నం శ్రీ.క. 16, విజయవాడ మీదుగా వెళుతూ ఉన్నాయి. విజయవాడ-గుంటూరు ఎన్.హెచ్.5 కాజ వద్ద నుండి వెంకటపాలెం మీదుగా కృష్ణా నదిని దాటి గొల్లపూడి శివారు సూరాయపాలెం మీదుగా విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిని దాటి పెదఅవుటపల్లి వద్ద విజయవాడ-విశాఖపట్నం జాతీయ రహదారిని కలుపుటకు భూసేకరణ పూర్తి అయ్యి విజయవాడ బైపాస్ రోడ్డు పనులు యిప్పటికే జరుగుతూ వున్నాయి. గుంటూరు - తెనాలి - రేపల్లె - పులిగడ్డ - చల్లపల్లి - పామర్రు - గుడివాడ - హనుమాన్ జంక్షన్ వరకు యిప్పుడు వున్న రాష్ట్ర రహదారులను 2.5 మీ. చొప్పున ఇరువైపులా కారిడార్లను



వెడల్పు చేసుకొంటూ వెళితే సరిపోతుంది. ఇందుకొరకు భూసేకరణ చేయవలసిన అవసరమే ఉండదు. రహదారుల అభివృద్ధి కార్యక్రమం కొంత నెమ్మదిగా జరుగుతూ ఉండటం సాదారణం. ఉదాహరణకు మచిలీపట్నం-గుడివాడ-నూజివీడు-కల్లూరు రహదారిని అభివృద్ధి పరుచుటకు ప్రపంచ బ్యాంకు చాలాకాలం క్రిందటే నిధులను సమకూర్చినప్పటికి యిప్పటికీ యింకా అక్కడక్కడ పనులు మిగిలే వున్నాయి. ఈ నేపధ్యంలో 4.5 కి.మీ పొడవున 8 వరుసల రహదారికి అనువుగా ఉండే సొరంగంతో సహా 3 సం.లలో అమరావతి ఔటర్ రింగురోడ్డును పూర్తి చెయ్యాలని, దీనికి సమాంతరంగా రైల్వేలైను నిర్మాణం కూడా అత్యంత అవసరమని ముఖ్యమంత్రి గారు భావిస్తున్నట్లు వస్తున్న వార్తలు ప్రజలను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తున్నాయి.

## ముఖ్యమంత్రిగారి పగటి కల కొరకు వేలాది రైతులు శాశ్వతంగా నష్టపోవాలా?

ముందు భూసేకరణ నోటిఫికేషన్ యిచ్చి దరిమిలా భూసమీకరణ నోటిఫికేషన్ యివ్వడం రాష్ట్రప్రభుత్వానికి పరిపాటి అయ్యింది. మచిలీపట్నం పోర్టు కొరకు, పోర్టు ఆధారిత పరిశ్రమల కొరకు, విజయవాడ మెట్రో కొరకు ముందు భూసేకరణ నోటీసులు యిచ్చి దరిమిలా భూసమీకరణ పద్ధతిలో భూములు తీసుకొనడానికి ప్రయత్నాలు జరుగుతూ ఉన్నాయి. యిప్పుడు ఔటర్ రింగురోడ్డు కొరకు కూడా భూ సమీకరణ పద్ధతిలో భూమిని తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తూ ఉంది. యిందువలన రైతులు తీవ్రంగా నష్టపోతారు. ఎకరం భూమి కోల్పోతే రైతులకు వచ్చేది కేవలం 25 సెంట్లు మాత్రమే. కేవలం ఔటర్ రింగ్‌రోడ్డు కాంట్రాక్టరుకు, అధికారులకు, రాజకీయ నాయకులకు మాత్రం లాభం చేకూరుతుంది. హైదరాబాద్ ఔటర్ రింగురోడ్డు పరిసరాలలో దాదాపు భూములన్నీ రాళ్ళు, రప్పలు, తుప్పలతో ఉంటాయి. వ్యవసాయం పెద్దగా ఉండదు. కానీ కృష్ణా, గుంటూరు జిల్లాలలో ప్రతిపాదిత ఔటర్ రింగురోడ్డు అలైన్‌మెంట్‌లో కొండలు, అటవీభూమి మినహాగా ప్రతిఒక్క ఎకరం భూమిలోనూ పంటలు పండించబడుతూ ఉంటాయి. వాస్తవ అవసరం లేకపోయినా ప్రపంచంలో అత్యంత పొడవైన ఔటర్ రింగ్‌రోడ్డు వేయించాలనే ముఖ్యమంత్రిగారి పగటికల కొరకు వేలాదిమంది రైతులు శాశ్వతంగా నష్టపోతారు. “కేంద్ర 2013 భూసేకరణ చట్టం” ప్రకారం భూములు కోల్పోవు రైతులకు 4 రెట్లు నష్టపరిహారం ఇవ్వాల్సి ఉన్నా రాష్ట్రప్రభుత్వం దానిని 2.5 రెట్లకు తగ్గించింది. యిప్పుడు కొత్తగా “జిల్లా కలెక్టర్లతో చర్చలు - ఆమోదం” సాకుతో దీనిని 0.5 రెట్లకు (50%) తగ్గించటం కంటే అన్యాయం మరొకటుండదు. కావున రైతుసోదరులు రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేయాలనుకున్నప్పుడు సామాజిక ప్రభావ అంచనా, రైతుల ఆమోదం, నాలుగురెట్ల నష్టపరిహారము యిస్తేనే తాము అంగీకరించుతామని స్పష్టంగా చెప్పవలసి ఉంటుంది. భూసమీకరణ విధానంలో తీసుకోవాలని ప్రభుత్వం భావించినప్పుడు తాము అందుకు సుతరామూ అంగీకరించబోమని స్పష్టంగా తెలియపర్చాలి.

కావున సమీప భవిష్యత్తులో అవసరం లేని, రైతులకు అన్యాయం చేకూర్చే అమరావతి ఔటర్ రింగురోడ్డు ప్రతిపాదనను రాష్ట్రప్రభుత్వం వెంటనే ఉపసంహరించాలి.

❊ ❊ ❊

# మచిలీపట్నం పోర్టు - పారిశ్రామిక నడవా పేరుతో భూదందా తగదు

మచిలీపట్నం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో 1.05 లక్షల ఎకరాలలోని 36,559 ఎకరాల భూమి మచిలీపట్నం ఓడరేవు, పారిశ్రామిక నడవ కోసం అవసరమని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. యిందులో ఓడరేవు కొరకు 2,282 ఎకరాలు, అనుబంధ పరిశ్రమల కొరకు 12,144 ఎకరాల రైతువారి పట్టా భూములను ల్యాండ్ పూలింగ్ విధానంలో తీసుకోవాలని ప్రభుత్వం సంకల్పించింది. అమరావతి తరహాలో ఎకరా ఇచ్చిన వారికి 1000 గజముల నివాస స్థలం, 250 గ.లు వాణిజ్య స్థలం ఇవ్వాలని, ఏడాదికి లీజు క్రింద రైతుకు రూ.30,000/-లు యిచ్చేందుకు వ్యవసాయ కూలీ కుటుంబానికి నెలకు రూ.2,500/-లు పించను యిచ్చేందుకు అవకాశం ఉంటుంది.

**2013 భూసేకరణ చట్టం ఉండగా ల్యాండ్‌పూలింగ్ క్రింద భూములను ఎందుకు యివ్వాలి?**

అనేక దశాబ్దముల దరిమిలా రైతుల, భూములపై ఆధారపడ్డ యితర ప్రజల ప్రయోజనాలను పరిరక్షించుటకు కొరకు కేంద్రప్రభుత్వం, పార్లమెంట్ ఆమోదం పొందిన 2013 భూసేకరణ చట్టం ఇప్పుడు అమలులో వున్నది. దీని ప్రకారం నిపుణుల బృందంతో సామాజిక ప్రభావం అంచనా, పర్యావరణ అంచనాలు వేసిన తదుపరి నూటికి 70మంది రైతులు, ప్రజలు భూసేకరణకు ఆమోదించవలసి వుంటుంది. మార్కెట్ వాల్యూనకు (రిజిస్ట్రేషన్ విలువ) నకు పట్టణ ప్రాంతములో 2 రెట్లు, గ్రామీణ ప్రాంతములో 4 రెట్లు చొప్పున రైతులకు నష్టపరిహారం యివ్వవలసి వుంటుంది. దీనిప్రకారమేఉ యిటీవల భోగాపురం ఎయిర్‌పోర్టు కొరకు తీసుకోనున్న భూములకు రూ.25 నుండి 33లక్షల రూపాయలు ఎకరాలకు నష్టపరిహారం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

**మచిలీపట్నం పోర్టు కొరకు 4800 ఎకరాలు అవసరమా?**

యిప్పుడు మచిలీపట్నం పోర్టు కొరకు 4,800 ఎకరాలు అవసరమని, ప్రభుత్వ భూమి సుమారు 2,300 ఎకరాలు కాక రైతుల నుండి 2,282 ఎకరాలు భూసమీకరణలో తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించటం ఎంతమాత్రం సరికాదు. మచిలీపట్నంలో



సముద్రం లోతు (డ్రాఫ్ట్) 13 మీటర్లు, 3 బెర్తులు నిర్మించాలని పోర్టు డెవలపర్ ప్రతిపాదన, యిందుకు ప్రభుత్వ భూమి 2300 ఎకరాలు సరిపోతుంది. 21 మీటర్ల లోతుతో, 5 బెర్తులతో 14 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకును యిప్పటికే హ్యాండిల్ చేస్తూవున్న గంగవరం పోర్టునకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది 1800 ఎకరాలు మాత్రమే. అంతేకాక మన దేశంలో మేజరు పోర్టులు అయిన చెన్నై పోర్టు 500 ఎకరాలు, ఎన్నూరు పోర్టు 2000 ఎకరాలు, ట్యుటు కోరిన్ పోర్టు 2150 ఎకరాలు, కొచ్చిన్ పోర్టు 2000 ఎకరాలు, న్యూమంగళూరు పోర్టు 1908 ఎకరాలు, మార్మగోవా 530 ఎకరాల విస్తీర్ణంతోనే తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. మన రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ఆదర్శప్రాయమైన సింగపూర్‌లో పి.ఎస్.ఎ. సింగపూర్ రేవు 1500 ఎకరాలలో 52 బెర్తులతో పని చేస్తూ వుంది. అలాగే జురాంగ్ పోర్టు 400 ఎకరాలలో 32 బెర్తులతో పనిచేస్తూ వుంది. అనగా కేవలం 1900 ఎకరాలలో 84 బెర్తులతో కోట్లాది టన్నుల సరుకులను హ్యాండిల్ చేస్తూ, ఈ రెండు పోర్టులు పనిచేస్తున్నాయి. యిక్కడ మచిలీపట్నం పోర్టునకు అవసరమని చెబుతూవున్న 4800 ఎకరాలలో ఒక మినీ స్టీల్ ప్లాంట్, ఒక థర్మల్ పవర్ ప్రాజెక్టు, ఒక సెజ్, డీశాలినేషన్ ప్లాంట్ మున్నగునవి ఉంటాయని పోర్టు డెవలపర్ సమర్పించిన డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టులో (డి.పి.ఆర్) వుంది కావున ఎట్టి పరిస్థితులలోను పోర్టు కొరకు రైతుల భూమి 1 ఒక ఎకరా కూడా తీసుకోవలసిన అవసరం లేదు. ఒకవేళ వుంది అని భావించితే 2013 భూసేకరణ చట్టమును అనుసరించి న్యాయమైన నష్టపరిహారమును చెల్లించి భూసేకరణ ద్వారా తీసుకొన వచ్చును.

**పెట్రో కెమికల్ కాంప్లెక్స్ - పారిశ్రామిక నడవా కొరకు భూసమీకరణ ఎందుకు?**

మన దేశంలో అనేక రాష్ట్రాలలో రహదారుల కొరకు, పరిశ్రమల కొరకు, ప్రాజెక్టుల కొరకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు 2013 భూసేకరణ చట్టమును అనుసరించి రైతులకు నష్టపరిహారము ఇచ్చి భూములను తీసుకొంటున్నాయి. యిక్కడ మన రాష్ట్రప్రభుత్వం అమరావతి రాజధాని ప్రాంతములో రైతులు భూసమీకరణ క్రింద భూములు యిచ్చి యున్నారు, కాబట్టి మచిలీపట్నంలో కూడా అదేతరహాలో భూములు యిస్తారని భావించటం ఎంతమాత్రమూ తగదు. అది రాజధాని ప్రాంతం కావున కొంతకాలం తర్వాతనైనా మంచి ధరలు వస్తాయని మెట్ట గ్రామాలలోని రైతులు ఆశించారు. కొందరు మంత్రులు, పార్లమెంట్ సభ్యులు రైతుల భూములకు భవిష్యత్తులో కోట్లకు కోట్ల రూపాయలు వస్తాయని భ్రమలు కల్పించారు. యిప్పుడు రాష్ట్ర ప్రభుత్వమే కొన్ని ప్రైవేటు సంస్థలకు వందల ఎకరాల భూములను ఎకరాకు 50 లక్షలు చొప్పున భూసంతర్పణ చేస్తూ ఉంటే ఆ మెట్ట గ్రామాలలోని రైతుల ఆశలు రానున్న కాలంలో అడియాశలు అయ్యే పరిస్థితి వుంది. మన బందరు పట్టణంలో ప్రధానమైన రహదారి, కలెక్టరేట్ మున్నగు కొద్ది రహదారులు మినహా ఏ మాత్రమూ అభివృద్ధి జరిగినచో ప్రజలందరికీ ఎరుకే. యిట్టి పరిస్థితులలో ఎకరా భూమి (4840 చ.గ.) నష్టపరిహారం తీసుకోకుండా ప్రభుత్వానికి యిచ్చి, ప్రభుత్వం యిచ్చే 1250 చ.గ. తీసుకోవటానికి

రైతులు ఏమన్నా బిచ్చగాళ్ళా! ప్రభుత్వ భూమి దాదాపు 18 నుండి 20 వేల ఎకరాలు పెట్రో కెమికల్ కాంప్లెక్స్ మరియు పారిశ్రామిక నడవా కొరకు అందుబాటులో వుందని మంత్రులే చెబుతున్నారు. కావున ఏఏ పరిశ్రమలు వస్తాయి. వాటికి వాస్తవంగా ఎంత భూమి అవసరం అని అంచనాలు రూపొందించుకొని రైతుల నుండి అవసరమయ్యే భూములకు 2013 చట్టంను అనుసరించి నష్టపరిహారం చెల్లించి తీసుకోవాలి.

### రాష్ట్రప్రభుత్వ ఆలోచనా దోరణి మారాలి

ముఖ్యమంత్రి మన రాష్ట్రంలో 13 పోర్టులు ఉన్నాయని బ్రహ్మాండంగా అభివృద్ధి చెందేందుకు ఆస్కారం వున్నదని పదేపదే మాట్లాడుతూ వుంటారు. కాని ఈ రెండు సంవత్సరాలలో ఒక్క పోర్టు పనిని కూడా ప్రారంభించలేదు. పొరుగున వున్న ఒరిస్సా రాష్ట్రములో పరదీప్ మేజర్ పోర్టే కాక నవీన్ పట్నాయక్ ప్రభుత్వం దమ్‌రా కిరిటానియా, గోపాల్‌పూర్, మున్నగు పలు పోర్టుల అభివృద్ధికి చక్కగా కృషి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి కూడా గణనీయమైన ఆదాయాన్ని పొందుతూ వుంది. తమిళనాడు రాష్ట్రంలో యిప్పటికే 3 మేజర్ పోర్టులు వుండగా యిప్పుడు కొత్తగా 4వ మేజర్ పోర్టును కొలాచల్ సమీపంలో (ఎనైమ్) వద్ద రూ. 21వేల కోట్లు ఖర్చుతో కేంద్రప్రభుత్వం అభివృద్ధి చేసేందుకు కేంద్రమంత్రివర్గం యిటీవల ఆమోదించింది. చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడి 2 సం.రాలు దాటిపోతూ వున్న యింతవరకు దుగరాజపట్నం లేక రామాయపట్నం మేజరు పోర్టు పనులు ప్రారంభానికి నోచుకోలేదు. 2300 ఎకరాలలో బందరు పోర్టు పనిని చేపట్టుటకు నవయుగ ఇంజినీరింగ్ కంపెనీ ముందుకు రాని పక్షములో విశాఖపట్నం పోర్టు ట్రస్టువారు మన రాష్ట్రంలో ఒక పోర్టును చేపట్టి అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చిన నేపథ్యంలో మచిలీపట్నంలో 2300 ఎకరాలు ప్రభుత్వ భూమిని యిచ్చి విశాఖపట్నం పోర్టు ట్రస్టు వారిచే మచిలీపట్నం పోర్టును అభివృద్ధి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవచూపాలి. రాష్ట్రప్రభుత్వం "మడ" ఏరియాలో తలపెట్టిన భూసమీకరణ ప్రయత్నాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని రైతాంగం కోరుతూ వుంది.

* * *



## ఇరు రాష్ట్రాలు సమన్వయంతో కరువును పారద్రోలాలి

ఇటీవల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదానికి తాత్కాలికంగా తెరపడటం ఒక శుభపరిణామం. లక్షలాది ఎకరాలలో ఇంకనూ చేతికి రావలసిన వరి, మొక్కజొన్న, మిర్చి, మున్నగు పంటలు కాపాడబడ్డాయి. ఆ సందర్భముగానే యిరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు భవిష్యత్తులో యిటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా సమరస్య పూర్వకంగా చర్చించుకొని పరిష్కరించుకొందామని నిర్ణయించుకోవటాన్ని తెలుగు ప్రజలందరూ హరిస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండు రాష్ట్రములకు చెందిన పాలకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజా సంఘాలు, రైతులు యావన్మంది యిరిగేషన్ రంగమునకు సంబంధించిన పూర్వాపరాలను, మన రెండు రాష్ట్రముల మధ్యన తలెత్తుతున్న సమస్యలు, వాటితోపాటు మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలతో ముడిపడిన అంశాలు, బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ మరియు సుప్రీంకోర్టు వద్ద యిప్పటికి నిలిచి ఉన్నా న్యాయపరమైన అంశములు మున్నగువాటి అన్నిటిపైన అవగాహనతో, వాస్తవ దృక్పదంతో వ్యవహరించవలసి ఉంటుంది.

### ఆంధ్రపాలకులు తెలంగాణాకు అన్యాయం చేసారా?

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నాటి నుంచి ఇరిగేషన్ శాఖను నిర్వహించిన వారితో ఎక్కువమంది తెలంగాణాకు చెందిన వారే, శీలం సిద్దారెడ్డి, మండవ వెంకటేశ్వరరావు, తుమ్మల నాగేశ్వరరావు, కడియం శ్రీహరి, పొన్నాల లక్ష్మయ్య, సుదర్శనరెడ్డి, మున్నగు వారు రాష్ట్రంలో అత్యంత కీలకమైన మేజర్, మీడియం ఇరిగేషన్ శాఖను నిర్వహించారన్న వాస్తవాన్ని మరువరాదు. ఈనాటి తెలంగాణ ముఖ్యమంత్రి కె.సి.ఆర్. పలు సంవత్సరాలపాటు ఎన్.టి.ఆర్. ప్రభుత్వంలో, చంద్రబాబు ప్రభుత్వంలో పనిచేసిన వారే!

ఆంధ్రప్రాంతములో ఎక్కువగా, తెలంగాణ ప్రాంతములో తక్కువగా కృష్ణానది జలాలు వినియోగించబడటానికి ప్రధాన కారణం భౌగోళిక పరిస్థితులు, బ్రిటీష కాలంలోనే విజయవాడ, రాజమండ్రి, సంగంల వద్ద ఆనకట్టలు కె.సి.కెనాల్, మున్నగునవి నిర్మించబడటానికి ప్రధాన కారణం సముద్ర మట్టానికి దగ్గరలో ఉండటం, పెట్టుబడి-ప్రయోజనాలు అంశముల వల్లనే అవి సాధ్యమయ్యాయి. స్వాతంత్ర్యా నంతరం చేపట్టపడిన నాగార్జునసాగర్, శ్రీరామ్‌సాగర్, వంశధార. తుంగభద్ర మున్నగు పథకాల విషయములలో కూడా ప్రాజెక్టు వ్యయం - చేకూరు ప్రయోజనములు అంశములు పరిగణించబడుతూ ఉండేవి, సాంకేతిక సాధ్యాసాధ్యాలతోపాటు-తెలంగాణాలో భూమి సముద్ర మట్టమునకు వంద మీటర్ల నుండి 300 మీటర్ల ఎత్తు వరకూ ఉండటం,

అందువలన పలు ప్రాజెక్టులకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మాత్రమే సాధ్యమయ్యే పరిస్థితులు ఉండటం వలన యిలా జరిగింది. లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చేపట్టే ప్రాజెక్టులకు విద్యుత్ చార్జీలతోపాటు నిర్వహణా ఖర్చు కలిపితే చాలా ఎక్కువ భారం పడుతుంది. అందువలననే పలుచోట్ల ఎ.పి. ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఏర్పరచిన పలు లిఫ్ట్ స్కీంలు మూలనపడ్డాయన్న వాస్తవాన్ని మరువరాదు. అయినప్పటికీ వ్యవసాయ అభివృద్ధి కొరకు, పేదరిక నిర్మూలనకు, ఉపాది కల్పనకు ఇరిగేషన్ సదుపాయం అత్యవసరం, కావున రాష్ట్ర ప్రభుత్వాలు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను చేపట్టు తున్నాయి.

**జనాభా, పరివాహక ప్రాంతం ప్రాతిపదికలపై నీటి కేటాయింపు సాధ్యమా?**

లోగడ కర్నాటక, మహారాష్ట్ర రాష్ట్రాలు వారి రాష్ట్రాలు వారి రాష్ట్రాల పరిధిలో లభించు వర్షపు నీటి పరిమాణం, పరీవాహక ప్రాంతముల ప్రాతిపదికగా కృష్ణా జలాల పంపిణీ చేయాలని వాదించినపుడు బచావత్ ట్రిబ్యునల్ "నీటిని ఎవరు ముందు వినియోగించుతారో వారికి హక్కు ఉంటుందన్న" అంతర్జాతీయ న్యాయ సూత్రం, అమెరికాలోని చట్టములు, మన దేశంలో అప్పటి వరకూ అనుసరింపబడుతూ ఉన్న విధానపర నిర్ణయాలను దృష్టిలో ఉంచుకుని అనాటికి 3 రాష్ట్రాలలోను వినియోగంలో ఉన్న మరియు నిర్మాణంలో ఉన్న వివిధ ప్రాజెక్టుల నీటి వినియోగ సామర్యాన్ని, అవుసరాన్ని లెక్కలోకి తీసుకుని ఆంధ్రప్రదేశ్‌కు 749.10, కర్నాటక 504.55, మహారాష్ట్రకు 439.65 టి.యం.సి.లను "ప్రొటెక్టివ్ యూజ్" క్రింద కేటాయించి, మిగిలిన నీటిని మూడు రాష్ట్రాల మధ్య పంపిణీ చేసింది. అందువలన ఈనాడు తెలంగాణ ఇరిగేషన్ శాఖా మాత్యులు హరీష్‌రావు చేస్తున్న వాదన సరికాదు.

**ట్రిబ్యునల్ కేటాయింపును మార్చటం సాధ్యమా?**

మన దేశంలో అంతర్‌రాష్ట్ర నదీజలాల వివాద పరిష్కార చట్టము ప్రకారం ఏర్పాటు చెయ్యబడిన బచావత్ ట్రిబ్యునల్ చేసిన కేటాయింపులను తగ్గించటానికి చట్టరీత్యా అవకాశం లేదు. జస్టిస్ బచావత్ ట్రిబ్యునల్ తీర్పు 1976లో ఇవ్వబడినది.. 2000 సం.ల దరిమిలా అవుసరమైతే సమీక్ష చేసుకొనే వీలు కల్పించబడగా, 2004 సం.లో జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఏర్పాటు అయినది. 3 రాష్ట్రాల ప్రతినిధుల వాదనలను విచారించిన బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ప్రాజెక్టుల వారీగా బచావత్ ట్రిబ్యునల్ చేసిన కేటాయింపులను తగ్గించకుండా కొనసాగించుతూనే కృష్ణా నదిలో యింకా అదనముగా లభిస్తుందన్న నీటి పరిమాణమును, మిగులు జలాల పరిమాణములను 3 రాష్ట్రాలకు మధ్య అదనముగా కేటాయింపులు చేసినది. అందువలన ఎట్టి పరిస్థితులలోనూ ప్రాజెక్టులవారీగా బచావత్ ట్రిబ్యునల్ చేసిన కేటాయింపులకు డోకా లేదు. భవిష్యత్తులోనూ అవి కొనసాగవలసిందే.

**సమర్ధవాదన వినిపించడంలో వై.యస్. ప్రభుత్వం వైఫల్యం:**

బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తుదితీర్పు యింతవరకూ నోటిపై కాలేదు. 30-12-2010న వెలువరించిన ఇంటర్మ్ రిపోర్టు పైన 3 రాష్ట్రాలు అభ్యంతరాలను వ్యక్తం చేయడం, కొన్ని అంశములపైన వివరణలను కోరి ఉన్నాయి. నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 28-3-2011న 14 అంశములపైన అభ్యంతరాలను తెలియచేసింది. బ్రిజేష్ ట్రిబ్యునల్ వీటిలో ఏ ఒక్క దానిని అంగీకరించలేదు.



బచావత్ ట్రిబ్యునల్ ముందు తన తరపున వాదించిన ప్రఖ్యాత న్యాయకోవిదుడు నారిమన్‌నే బ్రిజేష్ ట్రిబ్యునల్ వద్ద కూడా వాదించటానికి కర్నాటక నియమించుకొంది. ఆయన నాయకత్వంలో కర్నాటక బృందం అత్యంత సమర్ధవంతముగా తన వాదనను విన్పించింది. వారు చేసిన వాదనలను చాలావాటిని బ్రిజేష్ ట్రిబ్యునల్ అంగీకరించింది. మహారాష్ట్ర కూడా లోగడ వాదించిన అంత్యార్జుననే కొనసాగించింది. కాని మన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం బచావత్ ట్రిబ్యునల్‌లో ముందు వాదించిన ఎ.కె. సేన్, నాటి అడ్వకేట్ జనరల్ రామచంద్ర రెడ్డి స్థానంలో దీపాంకర్ గుప్తాను, రాష్ట్ర అడ్వకేట్ జనరల్ సుదర్శన రెడ్డిలతో కూడిన బృందాన్ని వినియోగించినది. కర్నాటక, మహారాష్ట్రలు తమ రాష్ట్రాలలో వర్షాభావంతో కరువుతో తరచుగా బాదపడుతూ వున్న ప్రాంతాలకు సాగునీటి సౌకర్యాన్ని అందించవలసిన ఆవశ్యకతను నొక్కి వక్కాణించి, అందుకు అనుకూలమైన స్పందనను పొంది, అదనముగా కేటాయింపులను రాబట్టగలిగాయి.

మన రాష్ట్రములో అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలు కూడా కరువు రక్కసితో బాధపడుతూ, పేదరికంతో మగ్గుతూ వున్నప్పటికి సమర్ధవంతముగా మన వాదన వినిపించలేకపోయింది. పైపెచ్చు 2-3-2006న కృష్ణా నదిలో లభ్యమయ్యే మిగులు జలాలలో మన రాష్ట్రానికి వాటాను కోరబోమని వై.యస్. ప్రభుత్వం లిఖితపూర్వకంగా యివ్వటం అత్యంత దురదృష్టకరం. అందువలననే బ్రిజేష్ ట్రిబ్యునల్ కేటాయింపులలో మన రాష్ట్రానికి సరిఅయిన న్యాయం జరుగలేదు. దాదాపుగా రూ.32 వేల కోట్ల ఖర్చుతో తలపెట్టిన హంద్రి-నీవా, గాలేరు-నగరి, తెలుగుగంగ, వెలిగొండ, నెట్టెంపాడు, కల్వకుర్తి, ఎస్.ఎల్.బి.సి. పథకాలకు 227.5 టి.యం.సి.ల నీరు కావలసి యుండి, నిర్మించబడుతూ ఉండగా వై.యస్. ప్రభుత్వం మిగులు జలాలలో వాటా అవుసరం లేదని వ్రాసి యివ్వడం అత్యంత బాధ్యతారాహిత్యం.

**యిప్పుడేం చెయ్యాలి?**

ఆంధ్రప్రదేశ్ పునర్ విభజన చట్టంలో పార్టు- రిని లో "నీటి వనరుల నిర్వహణకు, అభివృద్ధి"కి సంబంధించిన అంశములో కృష్ణానది జలాల నిర్వహణ బోర్డును ఆంధ్రప్రదేశ్‌లో, గోదావరి నదీ జలాల బోర్డును తెలంగాణాలోను, ఏర్పరచాలని పేర్కొనబడింది. ప్రాజెక్టుల వారీగా ట్రిబ్యునల్స్ చేసిన నీటి కేటాయింపులను అజమాయిషీ చేయటం, పైన పేర్కొన్న నిర్మాణంలో ఉన్న 7 ప్రాజెక్టుల పర్యవేక్షణ, లోగడ నుంచి ఉన్న, యిప్పుడు నిర్మాణంలో వున్న ప్రాజెక్టులకు నీటి లభ్యత విషయంలో ఆటంకము/ప్రభావితం చెయ్యనిరీతిలో కొత్తగా ఏదైనా ప్రతిపాదన వస్తే దానిని పరిశీలించి టెక్నికల్ క్లియరెన్సు యివ్వటం వంటి బాధ్యతలను, అధికారాలను కల్పించడం జరిగినది. అందువలన ఈ 7 ప్రాజెక్టుల నిర్మాణమును యిరు రాష్ట్రాలు కొనసాగించే వీలు ఉన్నది. ఈ ప్రాజెక్టులను పూర్తిచేయుటకు అవుసరమైన నిధులను కేటాయించి, యుద్ధ ప్రాతిపదికన అత్యధిక ప్రాధాన్యత యిచ్చి పూర్తి చేస్తే రెండు రాష్ట్రాలలోను కరువు రక్కసిని పారద్రోలవచ్చు.

కర్నాటక లోని ఆల్‌మట్టి ఎత్తు పెంచుకోవటానికి అనుమతి, తుంగభద్ర నదిపై నూతనంగా ప్రాజెక్టుల నిర్మాణాలకు అనుమతి యివ్వటం, మహారాష్ట్రకు అదనముగా

కేటాయించడం వంటి కారణముల వలన భ్యవిష్యత్‌లో మన రాష్ట్రము లోనికి కృష్ణా జలాలు పై రాష్ట్రాలలో వచ్చు భారీ వరదల సమయాలలో తప్ప చాలా తక్కువ పరిమాణంలో అదికూడా చాలా ఆలస్యముగా వచ్చే పరిస్థితులు కన్పిస్తున్నాయి. ఇట్టి పరిస్థితులలో మనలోమనం కలహించుకోవటం కాకుండా బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ అంతిమంగా తీసుకున్న కొన్ని పొరపాటు నిర్ణయాలను సరిచేయించి, ఉభయ రాష్ట్రాలలోని రైతుల ప్రయోజనాలను పరిరక్షించవలసి ఉన్నది. ఉదాహరణకు 1972లో ఇరిగేషన్ కమీషన్ 75% విశ్వసనీయత ప్రకారం సగటు లభ్యతను లెక్కించాలని చేసిన సూచనను పరిగణనలో ఉంచుకుని బచావత్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపులను జరిపినది. ఆ సందర్భములో 3 రాష్ట్రాలు 75% డిపెండబిలిటీని ఆమోదించాయి. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ బచావత్ కేటాయింపులను కంటిన్యూ చేస్తూనే 1961 నుండి 47 సంవత్సరముల వ్యవధిలో సగటున 2578 టి.యం.సి.ల నీరు ఉంటుందని దీనిలో 65% డిపెండబులిటీ ప్రకారం 2293 టి.యం.సి.లు నీరు సగటున లభ్యమవుతుంది. కాబట్టి బచావత్ లెక్కించిన 2130 టి.యం.సి.లకు మించి 163 టి.యం.సి.లు లభిస్తాయని లెక్కించి అందులో నుండి మహారాష్ట్రకు 46, కర్నాటక 72, ఆంధ్రప్రదేశ్ 45 టి.యం.సి.ల నీటిని కేటాయించినది. అంతేకాక చిట్టచివరి రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో వర్షములు తక్కువ ఉన్న సంవత్సరాలలో యిబ్బంది కలుగుతుంది.

కావున మిగులు జలాలను వాడుకునే వెసులుబాటును బచావత్ ట్రిబ్యునల్ కల్పించినది. బ్రిజేష్ ట్రిబ్యునల్ 283 టి.యం.సి.లు మిగులు నీరు ఉంటుందని లెక్కించి అందులో నుండి మహారాష్ట్రకు 35, కర్నాటక 105, ఆంధ్రృదేశ్ 145 టి.యం.సి.లను కేటాయించినది. శ్రీశైలం మరియు నాగార్జున సాగర్ డ్యాంల వద్ద ఈ 145 టి.యం.సి.ల నీటిని క్యారీ ఓవర్‌గా ఉంచుకొని దుర్భిక్షం సమయంలో వినియోగించుకోవాలని సూచించినది. లోగడ 2002-03, 2003-04,, 2004-05 మున్నగు సంవత్సరములలో ఆంధ్రప్రదేశ్‌కు చాలా తక్కువ నీరు వచ్చినది. అదే సమయంలో మహారాష్ట్ర, కర్నాటకలు తమ కేటాయింపులను పూర్తిగా వినియోగించు కున్నాయి.

పైన పేర్కొన్న కారణముల వలన, ప్రపంచ వ్యాప్తంగా వాతావరణంలో వస్తున్న మార్పుల వలన భవిష్యత్తులో ఈ విధముగా - శ్రీశైలం డ్యాం లోనికి తక్కువ నీరు వచ్చే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తక్కువ వర్షపాత సంవత్సరములలో ఏర్పడు కొరతను 3 రాష్ట్రాలు పంచుకోవాలనే నిర్ణయం జరుగలేదు. కరువు సంవత్సరంలో ఏర్పడు నీటి కొరతను ఒకటి లేక రెండు రాష్ట్రాలు భరించవలసిన పరిస్థితి సరికాదను భావముతో కేంద్ర జలవనరుల శాఖ ఈ అంశముపైన స్పష్టతను యివ్వాలని బ్రిజేష్ ట్రిబ్యునల్‌ను కోరి ఉన్నది. ఉభయ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ అంశమును కేంద్రం దృష్టికి తీసుకొని వెళ్ళాలి. యిప్పటికి రెండు ట్రిబ్యునల్స్ ప్రాజెక్టు వారీగా చేసిన నీటిని పొదుపుగా, సమర్ధవంతముగా, అధిక దిగుబడికి దోహదం చేసేలా వినియోగించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలు యిప్పటికి ఈ రెండు ట్రిబ్యునల్స్ కేటాయించిన నీటి కన్నా ఎక్కువ నీటిని వినియోగించుకోకుండా ఉండేలా కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అజమాయిషీ చేయవలసి ఉంటుంది. బోర్డు విదివిదానాలను త్వరగా రూపొందించడం అవసరం.



# బడుగులపై జి.ఎస్.టి. పిడుగులు

1 జూలై, 2017 నుండి దేశమంతటా "వస్తుసేవల పన్ను" (జి.ఎస్.టి.) అమలులోకి వచ్చింది. 15 రోజులు అయినా ఇప్పటికీ కొన్ని అంశాలలో స్పష్టత కొరవడటం వలన కొన్ని వర్గాలలో గందరగోళం నెలకొన్నది. "ఒకే దేశం ఒకే పన్ను" ఆశయాన్ని సాఫల్యం చేసేందుకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో ఉన్న 12 రకాల పన్నులను జి.ఎస్.టి.లో ఏకీకృతం చేయటం జరిగింది. ఒక వస్తువుపై ఒక పన్ను విధించబడిన దరిమిలా అదే వస్తువుపై తిరిగి మరొక పన్ను విధించే అవకాశం తొలగించబడింది. దేశంలో ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి సరుకులు శీఘ్రంగా రవాణా చేయబడటానికి జి.ఎస్.టి. దోహదపడుతుంది. సామాన్య ప్రజలకు నిత్యజీవితంలో అవసరమయ్యే బియ్యం, గోదుమలు, కూరగాయలు, గుడ్లు, మాంసం, మొ॥ వస్తువులపైన జి.ఎస్.టి. పన్ను మినహాయించబడింది. కానీ సరైన అవగాహన లేని కారణంగా కొన్ని వర్గాలకు చెందిన సామాన్య ప్రజానీకంపై పెనుభారం పడుతూ ఉంది. అంతకుముందు 32.5% ఉన్న సిగరెట్‌ల పైన పన్ను 28%నకు తగ్గించబడింది. అత్యంత ఖరీదుతో కూడిన సిగరెట్లపైన జి.ఎస్.టి. 28% ఉండగా పేదవారు కాల్చే బీడీ.ల పైన 28% పన్ను విధించడం ఎంతమాత్రమూ సబబుకాదు. దేశంలో దాదాపు 45లక్షల మంది పేదవారు ముఖ్యంగా మహిళలు బీడీలు చుడుతూ ఉపాది పొందుతున్నారు. వీరుకాక అడవుల నుండి టెండు ఆకును వేలాది పేదలు సేకరిస్తూ ఉంటారు. ఈ బీడీలు చుట్టు ఆకుపైన 18% జి.ఎస్.టి. పన్ను విధించబడింది. ఫలితంగా బీడీల ధరలు పెరగటం, పేదలపై అదనపు భారం పడటం, బీడీల తయారీ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టే పరిస్థితి కనబడుతూ ఉంది. వ్యవసాయం, చేనేత, నిర్మాణ రంగముల తర్వాత అత్యధిక ప్రజానీకానికి బీడీ తయారీ రంగం ఉపాదిని కల్పిస్తూ ఉందన్న వాస్తవాన్ని మరువరాదు.

మహాత్మాగాంధీ భారతదేశం గ్రామాలలో నివసిస్తూ ఉందని, వ్యవసాయం తర్వాత చేనేత రంగం ఎక్కువమంది పేదలకు ఉపాది కల్పించగలదని చెప్పేవారు. స్వాతంత్ర్య సమరం సమయంలో పలువురు దేశ నాయకులు చెరఖాను వినియోగించి నూలుదారం తీసిన చరిత్ర మనముందు వుంది. వస్త్ర పరిశ్రమలలో చోటుచేసుకున్న అనేక పరిణామాల వలన చేనేత పనివారి సంఖ్య తగ్గుతూ వస్తూ వుంది. 1995లో 65లక్షల మంది ఉండగా ప్రస్తుతం 45 లక్షల కుటుంబాలు చేనేతపై బ్రతుకు లీడుస్తున్నాయి. కుటుంబ యజమాని, భార్య, ఇతర సభ్యులు అందరూ మగ్గంపైనే ఆధారపడి దుర్భర పరిస్థితులలో

జీవనం కొనసాగిస్తున్నారు. అత్యాధునిక యంత్రములకు తోడు పవర్‌లూమ్‌ల పోటీ వలన, నానాటికీ పెరిగిపోతూ ఉన్న నూలు ధరలు రంగుల ధరలు మున్నగు సమస్యలతో చేనేత రంగం కుదేలవుతూ ఉంది. దేశవ్యాప్తంగా వేలాదిమంది చేనేతపనివారు, ఆత్మహత్యలకు ఒడిగట్టిన సందర్భాలున్నాయి. ఇట్టి నేపథ్యంలో చేనేత రంగాన్ని ఆదుకోవలసినదిపోయి, చేనేత వస్త్రములపై 5%, నూలుపైన 5% జరీపైన 12, రంగులపైన 18% జి.ఎస్.టి. పన్నును విధించడం దురదృష్టకరం. గాంధీ పుట్టిన గుజరాత్ రాష్ట్రానికి చెందిన మోడీ ప్రభుత్వం ఇటువంటి అసంబద్ధ నిర్ణయం తీసుకొనడం శోచనీయం. రూ.1,000/-లోపు దుస్తులపైన 5%, రూ.1,000/-లు పైన వస్త్రాలకు 12% జి.ఎస్.టి. పన్ను విధింపుతో వస్త్ర వ్యాపార రంగం పెద్దఎత్తున ఆందోళన చేపట్టవలసిన పరిస్థితులు నెలకొన్నాయి. పలు రాష్ట్రాలలో వస్త్ర వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దేశ స్వాతంత్ర్యం పొందిన 10 సంవత్సరములకు నిర్భంద ప్రాథమిక ఉచిత విద్య అమలు చేసి నిరక్షరాస్యతను పారద్రోలాలని మన పెద్దలు ఆశించారు. విద్యతోనే సమాజంలో వివిధ వర్గాల మధ్య అంతరాలు తగ్గుతాయని కలలు కన్నారు. పాలకుల చిత్తశుద్ధి కొరవడటంతో నేటికి ప్రపంచంలో అత్యధిక నిరక్షరాస్యులు ఉన్న దేశంగా భారత్ కొనసాగడం జాతికి అవమానకరం. ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతూ ప్రైవేట్ స్కూళ్ళు మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నాయి. ఫీజులతో సంతృప్తి చెందని యాజమాన్యాలు ఎక్సర్‌సైజ్ నోటు బుక్కులలో వచ్చు కమీషన్‌ల కొరకు పిల్లలపైన పెనుభారం మోపుతున్నాయి. ఒకటవ తరగతి పిల్లవాని దగ్గర నుండి ఉన్నత విద్య అభ్యసిస్తూ ఉన్న వారితో సహా భుజంపైన కేజీలకు కేజీలతో కూడిన సంచులను మోస్తూ ఉండటం నిత్యకృత్యమై పోయింది. ఇప్పుడు స్కూలు పుస్తకాల సంచులపై 18%, నోటు పుస్తకాలపై పన్నును 12% తగ్గించడంతో సరిపెట్టకుండా, 5%నకు తగ్గించి నిరుపేదల పిల్లల విద్యపై ఖర్చును తగ్గించేందుకు ప్రభుత్వాలు కృషిచేయటం అవసరం.

నానాటికీ సాగు వ్యయం పెరిగిపోతూ ఉన్నందున, మార్కెట్ మాయాజాలంలో మోసపోతూ, గిట్టుబాటు ధరలు లభించక గత రెండు దశాబ్దాల కాలంలో 3లక్షల మంది రైతులు ఆత్మహత్యలకు ఒడిగట్టారు. వ్యవసాయరంగం సంక్షోభం నుండి గట్టేక్కే దానికి తీసుకోవలసిన చర్యల గురించి నివేదించేందుకు డా॥ యం.ఎస్. స్వామినాథం రైతు కమీషన్‌ను ఏర్పరచిన యు.పి.ఎ. ప్రభుత్వం ఆ కమీషన్ సిఫార్సును అమలు చేయలేదు. 3ఏళ్ళనాడు జరిగిన సార్వత్రిక ఎన్నికలలో స్వామినాథన్ కమీషన్ సిఫార్సులను అమలు చేస్తామని ఎన్నికలలో వాగ్ధానం చేసిన మోడీ ప్రభుత్వం ప్లేటు ఫిరాయించింది. సాగునీటిని పొదుపుగా వినియోగిస్తూ అత్యధిక దిగుబడులను సాధించాలని "ప్రధాన మంత్రి కృషి సంచాయి యోజన" కార్యక్రమాన్ని చేపట్టారు. వర్షాభావ ప్రాంతాలలో చాలా ఉపయోగపడగల మైక్రో ఇరిగేషన్ పరికరాలపై 18% పన్ను నిర్ణయం జరిగింది. పలుకారణాల వలన వ్యవసాయ రంగంలో కూలీల లభ్యత తగ్గి, యాంత్రీకరణ ఆవశ్యకత



నానాటికీ పె రుగుతూ ఉంది. రోటోవేటర్, త్రెషర్, లేజర్ లెవిలర్, మొ॥ వ్యవసాయ పనిముట్లపైన ఇప్పటి వరకు ఎక్సైజ్ డ్యూటీ, వ్యాట్ లేదు. జి.ఎస్.టి. చట్టంలో వ్యవసాయ పనిముట్లపైన 12% పన్ను విధించబడింది. వాతావరణంలో మార్పులు, కీటకాల నిరోధక శక్తి పెరగటం వలన సస్యరక్షణ కొరకు ప్రతి రైతు వేలాది రూపాయలు వెచ్చించవలసి వస్తూంది. పురుగు మందుల పైన పన్నులు 5 నుండి 18% పెరిగింది. స్ప్రేయర్‌ల పైన ఇప్పటి వరకు 6% పన్ను ఉండగా జి.ఎస్.టి.లో 18% నకు పెరిగింది. ఎలక్ట్రికల్ మోటార్ల మీద 7% నుండి పన్ను 12% పెరిగింది. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని చెబుతూనే సేంద్రీయ ఎరువులపైన గతంలో పన్ను లేని దానికి ఇప్పుడు జి.ఎస్.టి.లో 5% విధించబడింది. ప్రీ ఫేబ్రికేటెడ్ పాలీ హౌస్‌లపైన పన్ను 5% నుండి 12% నకు పెంచటం వలన ఎకరాకు ఖర్చు రూ.10లక్షలకు పైన పెరగనుంది. ట్రాక్టర్, విడిభాగాలపై 18% గా ఉన్న పన్నును 5%నికి తగ్గించవలసిన అవసరం ఎంతైనా ఉంది. బంగారు ఆభరణాలపై మరియు విలువైన వజ్రములు, రాళ్ళు పైన 13.5%గా ఉన్న పన్నును బంగారంపై 3%కు, వజ్రముల పైన 0.25%నకు తగ్గించిన ప్రభుత్వం తన కాళ్ళమీద తాను బ్రతుకుతూ దేశ ప్రజలందరికి ఆహారాన్ని సమకూరుస్తూ పారిశ్రామిక రంగాలకు అవసరమైన ముడివస్తువులను అందచేస్తూ ఉన్న రైతాంగం పైన, అందునా నూటికి 85మందిగా ఉన్న సన్నకారు, చిన్నరైతుల పైన సానుభూతితో నిర్ణయాలు తీసుకొనవలసి ఉంది.

లక్షలాది మందికి ఉపాధిని కల్పిస్తూ ఉన్న నిర్మాణరంగం మరియు గ్రానైట్ పరిశ్రమల పట్ల కూడా సరైన అవగాహనతో ప్రభుత్వం నిర్ణయాలు తీసుకొనకుంటే ఇవి కూడా తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కోవలసి ఉంటుంది. సాగు, త్రాగునీరు సరఫరా, డ్రైనేజీ వ్యవస్థల కొరకు పైపు లైన్లను వేసే సందర్భంలో 18% సర్వీస్ ట్యాక్స్‌గా నిర్ణయించడం అసమంజసం. ఇప్పటికైనా ఆచరణలో ఎదురవుతూ ఉన్న ఇబ్బందులు, వివిధ వర్గాల నుండి వస్తూ ఉన్న డిమాండ్‌లను, సూచనలను అన్ని కోణాల నుండి పరిశీలించి బేషజాలకు పోకుండా అవసరమైన సవరణలను వెంటనే తీసుకురావలసిన అవసరం ఎంతైనా ఉంది. పెట్రోల్, డీజిల్, పెట్రోలియం ప్రొడెక్ట్స్‌లను జి.ఎస్.టి. పరిధిలోకి తీసుకురాకుండా వేలాదికోట్ల రూపాయల అదనపు భారాన్ని కేంద్ర ప్రభుత్వం భారతప్రజల మీద యిప్పటికీ మోపుతూనే ఉంది. ఒక మంచి లక్ష్యాన్ని చేరాలంటే ప్రయాణించ వలసిన మార్గం కూడా మంచిగానే ఉండాలని గాంధీజీ చెబుతూ వుండేవారు. కావున "ఒకే దేశం, ఒకే పన్ను" మరియు "పన్ను మీద పన్ను లేదు" ఆదర్శాలకు భంగం లేకుండానే రైతులు, చేనేత కార్మికులు, బి.డి. కార్మికులు, గ్రానైట్ పరిశ్రమతోపాటు నిర్మాణ రంగంలో జీవనోపాధి పొందుతూ ఉన్న కోట్లాది మంది ప్రజలపై పడిన జి.ఎస్.టి. భారాన్ని తగ్గించేందుకు జి.ఎస్.టి. కౌన్సిల్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ప్రజానీకం కోరుకుంటూ ఉంది.

❊ ❊ ❊

# ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం (ఆర్.సి.ఇ.పి) వలన ఎవరికి లాభం?

ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం (ఆర్.సి.ఇ.పి) చర్చలు తుదిదశను సమీపిస్తున్నాయి. హైదరాబాద్ నగరములో యిటీవల 16 దేశముల ప్రతినిధులు వివిధ అంశాలకు సంబంధించిన చర్చలను జరిపారు. బ్రూనై, వియత్నాం, ఇండోనేషియా, మలేషియా, తాయిలాండ్, సింగపూర్, కంబోడియా, లాఓస్, ఫిలిప్పీన్స్, మయన్మార్ మున్నగు పదిదేశములతో కూడిన ఆసియాన్ దేశాలతోపాటు, ఆసియాన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందములు ఉన్న ఇండియా , చైనా, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలతో ఒక బృహత్తర స్వేచ్ఛా వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందమును రూపొందించేందుకు 2013లో ప్రారంభమైన చర్చలు రానున్న సెప్టెంబర్ మాసములో ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరుగనున్న మంత్రుల స్థాయి సమావేశములో తుదిరూపు దిద్దుకోనుంది. ఇప్పటివరకు ఏ దేశము ఏఏ ప్రతిపాదనలను చర్చలలో ప్రవేశపెట్టాయో, వాటి పైన ఇతర దేశాలు వ్యక్తము చేసిన అభిప్రాయాలను గురించికాని, ఇప్పటివరకు మనదేశ ప్రజలకు గాని అత్యున్నతమైన చట్టసభ పార్లమెంటుకుగాని తెలియపర్చలేదు. ప్రస్తుత తరములోని వారిపైనే కాకుండా రాబోవు తరాల ప్రజలపైన కూడా ప్రభావము చూపగల ప్రతిపాదనలను రహస్యముగా ఉంచడము ఎంతమాత్రము తగదు.

**డబ్ల్యు.పి.ఒ. కన్నా ప్రమాదకారి ఆర్.సి.ఇ.పి:**

1990వ దశకములో గాట్ ఒప్పందము, ప్రపంచ వాణిజ్య సంస్థ, నియమ, నిబంధనలను గురించి సామాన్యులకు అర్థముకాని లీగల్ టెర్మినాలజీతో ఉన్నప్పటికీ కనీసం ఆ పత్రములు బహిర్గత మయ్యాయి. వాటిలో ఉన్న పేటెంట్ నిబంధనలవలన, మనదేశములో విత్తన రంగానికి, ఔషద రంగానికి, వ్యవసాయ రంగానికి నష్టము చేకూరవచ్చునని, "నేషనల్ వర్కింగ్ గ్రూప్ ఆఫ్ పేటెంట్స్ లాస్"తో పాటు పలువురు



శాస్త్రవేత్తలు, రైతు సంఘాలు ప్రభుత్వముపైన ఒత్తిడి తేవడముతో కొంతమేరకు రక్షణాత్మక నిర్ణయాలు చేయబడ్డాయి. మన దేశములో ఒక వస్తువుపైన పేటెంట్ అనగా "ప్రోడక్టు పేటెంట్"కు అవకాశము లేకుండా అది తయారు చేయబడు విధానము పైన మాత్రమే అనగా ప్రాసెస్ పేటెంట్ నకు మాత్రమే ఆస్కారము కలిగించబడింది. విత్తనముల పైన, ఆగ్రో కెమికల్స్‌పైన, ఔషధములపైన పేటెంట్ చేయుటకు వీలులేదు. మన దేశములో పురాతన కాలము నుండి మన పూర్వీకులు పలు రకాల పంటల విత్తనాలను రూపొందించి వున్నారు. కావున అట్టి రైతుల ప్రయోజనాలను మరియు ప్లాంట్ బ్రీడర్‌ల హక్కులను సమన్వయపరుస్తూ ఒక చట్టమును కూడా తీసుకొని రావడము జరిగింది. ప్రపంచ వాణిజ్య సంస్థ నియమ నిబందనలు మరియు విధివిధానాలు, అమెరికా, యూరోపియన్ యూనియన్, కెనడా, జపాన్, మున్నగు ధనిక దేశాలకు ఎక్కువ ప్రయోజనాలను చేకూరుస్తూ, భారత్ లాంటి వర్ధమాన దేశాలకు నష్టము చేకూర్చుతున్నాయని ఆలస్యముగా గ్రహించి, దోహా సమావేశములో వర్ధమాన దేశములు తీవ్రముగా ధనిక దేశాల వైఖరి పట్ల అభ్యంతరము తెలియచెప్పిన పర్యవసానముగా దోహా డెవలప్‌మెంట్ రౌండ్ డిక్లరేషన్ ప్రకటించబడినా, యింతవరకు అమలుకు నోచుకోని పరిస్థితి ఉంది. ధనిక దేశాలు తమ దేశాలలో పెద్దపెద్ద వ్యవసాయ కార్పోరేట్ సంస్థలకు, పెద్దపెద్ద రైతులకు అందచేస్తున్న సబ్సిడీలను కొనసాగిస్తూనే, అభివృద్ధి చెందుతూ ఉన్న దేశాల దిగుమతి సుంకాల స్థాయిని బాగా తగ్గించి, తమ ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలను మెరుగుపర్చుకోవడము కొరకు డబ్ల్యు.టి.ఓ.కు వెలుపల స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను చేసుకొంటూ ఉన్నాయి. అట్టి ప్రక్రియలో ఒక భాగముగానే ఆర్.సి.ఇ.పి. చర్చలు జరుగుతూ ఉన్నాయి.

**నూనె గింజల సాగు రైతుల పాలిట గొడ్డలిపెట్టు:**

ఆర్.సి.ఇ.పి. చర్చలలో స్వేచ్ఛా వాణిజ్యానికి (0 నుండి మూడు శాతము వరకు) భారత్ అంగీకరించితే, కోట్లాదిమంది ప్రజల జీవన భద్రతకు తీవ్రమైన నష్టము వాటిల్లుతుంది. ముఖ్యముగా వ్యవసాయము రంగం పైన ప్రభావం చూపుతుంది. యిప్పటి వరకు మన దేశం లోనికి దిగుమతి అయ్యే వ్యవసాయ ఉత్పత్తుల పైన సగటున 32.5% దిగుమతి సుంకాలు ఉన్నాయి. యిప్పుడు 0 నుండి మూడు శాతము వరకు దిగుమతి సుంకాలను తగ్గించితే యిబ్బడి ముబ్బడిగా విదేశాల నుండి వ్యవసాయ ఉత్పత్తులు దిగుమతి అయ్యి యిప్పటికే తీవ్రమైన సంక్షోభంలో కొట్టుమిట్టాడుతూ ఉన్న వ్యవసాయ రంగం, ఈ రంగం పైన ఆధారపడి ఉన్న దేశ జనాభాలో సగం శాతం మంది ప్రజల ఆదాయాలకు భంగం వాటిల్లుతుంది. ఉదా॥ రాజీవ్‌గాంధి ప్రధానిగా ఉండగా దేశములో కొరతగా ఉన్న ఆయిల్ సీడ్స్ అధికోత్పత్తి సాధన కొరకు "టెక్నాలజి మిషన్ ఆన్ ఆయిల్ సీడ్స్" మిషన్‌ను ఏర్పాటు చేసి ప్రోత్సాహకమైన ధరను ఇవ్వడమేకాకుండా, వాటి కొనుగోలు వ్యవస్థను కూడా ఏర్పాటు చేసినందున, దేశములో

వంట నూనెల ఉత్పత్తి 1981-82సం.లో 11 మిలియన్ మెట్రిక్ టన్నులు ఉన్న ఆయిల్ సీడ్ ఉత్పత్తి 1994-1995 నాటికి 25 మి.మె. టన్నులకు పెరిగింది. 1990 నుండి ప్రారంభమైన ఆర్థిక సంస్కరణలు, ఎగ్జిమ్ పాలసి మరియు డబ్ల్యు.టి.ఒ. నిబంధనల వలన పెద్ద ఎత్తున వ్యవసాయ ఉత్పత్తులు దిగుమతి అవుతున్నాయి. ఫలితముగా నూనె గింజల పంటల ధరలు తగ్గిపోయాయి. పర్యవసానముగా ఏటా కోటి టన్నులకు పైగా వంట నూనెలను దిగుమతి చేసుకోవలసి వచ్చింది. ఉదా॥ 2015-16 సం.లో రూ.64వేల కోట్లు చెల్లించి ఇండోనేషియా, మలేషియాల నుండి 96 లక్షల టన్నుల పామాయల్‌ను, 32 లక్షల సోయాబీన్ ఆయిల్‌ను అర్జెంటీనా, బ్రెజిల్ దేశాల నుండి మరియు 14 లక్షల టన్నుల సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను ఉక్రెయిన్, మెక్సికో దేశాల నుండి దిగుమతి చేసుకోవడం జరిగింది.

మన దేశములో దాదాపు 7లక్షల ఎకరములలో ఆయిల్‌పామ్ తోటలు ఉన్నాయి. ఇందులో సగ భాగము విస్తీర్ణము ఆంధ్రప్రదేశ్‌లో ఉంది. దేశంలో దాదాపు 19 లక్షల ఎకరాల భూములు ఆయిల్‌పామ్ తోటలకు అనుకూలముగా ఉన్నాయని గుర్తించబడింది. ఒక హెక్టారు భూమిలో వేరుశనగ పంట నుండి 400 కిలోల వేరుశనగనూనె వస్తూ ఉండగా హెక్టారు పామాయిల్ తోట నుండి 4000 కిలోల పామాయిల్ లభిస్తూ వుంది. సగటున రైతుకు పామాయిల్ తోట సాగు వ్యయము ఎకరాకు సగటున రూ.55వేల నుండి రూ.60వేలు అవుతూ వుందని పెదవేగి లోని ఆయిల్‌పామ్ పరిశోధన సంస్థ అంచనా వేసినది. అనగా సగటున టన్నుకు రూ.8,000/-లు ఉత్పత్తి వ్యయము అవుతుంది అన్నమాట. కాని ఇండోనేషియా, మలేషియాలో సాగు వ్యయము ఎకరాకు రూ.12 వేలు మాత్రమే, అక్కడ టన్ను ఫామ్ ఆయిల్ ఉత్పత్తి వ్యయము టన్నుకు రూ.1800/- మాత్రమే డబ్ల్యు.టి.ఓ. ప్రకారము భారత్ లోనికి దిగుమతి అయ్యే వంట నూనెలపైన గరిష్టముగా 300% వరకు సుంకం విధించే అవకాశము ఉన్నా మొదట్లో విధించిన 65% నుండి దరిమిలా 30%నకు తరువాత 15%నకు తాజాగా 7.5%నకు ముడిపామ్ఆయిల్ పైన సుంకం తగ్గించబడింది. భారత సాల్వెంట్ ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ యూనిట్ల అసోసియేషన్ ముడి పామ్ఆయిల్ పైన 7.5% నుండి 25% నకు, రిఫైండ్ ఆయిల్ పైన సుంకాన్ని 45%నకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరింది. ఇప్పుడు మన దేశము 0%-3%కు అంగీకరించితే ఇండోనేషియా, మలేషియాల నుండి పామ్ ఆయిల్ వరదలా మనదేశీయ మార్కెట్‌ను ముంచెత్తడము, ఫలితముగా దేశీయ పామాయల్ ధరలు కనిష్ట స్థాయికి పడిపోయి, ఆయిల్‌పామ్ రైతులకే కాక, వేరుశనగ, నువ్వులు, ఆముదాలు, సోయాబీన్, సన్‌ఫ్లవర్ పంటలను సాగుచేస్తూ ఉన్న రైతుల ఆదాయములపైన కూడా తీవ్రముగా దెబ్బతీయుటము వలన దేశములో దాదాపు 27 మిలియన్ హెక్టార్లలో నూనెగింజల పంటల సాగు చేస్తూ ఉన్న 5 కోట్ల రైతు కుటుంబాల జీవన భద్రత ప్రమాదములో పడుతుంది.



**దేశీయ పాడి పరిశ్రమకు పెనుముప్పు:**

అలాగే కోట్లాదిమంది సన్నకారు, చిన్నకారు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, బలహీన వర్గాలకు చెందిన పేదల కుటుంబాలకు పశుపోషణ, పాడి పరిశ్రమ ఒక ఆలంబనగా వుంది. దేశీయముగా వ్యవసాయ స్థూల ఉత్పత్తిలో 24% ఈ రంగము నుండి చేకూరుతూ ఉంది. కీ॥శే॥ వర్గీస్ కురియన్ నేతృత్వములో శ్రీమతి ఇందిరాగాంధి హయాములో ప్రారంభమైన "పాలవెల్లువ" కార్యక్రమము అత్యంత జయప్రదముగా కొనసాగి, పాలఉత్పత్తిలో ఈనాడు మన దేశం మొట్టమొదటి స్థానానికి చేరింది. మన దేశములో కన్నా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలలో పాల ఉత్పత్తి వ్యయము చాలా తక్కువ. అంతేకాక వారి దేశీయ అవసరాలకు ఐదురెట్లు ఎక్కువగా పాల ఉత్పత్తి అవుతున్నాయి. ప్రస్తుతము భారత్‌లోనికి దిగుమతి అయ్యే పాలపొడిపైన సుంకము 15% నుండి 60% ఉంది. వెన్నపై సుంకము 40% ఉంది. భారతదేశము లోని అతిపెద్ద పాల ఉత్పత్తి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలయిన అమూల్, గుజరాత్, కర్నాటక రాష్ట్ర సంఘాలు, కేంద్రప్రభుత్వాన్ని పాలు, పాల ఉత్పత్తుల అంశాన్ని ఆర్.సి.ఇ.పి. చర్చల నుండి తొలగించాలని కోరుతూ వున్నాయి. 0 నుండి 3% సుంకానికి భారత్ అంగీకరిస్తే మన దేశములో డైరీ పరిశ్రమ కుదేలవటమేకాక, కోట్లాదిమంది చిన్నచిన్న పాల ఉత్పత్తిదారులు (అత్యధికముగా వీరిలో మహిళలు) ఆర్థికముగా తీవ్రమైన నష్టానికి గురిఅవుతారు. పాలఉత్పత్తులేకాక పశుమాంసము కూడా ఆస్ట్రేలియా నుండి పెద్దఎత్తున దిగుమతి అయ్యే ప్రమాదముంది.

**ప్రజారోగ్య సంరక్షణ మరియు చౌక జనరిక్ మందులకు విఘాతం:**

లోగడ డబ్ల్యు.టి.ఒ. చర్చలలో మనదేశము 1970 దశకములో రూపొందించబడిన "ట్రిప్స్" అగ్రిమెంట్‌నకు మాత్రమే అంగీకరించింది. అంతకన్నా కఠినమైన నిబంధనలు ఉన్న "ఏఆంజ"నకు భారత్ అంగీకరించ లేదు. ఇప్పుడు జపాన్ ఆర్.సి.ఇ.పి. చర్చల లోనికి ఏఆంజ అంశమును ముందుకు తెచ్చింది. ఇందుకు భారత్ అంగీకరించితే మనదేశములో విత్తన రంగముపైన, ఔషధ రంగము పైన తీవ్రమైన ప్రభావము పడుతుంది. బహుళ జాతి విత్తన కంపెనీలు మన వ్యవసాయ రంగంలో తన స్థానాన్ని మరింత విస్తృతపరచు కుంటాయి. అధిక విత్తన ధరలతో సన్నకారు, చిన్న రైతులపై చాలా భారము పడుతుంది. ఇప్పటివరకు హెచ్.ఐ.వి. హెపటైటిస్ సి, క్యాన్సర్, మున్నగు వ్యాధులకు తక్కువ ధరలతో కూడిన 'జనరిక్ మందుల'ను తయారు చేసే వెసులుబాటు వుంది. బహుళజాతి, ఫార్మాస్యూటికల్ కంపెనీల మందుల ధరలతో పోలిస్తే ఇవి చాలా తక్కువ ధరలకే లభించుతూ, మన దేశములోని పేదలకే కాక, ఆఫ్రికా ఖండములోని దేశములతోపాటు పలు ఇతర వర్ధమాన దేశాలలోని రోగులకు కూడా ప్రయోజనము చేకూరుతూ వుంది.

## సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామిక యూనిట్లకు ప్రమాదం:

మన దేశము నుండి సేవా రంగము ద్వారా ఇతర దేశముల లోనికి ప్రవేశించే అవకాశములు చాలా స్వల్పముగా ఉంటాయని నిపుణులు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ వున్నారు. ఈ స్వేచ్ఛా ఒప్పందము పైన భారత్ సంతకము పెడితే మనదేశ జి.డి.పి. 1.5% తగ్గిపోతుంది అని వాణిజ్య వర్గాలు అంచనా వేశాయి. ఇప్పటి వరకు మన దేశములోనికి పారిశ్రామిక వస్తువుల దిగుమతుల పైన సగటున 10% దిగుమతి సుంకము విధించబడుతూ వుంది. ఇప్పుడు దీనిని 0-3%నకు తగ్గించితే చైనా, జపాన్, దక్షిణ కొరియా దేశాల నుండి యిబ్బడిముబ్బడిగా ఉక్కు, పారిశ్రామిక, ఎలక్ట్రానిక్స్, వినియోగ వస్తువులు దిగుమతి అయ్యి, మనదేశములో 3.6% కోట్ల సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు తీవ్రముగా నష్టపోయే ప్రమాదము ఉంది. దాదాపు 8కోట్ల మందికి ఈ రంగము ఉపాధిని కల్పిస్తూ వుంది. మొత్తము మాన్యుఫాక్చరింగ్ రంగం ఉత్పత్తిలో 45% ఈ రంగానిదే. మనదేశము నుండి జరిగే ఎగుమతులలో 40% ఈ రంగానిదే. ఇప్పటికే సకాలములో తగినంత ఋణ పరపతి అందక వేలాది చిన్న పరిశ్రమలు మూతపడుతూ ఉన్న నేపధ్యంలో ఈ ఇ-కామర్స్ పద్ధతిలో దిగుమతి సుంకాలు లేకుండా వస్తువులను దిగుమతి చేయడం ఈ రంగానికి గుదిబండగా తయారై యం.ఎస్.యం.ఇ. యూనిట్లు మూతపడి లక్షలాదిమంది ఉపాధిని కోల్పోయే ప్రమాదం స్పష్టంగా కన్పిస్తూ ఉంది.

## వివాద పరిష్కారం దేశం వెలుపల ఎందుకు?

"ఇన్వెస్టర్ - ప్రభుత్వ వివాద పరిష్కారము" అంతర్జాతీయ కోర్టు ఆఫ్ ఆర్బిట్రేషన్ వద్ద పరిష్కరించబడాలని పేర్కొనబడింది. బహుళజాతి కార్పొరేషన్ సంస్థలతో అంతర్జాతీయ న్యాయస్థానములో లిటిగేషన్‌ను ఎదుర్కొనాలి అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా తలకు మించిన భారము అవుతుంది. స్థానిక ప్రభుత్వాల విధానాలను, నిర్ణయాలను విదేశీ కంపెనీలు కోర్టులకు ఈడుస్తాయి. ఉదాహరణకు ఉత్తర కోస్తా ఆంధ్రలో బాక్సైట్ నుండి అల్యూమినియం ఉత్పత్తి చేయుటకు రస్‌కల్ అల్ ఖైమాకు లోగడ ఇచ్చిన లైసెన్సును ప్రభుత్వం రద్దుచేసినందుకు రూ.250 కోట్లు నష్టపరిహారము ఇవ్వాలని అంతర్జాతీయ న్యాయస్థానము ద్వారా నష్టపరిహారం ఇవ్వాలని ఆ కంపెనీ డిమాండు చేస్తూంది.

కావున కేంద్రప్రభుత్వము ఇప్పటి వరకు ఆర్.సి.ఇ.పి. చర్చలకు సంబంధించిన యావత్ సమాచారాన్ని బహిర్గతము చేసి, తత్ సంబంధిత వర్గాలతో చర్చించటము ఎంతైనా అవసరము. పార్లమెంట్ ఆమోదము లేకుండా ఎట్టి నిర్ణయములు చేయటము తగదు. కోట్లాదిమంది ప్రజల ప్రయోజనాలను పణంగా పెట్టి విదేశీ, స్వదేశీ, బహుళజాతి కార్పోరేట్ సంస్థలకు లాబాలను కట్టబెట్టే ఆర్.సి.ఇ.పి. చర్చల విషయములో ప్రభుత్వము తగు జాగరూకతతో వ్యవహరించాలని ప్రజానీకం కోరుకుంటూ ఉన్నది.



# నవ్యాంధ్రకు ప్రత్యేక హోదా తిరస్కరణ న్యాయమా?

14వ ఫైనాన్స్ కమీషన్ సిఫార్సులు నూతనంగా రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇచ్చేందుకు అడ్డుపడుతున్నాయని ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ, కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు, మున్నగువారు మాట్లాడుతూ ఉన్నారు. కేంద్రప్రభుత్వానికి వచ్చు నికర పన్నుల మొత్తాన్ని రాష్ట్రాలకు ఏ మేరకు, ఏవిధంగా పంచాలో సిఫార్సులు చేయటం ఫైనాన్స్ కమీషన్ యొక్క కర్తవ్యం. కమీషన్ చేసిన రికమండేషన్స్ సలహాగా మాత్రమే తప్ప కేంద్రం ఆమోదించవచ్చు లేక మార్పులు చేయవచ్చు. ఒక రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చే అధికారం ప్రధానమంత్రి, కేంద్రమంత్రులు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్లానింగ్ కమీషన్ సభ్యులు (ఇప్పుడు నీతి ఆయోగ్ సభ్యులు) మరియు ఫైనాన్స్ కమీషన్ సభ్యులుగా ఉండే జాతీయ అభివృద్ధి మండలికి ఉంటుది. ఎ. ప్రత్యేక ప్రాంతం బి) తక్కువ జనాభా సాంద్రత లేక గిరిజన జనాభా శాతం గణనీయంగా ఉండే సి) ప్రక్క దేశాలతో సరిహద్దు ఉండే డి) ఆర్థిక మరియు మౌలిక వసతుల వెనుకబాటుతనం మరియు ఇ) రాష్ట్ర ఆర్థిక స్థితిగతులు గడ్డుగా ఉండే అటువంటి రాష్ట్రాలకు ప్రత్యేక హోదా రాష్ట్రాల జాబితాలో చేర్చటం జరుగుతుంది. ఇప్పటికే 11 రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఉంది.

నవ్యాంధ్రకు ప్రత్యేక హోదా ఇస్తే కొన్ని ఇతర రాష్ట్రాలు కూడా డిమాండు చేస్తాయని కేంద్రమంత్రులు పదేపదే మాట్లాడుతూ వస్తున్నారు. నవ్యాంధ్రకు రాజధాని లేదు. వందలాది కేంద్ర, రాష్ట్ర సంస్థలు, పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు ఉన్న హైదరాబాద్ నగరాన్ని వదులుకోవలసి వచ్చిన కారణంగా నవ్యాంధ్రలో పెద్దఎత్తున పరిశ్రమలు వచ్చి లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. 2014-2015లో ఉన్న సుమారు రూ.16,000 కోట్ల లోటు రానున్న దీర్ఘకాలంలో కూడా ఆర్థిక లోటు కొనసాగుతూనే ఉంటుందని ఆర్థికవేత్తలు చెబుతూ ఉన్నారు. ఉత్తరాంధ్రలో 3 జిల్లాలు, రాయలసీమ-కరువు సీమలో 4 జిల్లాలు అత్యంత వెనుకబడి ఉన్నాయని కేంద్రమే అంగీకరిస్తూ ఉన్నది. ఇన్ని కారణములవలననే ఆనాటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ నవ్యాంధ్రకు ప్రత్యేక హోదా 5 సం.లపాటు ఉంటుందని

పార్లమెంటులో హామీ ఇవ్వటం, అందుకనుగుణంగా కేంద్రమంత్రివర్గంలో తీర్మానం చేసి తదుపరి చర్యల కొరకు ప్లానింగ్ కమీషన్‌కు పంపటం జరిగింది.

ఇట్టి నేపథ్యంలో నవ్యాంధ్రకు ప్రత్యేక హోదా తిరస్కరించటం ఎంతమాత్రం న్యాయం కాదు. ప్రత్యేక హోదా పొందుటకు అవసరమగు అంశాలు ఒరిస్సా, బీహార్, చత్తీస్‌గడ్, జార్ఖండ్, మున్నగు రాష్ట్రాలకు కూడా వర్తిస్తాయి. ఉదాహరణకు ఒరిస్సా రాష్ట్రంలో 40% ప్రజలు ఎస్.సి., ఎస్.టి., క్యాటగిరీలకు చెందినవారు, మొత్తం 314 బ్లాకులలో 118 గిరిజనులు మెజారిటీగా ఉన్నవే. మొత్తం 30 జిల్లాలలో 20 జిల్లాలకు మావోయిష్టు ప్రభావం ఉన్నది. 7 జిల్లాలలో రైల్వే వ్యవస్థ లేనేలేదు. అలాగే బీహార్ రాష్ట్రంలో 41% ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు. చిన్న రాష్ట్రమైన గుజరాత్‌లో ఆర్గనైజ్‌డ్ సెక్టార్‌లో 19 లక్షల మంది ఉపాధి పొందుతూ ఉండగా దేశంలో రెండవ పెద్ద రాష్ట్రమైన బీహార్‌లో 4.3 లక్షలమందికి మాత్రమే ఉపాధి అవకాశాలు లభించాయి. దుర్భర దారిద్ర్యం వలన బీహారీలు దేశంలో పలు ప్రాంతాలలో వివిధ రంగాలలో

కూలీలుగా పనిచేసుకుంటూ ఉన్న వాస్తవం ఉంది. అలాగే ఛత్తీస్‌గడ్, జార్ఖండ్ రాష్ట్రాలలో గిరిజనుల జనాభా చాలా ఎక్కువగా ఉండటమేగాక మావోయిష్టు ప్రభావం కూడా చాలా తీవ్రంగా ఉన్న యదార్థం ఎవరూ కాదనలేము. దేశం స్వాతంత్ర్యం పొంది 70 సం.లు కావస్తున్నా కొన్ని రాష్ట్రాలలో ఇటువంటి దయనీయ, ఆందోళనకర పరిస్థితులు కొనసాగుతూ ఉండటం బాధాకరం. కావున కేంద్రప్రభుత్వం ఇటువంటి రాష్ట్రములు -ఆంధ్రప్రదేశ్‌తో సహా సత్వరంగా సర్వతోముఖాభివృద్ధిని సాధించుటకు తోడ్పడవలసిందిపోయి ఇప్పుడు ఆ హోదా కల్గిఉన్న 11 రాష్ట్రాలకు కూడా హోదా రద్దు చేయబోతున్నామని చెప్పటం ఎంతమాత్రం తగదు. ఈ విషయమై కేంద్రప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃపరిశీలించి జాతీయ అభివృద్ధి మండలిలో నవ్యాంధ్రతోపాటు ఒరిస్సా, బీహార్, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్, మున్నగు రాష్ట్రాలకు కూడా ప్రత్యేక హోదా కొనసాగించుటకు చర్యలు తీసుకోవలసి ఉంటుంది.

**ప్రత్యేక హోదా కొరకు ఎందుకు పట్టు పట్టాలి:**

ప్రత్యేక హోదా కల రాష్ట్రాలలో పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధి కొరకు 100% ఎక్సైజ్ డ్యూటీ మినహాయింపు, 100% ఆదాయపన్ను మినహాయింపు, 30% క్యాపిటల్ ఇన్‌వెస్ట్‌మెంట్ సబ్సిడీ, వర్కింగ్ క్యాపిటల్ ఋణములపై 3% వడ్డీ రాయితీ, 100% ఇన్సూరెన్స్ ప్రీమియం రీఎంబరెన్స్‌మెంట్, ముడిసరుకులు మరియు తయారైన సరుకుల రవాణా చార్జీలలో 90% రవాణా రాయితీ మున్నగు ప్రోత్సాహకాలు లభిస్తాయి. అందువలననే ప్రత్యేక హోదా రాష్ట్రాలలో నూతన పరిశ్రమలు అధిక సంఖ్యలో స్థాపించబడతాయి. నవ్యాంధ్ర రాష్ట్రం ఇప్పుడున్న పరిస్థితులలో పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధి సాధించబడాలంటే ఇటువంటి ప్రోత్సాహకాల ఆవశ్యకత ఎంతగానో ఉంది.



ఇందుకు బదులుగా ఇప్పుడు కేంద్రప్రభుత్వం నవ్యాంధ్రకు ప్రత్యేక ప్యాకేజి ప్రకటిస్తానంటున్నది. ప్రత్యేక హోదా వలన ఒనగూడూ ప్రయోజనాలకు మించిన ప్రయోజనాలు చేకూరుతాయని నమ్మబలుకుతూ ఉంది. తాజాగా ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ అర్థరాత్రి ప్రకటన ఇందులోని డొల్లతనాన్ని బహిరంగపరుస్తూ ఉంది. ఉదాహరణకు పోలవరం ప్రాజెక్టు విషయమే చూస్తే విభజన చట్టంలో సెక్షన్ 90 ప్రకారం పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్ట్‌గా ప్రకటించటమేకాక అవసరమైన అన్ని అనుమతులను ఇవ్వడమేకాక ప్రాజెక్టు నిర్మాణాన్ని కూడా కేంద్రమే చేపడుతుందని చాలా స్పష్టంగా పేర్కొన్నది. దాదాపు 30 వేల కోట్లపైన ఖర్చు కాగల ఈ ప్రాజెక్టునకు విభజన అనంతరం కేంద్రం నుండి రూ.835 కోట్లు మాత్రమే వచ్చాయి. జాతీయ హోదా ప్రాజెక్టునకు కేంద్రం 90% నిధులు అందించాల్సి ఉంటుంది. ఇప్పుడు తాజాగా మరొక 10% కూడా తానే భరించుతానని హామీ ఇస్తూ ఉంది.

బుందేల్‌ఖండ్ ప్రాంతమునకు రూ7200 కోట్లు, ఒరిస్సాలో కోరాపుట్-బోలంగిర్-కలహండి జిల్లాలకు ఏటా దాదాపు జిల్లాకు రూ.250/-కోట్లు ఇచ్చిన కేంద్రం, నవ్యాంధ్రలో వెనుకబడిన 7 జిల్లాలకు జిల్లాకు రూ.50కోట్లు చొప్పున కేటాయించటం ఎంతమాత్రం సరికాదు. ఇప్పుడుకూడా ఇదేరీతిలో 6 సం.లపాటు ఇస్తామని ప్రకటించడాన్ని ఎలా ఆమోదించాలి? ఇక్కడ మరొక ముఖ్య విషయాన్ని గమనించాల్సి ఉంది. గత 2 సం.లలో 7 జిల్లాలకు కేంద్రం నుండి వచ్చిన రూ.700 కోట్లకు గాను ఆ జిల్లాలలో కేంద్ర సూచనల ననుసరించి చేపట్టవలసిన కార్యక్రమాలు ఏ మేరకు జరిగాయో, ఎంత ధనం ఖర్చు చేయబడిందో ఇప్పటివరకు కేంద్రానికి "యుటిలైజేషన్" సర్టిఫికెట్‌లు పంపబడలేదు. రాష్ట్ర ప్రభుత్వం యొక్క బాధ్యతా రాహిత్యానికి ఇదొక తార్కాణం.

రెవిన్యూలోటు గురించి రాష్ట్రప్రభుత్వం పలు పర్యాయములు కేంద్రంతో మొత్తుకున్నా ఇప్పటికి ఇచ్చినది 4000 కోట్లు. జైట్లీగారు 201520 కాలవ్యవధిలో 10000 కోట్లు ఇవ్వనున్నట్లు ప్రకటించటం రాష్ట్ర ప్రజానీకాన్ని మభ్యపెట్టటమే. ఎందుకంటే 14వ ఫైనాన్స్ కమీషన్ రెవిన్యూ లోటు రాష్ట్రాలకు 2015-20 కాలములో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ.22,113 కోట్లు "గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా అందచేయాలని లోగడే సిఫార్సు చేసి ఉన్నది.

నవ్యాంధ్ర రాజధానిలో ప్రభుత్వం పరిపాలనకు అత్యంత అవసరమైన రాజ్‌భవన్, సెక్రటేరియట్, హైకోర్టు, అసెంబ్లీ, కౌన్సిల్ భవనములతోపాటు మంత్రులు, శాసనసభ, మండలి సభ్యులు, అధికార్లు మున్నగు వారికి అవసరమైన నివాసాలు, మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని కేంద్రం అందించాలని చాలా

స్పష్టంగా విభజన చట్ట సెక్షన్ 94(3)లో పేర్కొనబడింది. విజయవాడ, గుంటూరు నగరాలలో కొన్ని మౌలిక వసతుల అభివృద్ధికి కేటాయించిన 1000 కోట్లు కాక రాజధానిలో భవన నిర్మాణముల కొరకు రూ.1500 కోట్లు అందచేసింది. దాదాపు 6 సం.లుగా చత్తీస్‌ఘడ్ నూతన రాజధాని నయారాయపూర్ నిర్మాణమునకు ఇప్పటి వరకు కేంద్రం అందచేసినది సుమారు 2000 కోట్లు మాత్రమే. అటువంటిది మన రాష్ట్రంలో రాజధాని నగర నిర్మాణ కార్యక్రమం మొదలు అవ్వక ముందే రూ.1500 కోట్లు ఇచ్చింది. సింగపూర్ సంస్థలు అందచేసిన "సీడ్ క్యాపిటల్" మాష్టర్ ప్లాన్‌లో సెక్రటేరియట్ భవనం ఎక్కడ వస్తుందో స్పష్టంగా పేర్కొనబడినప్పటికీ రూ.800కోట్ల వ్యయంతో వెలగపూడి వద్ద తాత్కాలిక సెక్రటేరియట్ భవనాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్మించడం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న దుబారా వ్యయానికి మరొక తార్కాణము. రాజధానిలో అత్యవసరంగా ఏర్పాటు కావలసినవి ప్రభుత్వ భవనములు. వాటి విషయంలో త్వరితంగా నిర్ణయాలు తీసుకుని, టెండర్లు పిలిచి ప్రభుత్వ భవనముల సముదాయ నిర్మాణ కార్యక్రమం ప్రారంభించకుండానే "స్విస్ చాలెంజ్" పద్ధతిలో సింగపూర్ సంస్థలతో ప్లాట్ల అమ్మకం, వాణిజ్య-గృహ సముదాయాల నిర్మాణమునకు యుద్ధ ప్రాతిపదికన కార్యక్రమాన్ని ముందుకు తీసుకు వెళ్ళటం ఆశ్చర్యకరం!

ఇప్పటికైనా వెంటనే ప్రభుత్వ భవనముల సముదాయము యొక్క సవివర ప్రాజెక్ట్ రిపోర్టును కేంద్రానికి పంపించి కేంద్రం నుండి నిధులను రాబట్టేందుకు కృషి జరగాలి.

దాదాపు 2 1/2 సం.లుగా నవ్యాంధ్రకు ప్రత్యేక హోదా అంశం కోట్లాది ప్రజల హృదయాలలో సజీవంగా ఉంది. కేంద్రమంత్రులు మరియు రాష్ట్రమంత్రులు అనేక పర్యాయములు కేంద్రప్రభుత్వం ప్రత్యేక హోదా అంశాన్ని పరిశీలిస్తూ ఉందని, త్వరలో ప్రకటన వస్తుందని చెబుతూ వచ్చారు. ఇప్పుడు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ప్రత్యేక హోదా సాధ్యం కాదని స్పష్టం చేయటం 5 కోట్ల నవ్యాంధ్ర ప్రజలను అవమానించటమే. ఈ పరిస్థితిని నవ్యాంధ్ర ప్రజానీకం ఎంతమాత్రము సహించదు. కావున కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేసి ఆంధ్రప్రదేశ్‌కు అవసరమైతే మరికొన్ని వెనుకబడిన రాష్ట్రాలకు ప్రత్యేక హోదాను ప్రకటించాలని తెలుగు ప్రజలు కోరుకుంటూ ఉన్నారు. ఇటీవల పార్లమెంట్‌లో ఈ అంశం మీద చర్చ జరిగినపుడు అశాస్త్రీయంగా, అసంబద్ధంగా ఏర్పాటైన నవ్యాంధ్రకు ప్రత్యేక హోదా విషయంలో పలు ఇతర రాష్ట్రములకు చెందిన వివిధ రాజకీయ పక్షాలు మద్దతు ప్రకటించిన వాస్తవాన్ని కేంద్రం మరువరాదు.

❋ ❋ ❋



# ప్రజా సమస్యల పరిష్కారం - వికేంద్రీకరణతో కూడిన పరిపాలన ఈనాటి తక్షణ అవసరం

ఆంధ్రప్రదేశ్ విభజనానంతరం జరిగిన సార్వత్రిక ఎన్నికలలో నవ్యాంధ్రప్రదేశ్ ప్రజలు గంపెడు ఆశలతో చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో తెలుగుదేశం పార్టీని గెలిపించారు. దాదాపు 10 సం.లపాటు డా॥ వై.యస్. రాజశేఖరరెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డిల ప్రభుత్వముల హయంలో దారితప్పిన పరిపాలనా వ్యవస్థను చక్కదిద్ది, గతంలో 9 సం.ల పాటు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్ళిన అనుభవంతో నవ్యాంధ్రప్రదేశ్‌ను కూడా ఆ తరహాలో ప్రగతిబాటలో పయనింప జేస్తాడని ప్రజలు భావించారు. అంతకుముందు అభివృద్ధినంతా హైదరాబాద్ నగరంలోనే కేంద్రీకరించిన తరహాలో కాకుండా వికేంద్రీకరణ ద్వారా 13 జిల్లాలలో ప్రజల సత్వర సామాజిక, ఆర్థిక అభివృద్ధికి దోహదం చేయగలనని తెలుగుదేశం ఎన్నికల ప్రణాళిలో పేర్కొన్నట్లు, పదేపదే బహిరంగ సభలలో చంద్రబాబు చేసిన వాగ్దానాలను ప్రజలు విశ్వసించారు. రైతులు, చిరు వ్యాపారులు, శ్రామికులు, సామాన్య ప్రజానీకం దైనందిక జీవితంలో ఎదుర్కొంటున్న పరిపాలనాపరమైన పలు ఇబ్బందులను, సమస్యలను పరిష్కరిస్తూ సమర్ధవంతమైన, పారదర్శకమైన సుపరిపాలనను అందించాలనే ప్రజానీకం గాఢంగా కోరుకున్నది.

నూతన ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి నేటివరకు జరుగుతూ ఉన్న పరిణామాలు ప్రజలను తీవ్రమైన నిరుత్సాహానికి, నిస్పృహకు గురి చేస్తున్నాయి. రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వవలసిన ప్రక్రియలో వేల నుండి లక్షల రూపాయల వరకు ముడుపులు చెల్లించవలసిన దుస్థితి కొనసాగుతూవుంది. యం.ఆర్.ఓ. యం.డి.ఓ. పోలీస్ స్టేషన్ మున్నగు వ్యవస్థలతో సహా ఏ ఒక్క డిపార్ట్‌మెంట్‌లోను ముడుపులు చెల్లించనిదే పని జరగని పరిస్థితి కొనసాగుతుంది. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఐ.టి., ఐ.టి.ఇ.ఎస్.లను విస్తృతంగా ఉపయోగించాలనే ముఖ్యమంత్రిగారి పాలనలో డ్వాక్రా మహిళా సంఘముల ద్వారా ఇసుకను ప్రజలకు అందించే నూతన విధానం గాడి తప్పిందని, ఇసుకాసురులకు అడ్డుకట్ట వేయలేకపోతున్నామని ప్రభుత్వమే అంగీకరించింది. అంతకుముందుకన్నా దాదాపు రెట్టింపు ఖరీదుకు ఇసుక అమ్మకాలు జరుగుతూ, కొంతమంది పలుకుబడి కలిగిన నాయకులకు కోట్లాది రూపాయల అక్రమార్జనకు అవకాశం కలుగుతుండడం చూస్తున్నాం.

విభజన చట్టంలో నవ్యాంధ్రప్రదేశ్‌కు కల్పించబడుతాయన్న ప్రయోజనాలను సిద్ధింపచేయటంలో కేంద్రప్రభుత్వం తగిన చొరవ తీసుకోవడం లేదు. విభజన చట్టంలోని

అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి రాష్ట్ర ప్రభుత్వపక్షంగా చేపట్టవలసిన చర్యలను చంద్రబాబు ప్రభుత్వం ఎందువల్లనో అలక్ష్యం చేస్తూవుంది. ఉదాహరణకు విభజనచట్టంలో 10వ షెడ్యూలులో పేర్కొనబడిన రాష్ట్రస్థాయి 107 సంస్థలు తెలంగాణా, నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని ప్రజలకు ఉభయ రాష్ట్ర ప్రభుత్వాలు ఒక సంవత్సరం లోపల చర్చించుకుని అంగీకరించిన విధివిధానాలను అనుసరించి సేవలను కొనసాగించాలని పేర్కొనబడింది. ఒకవేళ ఉభయ రాష్ట్రప్రభుత్వాలు ఒక అంగీకారానికి రాలేకపోతే దరిమిలా కేంద్రప్రభుత్వం నిర్ణయం చేస్తుందని స్పష్టంగా పేర్కొనబడింది. ఆ దిశగా సంవత్సరం లోపల ఒకరిద్దరు సీనియర్ ఐ.ఎ.ఎస్. ఆఫీసర్లను ప్రత్యేకించి ఆ అంశములో పేర్కొనబడిన సంస్థల విషయంలో నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతిపాదనలను రూపొందించుకుని తెలంగాణా ప్రభుత్వంతో చర్చించవలసిన కార్యక్రమం జరుగలేదు. ఉదాహరణకు బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ ద్వారా విద్యను అభ్యసించవలసిన నవ్యాంధ్రప్రదేశ్‌కి చెందిన వేలాదిమంది విద్యార్థినీ విద్యార్థులకు ఇంతవరకు అడ్మిషన్ల విషయంలో అయోమయ పరిస్థితి కొనసాగుతూఉంది. తెలుగు యూనివర్శిటీ ఆధ్వర్యంలో రాజమండ్రి, కూచిపూడి, శ్రీశైలంలలో నిర్వహించబడుతూ ఉన్న విద్యాసంస్థలలో పనిచేస్తూఉన్న సిబ్బందికి గత కొన్ని నెలలుగా జీతాలు అందడం లేదు. వారందరికి కలిపి నెలకు 5లక్షల రూపాయలు అయ్యే వేతనాల మొత్తాన్ని చెల్లించకపోవడాన్ని ఏమనుకోవాలి. పౌల్ట్రీ రంగం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటూవున్న నేపధ్యంలో పౌల్ట్రీ అసోసియేషన్ వారి అభ్యర్ధన మేరకు తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ టారిఫ్‌లో రెండు రూపాయలు రాయితీ ఇవ్వగా అదేవిధంగా నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని అభ్యర్ధించినా 5 మాసాలు గడిచినప్పటికే ముఖ్యమంత్రి నుండి స్పందన కరువైంది.

ఏటా కేంద్రప్రభుత్వానికి 19వేల కోట్ల రూపాయలకు పైగా ఎక్సైజ్ పన్ను రూపంలో ఆదాయాన్ని పొగాకు ఉత్పత్తులు సమకూరుస్తున్నాయి. గతంలో పొగాకు ధరల సంక్షోభాలు తలెత్తినప్పుడు కేంద్రప్రభుత్వం ఎస్.టి.సి.ని రంగంలోకి దించి రైతులకు ఆమోదయోగ్యమైన ధరలను ఇచ్చి కొనుగోలు చేస్తూ ఉండేది. ఈ సంవత్సరం పలు పర్యాయములు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రప్రభుత్వం చర్చించినా, రాష్ట్రానికి చెందిన వ్యక్తే కేంద్రంలో వాణిజ్యమంత్రిగా ఉన్నా ఈనాటికి సంక్షోభం కొనసాగుతూ పలువురు పొగాకు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న బాధాకరమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్.టి. రామారావుగారి సమయం నుండి చంద్రబాబు నాయుడు పాలనలో టుబాకో గ్రోయర్స్, కో-ఆపరేటివ్ సొసైటీనకు పొగాకు కొనుగోళ్ళ నిమిత్తం కొన్నికోట్ల రూపాయలను అడ్వాన్సు చేయడం, ఆ సొసైటీ తిరిగి ఆ మొత్తాలను రాష్ట్రప్రభుత్వానికి జమచేయడం జరుగుతూ వచ్చింది. కాని ఈ సంవత్సరం మాటలే తప్ప క్రియలో సంక్షోభంలో ఉన్న పొగాకు రైతులను ఆదుకొనేందుకు తగు చర్యలను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చేపట్టకపోవడం రైతాంగం పట్ల వారి అలక్ష్యానికి తార్కాణం.

భారతదేశం ఏటా వేలాదికోట్ల రూపాయలు విదేశీమారక ద్రవ్యం వెచ్చించి లక్షల టన్నుల పామాయిల్‌ను దిగుమతి చేసుకుంటూ ఉంది. ఒకవైపున 3 రెట్లుగా పెరిగిపోయిన ఎరువుల ధరలు, సాగువ్యయం మరొకవైపు టన్నుకు దాదాపు 3 వేల రూపాయలు ధర తక్కువగా లభించుతూ ఉన్న పరిస్థితులలో ఆయిల్‌పామ్ సాగు



గిట్టుబాటుకాక రైతులు ఆయిల్‌పామ్ తోటలను పెకలించుతూ ఉన్న దుస్థితి కల్పించుతూ ఉంది. వాస్తవానికి మనదేశంలో ఆయిల్‌పామ్ సాగునకు ప్రోత్సాహాన్ని అందించడంతోబాటు గిట్టుబాటు అయిన ధరలను ఇవ్వగలిగితే ఇతర దేశాల నుండి పెద్ద ఎత్తున దిగుమతులు చేసుకోవలసిన అవసరం తప్పుతుంది. కాని అందుకు అవసరమైన విధానమును రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు చేపట్టడం లేదు.

ఇటువంటి పలు ఉదాహరణలతోబాటు రైతులకరుణమాఫీ, 2 రూపాయలకే త్రాగునీటి సదుపాయం, రూ.500కోట్లతో ధరల స్థిరీకరణ నిధి, మున్నగు వాగ్దానాల అమలులో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనబడుతూనే ఉంది. 50వేల రూ.ల పైన 1 1/2లక్షల మధ్యలో ఉన్న రైతు రుణాల విషయంలో ప్రభుత్వం అందిస్తూ ఉన్న సహాయం వడ్డీలకే సరిపోతూవుంది. రాష్ట్రప్రభుత్వం ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక పరిస్థితులలో అద్భుతాలను చేయగలదని ప్రజలు భావించడం లేదు. అవకాశం ఉన్న మేరకు ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ సామాన్య ప్రజల సమస్యల పరిష్కారానికి, సదుపాయాల కల్పనకు కృషిచేయాల్సి వుంది. అందుకు భిన్నంగా ఈనాడు రాష్ట్రప్రభుత్వం తీసుకుంటూఉన్న పలు నిర్ణయాలు ప్రజలలో అయోమయాన్ని సృష్టిస్తున్నాయి.

ఉదాహరణకు విశాఖపట్నంలో 970 ఎకరాలలో నిర్వహించబడుతూఉన్న విమానాశ్రయమంలో ఇప్పటికే విదేశాలకు విమాన సర్వీసులు ప్రారంభించబడ్డాయి. క్రిందట కేంద్రప్రభుత్వ హయంలో రూ.250 కోట్లు, ప్రస్తుత కేంద్రప్రభుత్వం దాదాపు 100 కోట్లు వెచ్చించి విమానాశ్రయాన్ని ఆధునీకరించారు. విశాఖపట్టణానికి అత్యంత సమీపంలో రామ్‌బిల్లి వద్ద భారత నావికాదళం వారికి రాష్ట్రప్రభుత్వం 5 వేల ఎకరాలను సమకూరుస్తూ ఉంది. కావున ముఖ్యమంత్రి, మన రాష్ట్రం నుండి కేంద్రములో వున్న మంత్రులు ప్రధానమంత్రితో, రక్షణశాఖ మంత్రితో మాట్లాడితే విశాఖ విమానాశ్రయానికి అనుకొని ఉన్న 300 ఎకరాలను విమానాశ్రయానికి జతచేయడానికి అభ్యంతరం ఉండదు. లోగడ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా, వాజ్‌పాయ్ ప్రధానిగా ఉండగా విశాఖ స్టీల్‌ప్లాంట్ వారి నుండి 1100 ఎకరాల భూమిని గంగవరం పోర్టు అభివృద్ధి కొరకు ఇచ్చిన ఉదాహరణ ఉంది. కాని మన రాష్ట్ర ప్రభుత్వం భాగాపురంలో రాష్ట్రప్రభుత్వ క్రిందున్న 1600 ఎకరములుకాక రైతుల నుండి 3600 ఎకరముల భూమిని సేకరించాలని నోటిఫికేషన్ జారీచేసింది. దాదాపు నెలరోజుల పైగా ఆ గ్రామాలలోని యావన్మంది ప్రజానీకం నిరాహారదీక్షల ద్వారా, జిల్లా కలెక్టరు, ఇతర అధికారులకు తాము భూమిని ఇచ్చేదిలేదని స్పష్టంగా తెలియపరుస్తూ ఉన్నా, ఇటీవల రాష్ట్రప్రభుత్వం భోగాపురం ఇంటర్ నేషనల్ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంటు కంపెనీని ఏర్పాటు చేసి బ్యాంకుల నుండి రూ.1400 కోట్ల రుణాన్ని సేకరించుటకు ఆమోదం తెలపడం విడ్డూరం. రైతుల అనుమతి లేకుండా, సామాజిక ప్రభావ అంచనా లేకుండా, పర్యావరణ అనుమతులు లేకుండా అడ్డగోలుగా భూములను తీసుకోవాలని ప్రయత్నం చేయడం, చట్టాలను గౌరవిస్తూ అమలు చేయవలసిన ప్రభుత్వానికి ఎంతమాత్రం తగదు. ఇదే సందర్భంగా బొంబాయి ఇంటర్ నేషనల్ ఎయిర్‌పోర్టు 1850 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. సంవత్సరానికి 3 కోట్ల 77 లక్షల కోట్లమంది ప్రయాణీకులతో 7 లక్షల టన్నుల కార్గోతో, రోజుకు 780 విమాన రాకపోకలతో నిర్వహించబడుతూ ఉన్న వైనాన్ని

గమనించాల్సి ఉంది. విశాఖపట్నంలో సంవత్సరానికి 11 లక్షల మంది ప్రయాణీకులు, 2800 టన్నుల కోర్గో, రోజుకు 32 విమాన సర్వీసులు మాత్రమే ఉన్నా విశాఖపట్నం విమానాశ్రయాన్ని భోగాపురం వద్ద 5300 ఎకరాలలో ఏర్పాటు చేయాలని ఆలోచన చేయడం ఏ కోణంలో చూసినా సమర్థనీయం కాదు.

అలాగే విజయవాడ వద్ద ఉన్న విమానాశ్రయాన్ని అంతర్జాతీయ స్థాయికి అభివృద్ధి చేయటానికి విభజన చట్టంలో హామీ ఇవ్వబడింది. అందుకు అనుగుణంగా ఇప్పుడున్న 540 ఎకరాలకు తోడు అదనంగా 720 ఎకరాలను సేకరించాలని రాష్ట్రప్రభుత్వం ప్రయత్నిస్తూ ఉంది. ఆ సందర్భంగా సమీపంలో ఉన్న ఏలూరు కాల్వను భారీ వ్యయంతో ఎలైన్‌మెంట్ మార్చవలసిన ఆవశ్యకత కూడా ఉన్నది. ఈ ప్రయత్నం నడుస్తూ ఉండగానే ఇటీవల ముఖ్యమంత్రి విజయవాడలో కొంతమంది పారిశ్రామిక వేత్తలతో చర్చించిన సందర్భంలో గన్నవరం వద్ద అంతర్జాతీయ విమానాశ్రయం తాత్కాలికమని, మంగళగిరి వద్ద 5 వేల ఎకరాలలో గ్రీన్‌బెల్ట్ ఇంటర్ నేషనల్ ఎయిర్‌పోర్టును సాధ్యమైనంత త్వరగా నిర్మించబోతున్నట్లు చెప్పడం వారికి విస్మయాన్ని కలిగించింది. ప్రస్తుతం ఇటీవల పెరిన ట్రాఫిక్ కలిపి విజయవాడ విమానాశ్రయం నుండి 11 లక్షలప్రయాణీకులు మాత్రమేనన్న విషయాన్ని మర్చిపోరాదు.

విజయవాడలో 39 కిలోమీటర్ల మెట్రో రైలు నిర్మాణానికి సుమారు 7600 కోట్ల రూపాయల ఖర్చు కాగలదని, 10 – 15 సం.ల వరకు ప్రాజెక్టు ఆర్థికంగా గిట్టుబాటుకాదని, కావున ప్రైవేటు డెవలపర్ ముందుకు రాకపోవచ్చని, కావాలనుకుంటే రాష్ట్రప్రభుత్వమే చేపట్టవలసి ఉంటుందని ఢిల్లీ మెట్రోరైల్ కార్పోరేషన్ శ్రీధరన్ స్పష్టంగా కొద్ది నెలల క్రితం చెప్పి ఉన్నారు. (గంటకు కనీసం 15వేల మంది ప్రయాణం చేయవలసి ఉండగా విజయవాడలో ప్రస్తుతం 2వేల మంది మాత్రమే ప్రయాణీకులు ఉంటారు). కావున ఈ మెట్రో ప్రాజెక్టునకు కేంద్రప్రభుత్వం ఏ మేరకు ఆర్థిక సహకారమును అందించగలదో, రాష్ట్రప్రభుత్వం ఎన్ని నిధులను కేటాయించగలదో, జపాన్‌కు చెంది “జైకా” ఎంత రుణాన్ని సమకూర్చగలదో అన్న విషయాలు నిర్ధారణ కాకుండానే ఇటీవల మెట్రో రైలు నిర్మాణ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం టెండర్లను పిలవడం ఆశ్చర్యకరం.

ఇప్పటికే నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వంపై అనగా ప్రజలపై దాదాపు రూ. 1.25 లక్షల కోట్ల రుణ భారం, వేల కోట్ల రూపాయల ఆర్థిక లోటు, వేల కోట్ల రూపాయల రెవిన్యూ లోటు, వేలకోట్ల రూపాయల ఓవర్‌డ్రాఫ్టులతో సతమతమవుతూ ఉన్న పరిస్థితులలో ఇప్పుడు అవసరం లేని, ఆర్థికంగా గిట్టుబాటుకాని, భారీ వ్యయంతో కూడిన ప్రాజెక్టులను చేపట్టాలనే ఆలోచనలను విరమించి, వ్యవసాయం, నీటిపారుదల, ఆరోగ్యం, సుపరిపాలన అంశములపై దృష్టిని సారించాల్సి ఉంది. విభజన చట్టంలో 9వ షెడ్యూలులో పేర్కొనబడిన రాష్ట్రస్థాయి సంస్థల ఆస్తుల, అప్పులు అంశంపైన దృష్టి పెట్టి కేంద్రప్రభుత్వం చేత ఈ సంస్థల పంపిణీకి వెంటనే చర్యలను చేపట్టేటట్లు ఒత్తిడి తీసుకురావలసిన అవసరం ఎంతైనా ఉంది. శ్రీకాకుళం నుండి అనంతపురం వరకు ప్రతి జిల్లాలోను అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి అభివృద్ధిని, పరిపాలనను వికేంద్రీకరించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఎంతో అనుభవం, కష్టపడి పనిచేసే మనస్తత్వం కలిగిన చంద్రబాబు నాయుడు ఇకనైనా ఈ కోణంలో తగు చర్యలను చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.



# వడ్డే శోభనాద్రీశ్వరరావు

## సంక్షిప్త సమాచారం

| | | |
|---|---|---|
| జనకులు | : | లేటు వడ్డే అంకయ్య –శ్రీమతి అన్నపూర్ణమ్మ గార్లు |
| జననం | : | 21-10-1943 ఉయ్యూరులో |
| విద్యార్హతలు | : | బి.ఎస్.సి., బి.ఇ. (మెకానికల్) |
| రాజకీయ ప్రస్థానం | : | 1972లో ఉయ్యూరు నుండి కాకాని గారిపై శాసనసభకు పోటీ<br>1977లో మచిలీపట్నం పార్లమెంటు సభ్యునిగా పోటీ<br>1978–83 ఉయ్యూరు శాసనసభ్యునిగా ఎన్నిక<br>1984–89 విజయవాడ 8వ లోక్‌సభ సభ్యునిగా ఎన్నిక<br>1991–96 విజయవాడ 10వ లోక్‌సభ సభ్యునిగా ఎన్నిక<br>1997–99 న్యూఢిల్లీలో ఏ.పి. ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియామకం<br>1999–2004 మైలవరం శాసనసభ్యునిగా ఎన్నిక మరియు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా కృషి<br>2004 క్రియాశీలక రాజకీయాల నుండి స్వచ్ఛంద విరమణ |
| సామాజిక సేవలు | : | కలువపాముల గ్రామంలో మాతామహుని స్మారకార్థం పశువైద్యశాల మరియు పాల సేకరణ కేంద్ర భవనముల నిర్మాణం |
| | : | గండిగుంట దత్తాశ్రమంలో “వడ్డే శోభనాద్రి ఏ.సి. కళ్యాణ మండపము” నకు రూ. 10 లక్షల విరాళం. |
| | : | ఉయ్యూరు ఏ.జి. & ఎస్.జి. సిద్ధార్థ కళాశాలలో “వడ్డే శోభనాద్రి – యు.జి.సి. మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం”నకు రూ. 10 లక్షల విరాళం |
| | : | ఉయ్యూరులో లయన్స్ ఇంటర్ నేషనల్ డయాలసిస్ సెంటర్‌నకు రూ. 60 లక్షల విలువ చేయు స్థలం బహూకరణ |
| సందర్శించిన విదేశములు | : | యు.ఎస్.ఏ., బ్రిటన్, ఫ్రాన్స్, జర్మని, నెదర్లాండ్స్, చైనా, సింగపూర్, హాంకాంగ్, ఫిలిప్పీన్స్, శ్రీలంక, నేపాల్ |
| పుస్తక రచనలు | : | ఆంధ్ర రైతు ఆవేదన, దగాపడిన ఆంధ్రరైతు (శాసనసభ ప్రసంగాలు) |
| | : | ప్రజల ఎదురుతెన్నులు – పాలకుల తీరుతెన్నులు (8వ లోక్‌సభలో ఇంగ్లీషు ప్రసంగాలకు అనువాదం) |
| | : | రైతువాణి (10వ లోక్‌సభలో ఇంగ్లీషు ప్రసంగాలకు అనువాదం) |
| | : | దేశం కోసం రైతు – రైతు కోసం ఎవరు? (దినపత్రికలలో ప్రచురించబడిన వ్యాసాల సంపుటి) |
| | : | సమైక్యతతోనే తెలుగు జాతి ప్రగతి |
| | : | అమరావతి – నవ్యాంధ్ర ప్రజా రాజధాని అయ్యేదెలా? |
| | : | గోరంత పెట్టుబడితో సింగపూర్ సంస్థలకు కొండంత లబ్ధి |
| ప్రచురించిన పుస్తకములు | : | కిసాన్ ప్రధాని – చౌధురి చరణ్‌సింగ్ |
| | : | అపర భగీరథుడు డా॥ కె.ఎల్.రావు (క్యూసెక్స్ క్యాండిడేట్ అనువాదం)<br>గాంధేయపథంలో (ఇన్ ది గాంధేయన్ పాత్‌నకు అనువాదం)<br>ప్రజాసేవలో నా జీవన ప్రస్థానం (ఆత్మకథ) |

## వడ్డే శోభనాద్రీశ్వరరావు



1) విద్యార్థి దశ నుండి ఆచార్య రంగా పట్ల ఆకర్షితుడై వ్యవసాయ రంగం – సమస్యల పట్ల ఆసక్తి – అధ్యయనం.

2) 1978 నుండి 1983 వరకు ఆంధ్రప్రదేశ్ శాసనసభలో చెఱకు, ప్రత్తి, వరి, పొగాకు మున్నగు వ్యవసాయ పంటల ధరల సమస్యలుపైన, ఇరిగేషన్ పథకాలపైన చర్చలలో పాల్గొనడం.

3) ఆంధ్రప్రదేశ్ కిసాన్ సమ్మేళనం అధ్యక్షునిగా నాటి ప్రధాని చౌదరి చరణ్‌సింగ్ గారిని చిలకలూరిపేటలో రాష్ట్ర మహా సభలకు, బహిరంగ సభ మరియు ఏలూరులో ధాన్యోత్పత్తిదారుల మహా సభలకు ఆహ్వానించడం.

4) విజయవాడలో పులిచింతల ప్రాజెక్టు కొరకు నాటి వివిధ రాజకీయ పక్షాల నాయకులను ఆహ్వానించి సదస్సు నిర్వహించడం.

5) టంగుటూరి అంజయ్య గారు ముఖ్యమంత్రిగా ఉండగా చెఱకు రైతులకు కొనుగోలు పన్ను ముదరా ఇప్పించుట కొరకు రాష్ట్ర చెఱకు రైతుల సంఘంతో కలసి కృషి చేయడం.

6) 8వ లోక్‌సభలో వ్యవసాయ పంటలకు గిట్టుబాటు ధరలు, భీమా సౌకర్యం, ఇరిగేషన్ సౌకర్యాలను విస్తరింపచేయవలసిన ఆవశ్యకత మున్నగు అనేక అంశములపై పలు పర్యాయములు ప్రసంగించడం

7) 10వ లోక్‌సభలో అనేక వ్యవసాయ సమస్యలపైన, డంకెల్ ముసాయిదా వలన భారత వ్యవసాయ రంగానికి ఎదురుకానున్న ఇబ్బందులు నష్టాల గురించి సుదీర్ఘంగా చర్చించడమేగాక ప్రఖ్యాత శాస్త్రవేత్త డా॥ శ్రీమతి సుమన సహాయ్ గారిచే హైదరాబాద్, విజయవాడ, ఏలూరు, జంగారెడ్డిగూడెంలలో ప్రసంగింపచేయడం.

8) పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధి నిధులకు ప్రజలు, స్థానిక సంస్థలు, ప్రజాప్రతినిధులు, జిల్లా పాల సహకార సమితి తోడ్పాటుతో 80 పాలసేకరణ కేంద్రములకు పక్కా భవనముల నిర్మాణము, లిఫ్ట్ ఇరిగేషన్ పథకములతో సహా పలు గ్రామాలకు రహదారులు, త్రాగునీరు, విద్యుత్ మున్నగు సేవలు అందించడం.

9) పంజాబ్ లోని "అప్నీ మండి" వ్యవస్థ గురించి నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడునకు చెప్పి "రైతు బజార్‌ల" ఏర్పాటుకు దోహదపడటం.

10) వ్యవసాయ మంత్రిగా ఎ) పొలంబడి బి) టి.వి.లో రైతు మిత్ర కార్యక్రమాన్ని ప్రారంభించి విస్తరణకు దోహదం చేయడం, సి) మొత్తం 23 జిల్లాలకు బెంగుళూరు లోని కేంద్రసంస్థ నుండి ఆయా ప్రాంతములలో భూమి స్వభావం ఏ పంటలకు అనుకూలం, ఎంత లోతుతో ఏ మేరకు భూగర్భ జలాలు లభ్యమో తెలియపరచ్చు [illegible] ను సమకూర్చడం డి) నీరు–మీరు కార్యక్రమంలో రైతుల భాగస్వామ్యమును కల్పించి చెరువుల లోతు కార్యక్రమానికి దోహదపడటం ఇ) చలక, దుబ్బ, నేలలో వర్షాధారంగా బి.టి. పత్తి సాగును చేపట్టవద్దని రైతులకు తెలంగాణా ప్రాంతంలో విస్తృతంగా ప్రచారం చేయించడం ఎఫ్) రాజేంద్రనగర్ ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో "చౌదరి చరణ్‌సింగ్ అగ్రికల్చర్ టెక్నాలజీ ఇన్‌ఫర్‌మేషన్ సెంటర్"ను ఏర్పాటు చేయడం.

11) అనేక వ్యవసాయ అనుబంధ రంగాల సమస్యలతోబాటు పలు అంశముల గురించి ఈనాడు మున్నగు దినపత్రికలలో దాదాపు 90 వ్యాసములను పంపడం, వాటిని "దేశం కోసం రైతు, రైతు కోసం ఎవరు?" పుస్తక రూపంలో ప్రచురించడం.

12) రైతుల ప్రయోజనాలకు భంగం కలిగే సందర్భములలో తన అభిప్రాయములను నిర్మొహమాటంగా తెలియచేయడం.

### రైతాంగ సమస్యల పరిష్కారం కోసం

# రైతాంగ సమరభేరి అవశ్యకత



**వడ్డే శోభనాద్రీశ్వరరావు**